
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4-12-'57


ANDHRA PATRIKA



పార్వతీ పరమేశ్వరులు

[రేవాలో శిల్పం. ఐదో శతాబ్దానికి ముందటిది. ఎత్తు 12½ అడుగులు]

ఫోటో : [illegible]]





ఆకాశము నీలము



పీతాంబరము పసుపుపచ్చ



గడ్డి ఆకుపచ్చ



ఆరుద్రపురుగు ఎఱుపు

ముదర రంగులు, లేక లేత రంగులు—
ఏ రంగులు వేయుటకైనా

ఎల్లప్పుడూ గుడ్‌లాస్ **నెరోలేక్** పెయింటులనే
కావాలని కోరండి

గుడ్‌లాస్ నెరోలేక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్

ఏజెంట్లు:

టి. టి. కృష్ణమాచారి & కంపెనీ,

పోస్టుబాక్సు నెం. 200, మద్రాసు.

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 15
4-12-57

Founder : K. NAGESWARA RAO

హేవిళంబి మార్గశిర, శుద్ధ ద్వాదశి బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం !

ఉషాకిరణ్

★

విశాఖపట్టణం — 3
మ్యాథిల్డీ లేఖ — 4
ఇవాన్ శేవయ్యా ! — 6
స్వయం కల్పితాలు — 13
ఇద్దరు హాస్యనటులు — 15
ప్రేమించని పెళ్లికొడుకు — 19
నక్షత్రఫలితాలు — 22
నవదేశంలో నూనెపరిశ్రమ — 25
పెట్రోల్ పుట్టుక — 26
కాలెక్స్ కథ — 27
పెళ్ళిసంగీతం — 34
విశాఖపట్టణం నూనెశుద్ధి యంత్రాగారం — 28
నూనె శుద్ధిపద్ధతి — 30
వనితాలోకం — 35
శిరోజముల సంరక్షణ — 38
వనితావాణి — 40
బాలసాహితి — 43
ప్రతిఫలం — 44
సినిమా — 49



విశాఖపట్నం

ముఖ్యమంత్రి శ్రీసంజీవరెడ్డి కాల్టెక్స నూనె శుద్ధి యంత్రాగారానికి నవంబరు 30-న ప్రారంభోత్సవం జరుపుతున్నారు

ఆంధ్రప్రదేశ్‌లో భారీపరిశ్రమల కేంద్రంగానూ, భారతదేశ ముఖ్య పారిశ్రామిక నగరాలలో ఒకటిగానూ మన విశాఖపట్టణం దిన దిన ప్రవర్థమానమవుతున్నది.

వైశాఖస్వామి దీనికి శంకుస్థాపన చేసినప్పటినుంచీకూడా ఈ పట్టణానికి చరిత్రలో ఒక విశిష్టస్థానం ఏర్పడి వున్నది. బ్రిటిష్ కంపెనీ రోజులలో-విజయనగరం గజపతులు కంపెనీ పటాలాలతో - యుద్ధం చేయటం, బ్రిటీష్ పటాలాలను చెల్లాచెదరు చేయటం చరిత్ర ప్రసిద్ధిచెందిన ఘట్టం.

కీ॥ శే॥ శ్రీ రాజా రామారాయణంగారు కింగ్‌జార్జి ఆసుపత్రికీ, ఆంధ్రా మెడికల్ కాలేజీకీ పునాదులు వేయడంతో పట్టణ ఆధునిక పురోగమనం ప్రారంభమయింది.

అపార నైసర్గిక సౌకర్యాలున్న రేవును పెద్ద రేవుగా 1922 లో మార్పుచేయడంతో, ఈ నగరం ప్రపంచమంతటితోనూ వ్యాపార సంబంధబాంధవ్యాలు స్థాపించుకోగలిగింది. ఆ సంబంధ బాంధవ్యాలు ఇప్పుడు అనుదినం అభివృద్ధి చెందుతున్నాయి.

అద్దెకొంపలతో ఆరంభమైన ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ఆవరణం ఈనాడు మన కళ్ళఎదుటే ఒక దివ్య నగరంగా మారిపోతున్నది. ఏ ఒక రంగంలోనూ కుంటుపడకుండా విశాఖపట్టణం బహుముఖంగా పురోభివృద్ధి చెందుతున్నది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం పట్టణపు పొలిమేరలు ఒకవేపు గాజువాకదాకానూ, మరోవేపు సింహాచలందాకాను, మూడోవేపు విజయనగరం రోడ్డువరకూనూ వ్యాపించాయి.

విమానాలు నిలవడానికి స్థావరం ఏర్పడటంతో విశాఖపట్టణానికి భారత విమాన మార్గాలలో ఒక ప్రధానస్థానం లభ్యమైంది. ఇంతేగాక, రెండవయుద్ధం ప్రారంభంకాకపూర్వమే సింధియా నౌకా నిర్మాణశాలకు పునాదులు వేయటం, దానిలో నౌకా నిర్మాణం కొనసాగడం, ప్రభుత్వం శ్రద్ధ వహించి నౌకా నిర్మాణ కార్యక్రమ విస్తరణకు పూనుకోవడమూ జరిగింది. పంచవర్ష ప్రణాళికలలో నౌకా నిర్మాణశాల అభివృద్ధిని ముఖ్య కార్యక్రమంగా చేర్చడం జరిగింది. హిందూస్థాన్ నౌకా నిర్మాణశాల దినదినాభివృద్ధి పొందుతున్నది.

యుద్ధ సమయంలోనే యుద్ధ నౌకా నిర్మాణాశ్రయం కూడా ఏర్పడింది. యుద్ధ నౌకాశాస్త్ర అభ్యాసానికి వీలుగా తరగతులు ఏర్పడ్డాయి. దీనికోసం ఒక కేంద్ర నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కొన్నిలక్షల ఖర్చును మంజూరు చేసింది.

ఓడల మరమ్మత్తు కోసం "డ్రైడాక్" నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రు. 2.15 కోట్లు మంజూరు చేసింది. దీనికి కావలసిన స్థలపరిశీలనా, సముద్ర పరీక్షలూ జరిగాయి. నిర్మాణం ప్రారంభంకావడమే తరువాయి.

"డాల్ఫిన్స్ శిఖ"రాగ్రంమీద నలభై మైళ్లు సముద్రంలోకి కనపడే లైట్‌హౌస్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. దీనివల్ల ఇక్కడ నౌకాయానం ఇదివరకుకన్న అనేక విధాల సులభమైంది.

విశాఖ రేవును విస్తృతపరచటానికి జపానుతో కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం రేవును విస్తృతపరచడానికి జపాను 25 కోట్లు ఖర్చుచేస్తుంది. ప్రపంచంలోని ప్రధానమైన రేవుస్థానాలతో అన్ని విధాలా ఇది సరితూగేటట్లు చేస్తారు. ఈ కార్యక్రమమూ కొద్ది రోజులలోనే ప్రారంభమవుతుంది.

విశాఖపట్టణంలో స్థాపించిన భారీపరిశ్రమ కాల్టెక్సునూనె శుద్ధి యంత్రాగారం. దీనికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు నవంబరు 30 వ తేదీన ప్రారంభోత్సవం జరుపుతున్నారు.

నూనెశుద్ధి యంత్రాగారంలో పనిచేసే ఉద్యోగస్థులకూ, పనివారికీ గృహవసతులు నవీనపద్ధతులలో నిర్మాణ మవుతున్నాయి. వాల్తేరు అప్‌లాండ్సులో జరుగుతున్న ఈ నిర్మాణ కార్యక్రమమంతా అమెరికన్ పద్ధతులలో సాగుతున్నది. దీనితో సమస్త సౌకర్యాలతో ఒక చిన్న 'అమెరికన్‌నగరం' ఇక్కడ అవతరించబోతున్నదన్నమాట.

వ్యాపారనౌకలలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వటానికి "మేఖల" అనే ఓడలో తరగతులు ఏర్పాటుచేశారు.

రెండవ ప్రణాళికలో భారీ ఎత్తున ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించింది. కొద్ది కాలంలోనే ఆనిర్మాణమూ ఇక్కడే జరుగుతుంది.

ఈపరిశ్రమలకు అవసరమైన కార్మిక నిపుణులను చేకూర్చటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక పాలిటెక్నిక్ స్కూలు స్థాపించింది. మొదటి జట్టు తయారు అవుతోంది.

విశ్వకళాపరిషత్తుకు అనుబంధకళాశాలగా ఇంజనీరింగ్ కళాశాలను ఒక దాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

ఈ పురోగమనానికి భగవత్సహాయమూ, పట్టణ జాతక ప్రభావమూ ముఖ్యకారణాలు! మానవసహాయంమాత్రం మృగ్యం.


కొద్దికాలంనుంచి నిర్మాణమవుతూన్న రైల్వేగూడ్సు వేగనుల కేంద్రం - ఇక్కడనుంచి వెళ్లిపోవలసిందే గాని కొద్దిలో తప్పిపోయింది. ఈ ప్రమాదం తప్పిపోయిందంటే విశాఖపట్టణం జాతకబలమే కారణం. విశ్వకళాపరిషత్తువారి ధర్మమా అని "గన్నరీ" స్కూలు నిర్మాణం జరగనేలేదు!

పెద్ద పరిశ్రమలన్నవి కేంద్ర ప్రభుత్వానివి కాబట్టి వీటికి వేటికీ రాజకీయాలద్వారా బాలారిష్టాలు సంభవించలేదు.

ఎవరు వద్దన్నా, ఎందరు అడ్డుపడినా-ద్రాక్షారామ,భీమేశ్వరుడులాగ పట్టణం పురోగమిస్తున్నది. ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ఈ పట్టణానిది ఉజ్జ్వల భవిష్యత్తన్నది మాత్రం నిర్వివాదమైన విషయం.

సువిశాలమైన ఆంధ్రప్రదేశ్ కంఠహారంలో పతకము కాకపోయినా, మణిపూసగా నైనా రూపొందితీరుతుంది మన విశాఖపట్టణం. ★

—కపిల గోపాలరావు



న్యూఢిల్లీ లేఖ

భారత రాజధానిలో పారిశుధ్యం

ప్రాథమిక హక్కుల సూత్రంప్రకారం వాడెక్కువ, వీడు తక్కువ అనే తేడా లేదు. పౌరులంతా సమానులే. ఇది కాగితంమీద బాగా నేఉందిగాని, ఆచరణలోమాత్రం చెలామణీ కావడం లేదు. ఢిల్లీలో ఇందుకు ఉదాహరణలు కొల్లలు.

ఢిల్లీలో 'పబ్లిక్ కారియర్' అంటే బస్సు కావచ్చు, టాక్సీ కావచ్చు, ఆటోరిక్షా కావచ్చు, టాంగా కావచ్చు. అన్నిటిలోకీ టాంగాలు పురాతనమైనవి; ఢిల్లీలో ఇవి పుష్కలంగా ఉన్నాయి. టాక్సీలకు వేరే, టాంగాలకు వేరే స్టాండులున్నాయి. ఇక్కడే వస్తోంది పరిపాలకుల భేదబుద్ధి. న్యూఢిల్లీలో టాక్సీస్టాండుల్లో అచ్చగా టాక్సీలే కాపరంఉండవు. డ్రయివర్లుకూడా అక్కడే కాపరాలుచేస్తున్నారు. టాక్సీలకి గారేజీ అద్దె, డ్రయివర్లకు ఇళ్లు అద్దె లేకుండా పోయిగానే జరిగిపోతోంది. న్యూఢిల్లీ అందానికక్కడ లోపమువుతుందోనని ఎక్కడబడితే అక్కడ మంచాలు వేసుకుని గుర్రుకొట్టి నిద్రపోయే డ్రయివర్లు కనిపిస్తారు. ఈ పోంచేరితనం మన సంస్కృతికి చిహ్నమా అని దేశభక్తులు కాస్త తీరిగ్గా ఆలోచించాల్సివుంది. "పోన్లే, పడుకుంటే పడుకున్నార్లే" అని జాలిపడడానికీ, పరిపాలకులు బాధ్యత ఎగయ్యడానికీ తేడా లేదు. నా బాధంతా ఏమిటంటే ఇలా జాలిపడే దయార్ద్ర హృదయులు టాక్సీడ్రయివర్లమీదనే ఎందుకు జాలిపడతారూ, టాంగా డ్రయివర్లమీద కూడా ఎందుకు జాలిపడరూ అని. టాక్సీలు, ఆటోరిక్షాలు వచ్చి టాంగావాళ్ళ కడుపు కొట్టాయిగదా! టాంగాలమీద ఆధారపడి ఎందరో ఎన్ని విధాలుగానో బతుకుతున్నారు గదా! టాంగా పరిశ్రమ అచ్చగా స్వదేశీ వస్తువులనే ఉపయోగిస్తుందిగదా! మరి వీళ్ళమీద లేని జాలి టాక్సీవాళ్ళమీద ఎందుకుండాలీ? టాంగావాలాలు తమకు వేరే ఇళ్లూ, తమ టాంగాలకీ, గుర్రాలకీ వేరే శాలలూ ఉంచుకోవాలి. టాక్సీ డ్రయివర్లలాగా వీరుమాత్రం టాంగాశాలల్లోనే ఎందుకు కాపరాలు చెయ్యగూడదు? టాంగాశాలలు అశుభ్రంగా ఉంటాయనా? అక్కడికి టాక్సీ స్టాండులు అద్దాలలాగా నిగనిగలాడుతున్నట్టు! న్యూఢిల్లీలో కశ్మలం తయారుచేయడంలో పోటీ పెడితే టాక్సీడ్రయివర్లు మొదటి బహుమతి కొట్టేస్తారు. నేనుపడే బాధ పరిశుభ్రత విషయమైకాదు—న్యాయచట్టం ఒకరికిచుట్టమై మరొకరికి కాకపోవడాన్నిగూర్చి!

ఉదాహరణ నంబర్ టూ:—ట్రాఫిక్

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

నిబంధనలను పాటించని మోటార్ డ్రయివరుకు శిక్ష పడుతుంది. అదే నేరం చేసిన సైకిల్‌వాలా టింగురంగా అని ఏ శిక్షా లేకుండా వెళిపోతాడు. నేను కొన్ని నాగరిక దేశాల రాజధానులు చూశాను. కాని అరాజకం సైకిలెక్కి షికారు చెయ్యడం ఎక్కడా చూడలేదు—ఒక్క మన రాజధానిలోనే చూశాను. ట్రాఫిక్ శాసనోల్లంఘనంలో సైకిల్ వాలాలవి అందెవేసిన చేతులు. మోత బరువనో ఏమో రాత్రిళ్ళు లైట్లు లేకుండానే సైకిళ్ళమీద తిరుగుతారు. కాని మోత బరువైతే అయిందిలే అని ఇద్దర్నీ, ముగ్గుర్నీ కూడా ఎక్కించుకుని తిరుగుతారు. నడిరోడ్లమీద రెండేసిమూడేసి సైకిళ్ళు పక్కపక్కన పోతూండడం న్యూఢిల్లీలో తరుచు కనిపించే రమణీయ దృశ్యం! సైకిళ్ల కోసం కొన్ని రోడ్లమీద ప్రత్యేకంగా దార్లు కేటాయించారు గాని, సైకిల్ దారులు అసలు ఆ దారుల చాయలకే పోరు! వీళ్ళని చూసి న్యూఢిల్లీ గర్వపడుతోంది. ఎందుకంటే పరిపాలకుల అసమర్థతకు వీళ్లు జెండా వంటి వారు.

బ్రిటిష్‌మార్కు ప్రజాస్వామ్యాన్ని సమర్థించే మహాశయులు భారత రాజధానిలో ఈ అరాజకాన్ని చూసి ఎలా సహిస్తున్నారూ అని నా ప్రశ్న. సైకిల్ వాలాలకొక న్యాయం, మోటారు డ్రయివర్లకింకొక న్యాయం ఉన్నాయా? న్యూఢిల్లీ సైకిల్ వాలాలు కొత్తరకం సంబూద్రి బ్రాహ్మణులా?

* * *

అయితే బ్రిటిష్‌మార్కు ప్రజాస్వామ్యంలోకూడా కొన్ని కొన్ని పనులు జరక్కపోవు. ఉదాహరణలు:

మధురా రోడ్డుమీద సెంట్రల్ జైలు దగ్గిర్లో ఒక విదేశీ పోస్టాఫీస్ ఉంది. శ్రేయోరాజ్య సిద్ధాంతం మూలంగా, ఇక్కడబద్ధకం బలిసిపోయింది. పోస్టాఫీసునిండా తెరిచీన పాపాన పోని టపాసంచులు కనిపించేవి. ఈ పోస్టాఫీసుపై యాజమాన్యం ఆర్థికశాఖది. మొన్న నవంబరు 19న ఆర్థికశాఖ ప్రతినిధి ఒకాయన తనిఖీచేయడానికి వచ్చారు. టపాసంచులు తెరిచి, సార్టింగ్ పనిచేసి మరీ ఇళ్ళకి వెళ్ళమని ఆయన ఉద్యోగులకు హుకుం జారీచేశారు. తక్షణం అర్జంటుగా పని జరిగిపోయింది. మూడు నెలలనుంచీ పేరుకు పోయిన పని 24 గంటల్లో అయిపోయింది.

ఇంకోటి:—పూర్వపు సప్లయి డిపార్టుమెంటు, అప్పటి వాణిజ్య, పరిశ్రమలశాఖ మాన్‌సింగ్ రోడ్డులోని జైసల్మీర్ భవనంలో ఉండేవి. దరిమిలా అందులోకి పునరావాస శాఖ ప్రవేశించింది. ఈ శాఖ కార్యదర్శి శ్రీ ధర్మవీర వచ్చీరాగానే భవనం బాగు చేయించి రాజభవనంలా తయారుచేయించారు. అంతా శుభ్రంచేయించి, కాస్త అందంగా కనబడేట్టు చేశారు. ఈ శాఖతోపనుండి ఎంతోమంది రోజూ వచ్చిపోతూ

ఉంటాయిగాని ఎక్కడా అశుభ్రంగా కనబడదు.

ఇలాగే వాణిజ్య, పరిశ్రమలశాఖకూడా శుభ్రతవిషయంలో మెచ్చతగ్గకృషి చేస్తోంది. కార్యదర్శి శ్రీరంగనాథన్ పనులు సరిగ్గా జరిగేట్టు, భవనం శుభ్రంగాఉండేట్టు మంచి శ్రద్ధ తీసుకుంటున్నారు. కిటికీ అద్దాల తలుపులమీద ఆయన దృష్టి ఇంకా పడలేదను కుంటాను. వాటిమీద పేరుకున్న దుమ్ము కూడా ఎప్పుడో దులిపించేస్తారని నానమ్మకం.

ఆహారశాఖ కార్యాలయంమాత్రం చెడ్డ రోతగా ఉంటుంది. మరుగుదొడ్ల దుర్గంధం అక్కడికి పనిమీద వచ్చిపోయేవారి తల తిప్పేస్తూ ఉంటుంది.


మళ్లీ లోక్‌సభ చూడండి. రకరకాల మనుషులు, పార్లమెంటు భవనానికి వస్తూ ఉంటారా! అయినాసరే, ఈ భవనం పరిశుభ్రతకు పర్యాయపదంగా ఉంటుంది. దీనికి ముఖ్యకారకులు లోక్‌సభ కార్యదర్శి శ్రీ కౌల్, ఆయన కిందిఉద్యోగులు. భవనాన్ని అద్దంలాగ ఉంచడంలో వీరు ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తారు.

* * *

ప్రజల్ని బుటలో వేసుకోవడ మనేది ఢిల్లీలో చక్కటి లలితకళగా అభివృద్ధి అవుతోంది. ఢిల్లీ భారత రాజధానిగనక, ఢిల్లీ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన సభ్యులు తప్ప, తదితరులంతా ఢిల్లీని తమ సొంత నియోజకవర్గంగా భావించి దువ్వుతున్నారు–శ్రీమతి సుచేతా కృపలానీ ఒక్కతె తప్ప. ప్రభుత్వస్థలాలను అక్రమంగా ఆక్రమించిన వారిని బయటికి తగిలెయ్యగూడదని ప్రధానమంత్రికి విజ్ఞప్తులు చేయడమే వీరి పని. ప్రధానమంత్రి దర్యాప్తుచేసి, సంగతి తెలుసుకుని వారి విజ్ఞప్తిని త్రోసివేస్తారు. తరవాత ఆ పార్లమెంటు సభ్యులు హోం మంత్రితో చెప్పుకుంటారు. ఆయనా దర్యాప్తుచేసి లాభం లేదంటారు. తరవాత మౌలానా ఆజాద్, చివరికి శ్రీధేబర్ భాయ్. అప్పటికి ప్రధానమంత్రి ఆకేసు సంగతి మరిచిపోయి వుంటారని వారు భావిస్తారు. మళ్లీ ఆయన దగ్గిరికి వెళ్ళి చెప్పుకొంటారు. మళ్లీ ఆయన నిరాకరిస్తారు. చివరికొక కొత్తఎత్తు వేస్తారు–పద్దెనిమిది నెలలకు పైబడి ఒక ఇంట్లో ఉన్న వాళ్లని ఇంట్లోంచి పొమ్మనగూడదని వాదిస్తారు–ప్రభుత్వస్థలాలు ఎవరి సొంతమో అయినట్టు. కమ్యూనిస్టులు ఇలాంటి పనులు చేస్తే పోనీ అనుకోవచ్చు—ఎందుకంటే ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని చీకాకు పరచడమే వారి పని. ఢిల్లీకి చెందని కాంగ్రెసు సభ్యులు చేసినా పోనీ అనుకోవచ్చు. ఏమంటే వీరికి ఢిల్లీ బాగోగులమీదకంటె తమ పలుకుబడి మీదే ప్రేమ ఎక్కువ.

ప్రభుత్వ భవనాలను అక్రమంగా ఆక్రమించినవారినీ, దానివల్ల బాధపడుతున్న వారినీ చూస్తే న్యాయచట్టం కొందరికి చుట్టమనీ కొందరికికాదనీ మళ్ళీ జ్ఞాపకం వస్తుంది.

ఈ జబ్బుకొక మందు ఉంది. ప్రభుత్వ భవనాల్ని ఆక్రమించినవారిని వారి తరఫున వాదించే పార్లమెంటు సభ్యుల ఇళ్ళల్లోకి బదిలీచేయిస్తే సమస్య తీరిపోతుంది. లేకపోతే ఇంకో చిట్కా ఉంది:– దేశపరిపాలనా విషయాల్లో ముఖ్యంగా ఢిల్లీ విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకునే పార్లమెంటు సభ్యుల పవిత్ర నామధేయాలను బాహాటంగా ప్రకటించితే వారికి కొంతైనా తెలిసి వస్తుందేమో. ★



సెభాష్ శేషయ్యా!
కటకటా కాంతమ్మా!



అలాంటి చీర
సరిగ్గా అలాంటిచీర
అంతలాంటి చీర
ఎన్నాళ్ళకి కొనగలిగేడు శేషయ్యా!
నెల కొనెల ఇంటద్దె నిచ్చుకోలేక,
కూతురుపెళ్ళికి పెళ్ళాం పురిటికీ
తండ్రి తద్దినానికి తన దినవారానికి
వడిడబ్బులు బదులుపుట్టని పరిస్థితిలో
అప్పుడప్పు డాపూట పాపాటుకు గతిలేక
ఆకలి నూకాలమ్మకు నిట్టూర్పు
ఉపారం పెట్టి
ద్వాదశినాడూ పసుపరుంటే
గుమస్తా శేషయ్య
కొన్నాడు చీర!
చీర కొనేశాడు శేషయ్యా!
సరిగ్గా అలాంటిచీర!
అంతలాంటి చీర!
ఆచీర కొనడానికి శేషయ్య
మరో అవతారం ఎత్తాలిసొచ్చింది
అతనింక ఇప్పుడు లోవర్ డివిజన్‌క్లర్కు
కాడు
అప్పర్, అప్పర్ డివిజన్ క్లర్కు!
అప్పర్ డివిజన్ క్లర్కుగా ఇంకో ఓ
నెలజీతం అందుకోలేదు
అప్పుతో తెగించి
అప్పుచేసి చీర కొనేశాడు శేషయ్యా!

తను కొనగలిగే వేళకి సరిగ్గా అలాంటి చీరదొరకడంకూడా ఒక అదృష్టమే అనుకున్నాడు.

యస్వీ జోగారావు

చీరంటే చీరా! అలాంటిలాంటి చీరా! అల్లాటప్పాచీరా! జిల్లాజడ్జీగారి పెళ్ళాం కూడా పెళ్ళిపేరంటాలకిగాని కట్టుకోని చీర!

ఆమధ్య ఒక పెళ్ళిలో తన పెదభార్య ఆడవారకం సిల్కుచీర వాలకం చూసి ఈసడించిన ఆమె తోడికోడలు తాయారమ్మ ఆ పెళ్ళికి ప్రత్యేకంగా కట్టుకొచ్చిన చీరలాంటి చీర!

తోడికోడలు ఈసడించినప్పటినుంచీ తన భార్యచేత ప్రతినెలా ఫస్టు తారీఖుముందు సత్యాగ్రహం చేయిస్తున్న చీర!

తాను ప్రమోషను అయితేకాని కొనలేనని నెలలతరబడి జరుపులు పెట్టుకుంటూ వచ్చిన చీర!

ఆ వంగపండు రంగు-జలతారు డోరియా-ఎఱ్ఱని పైటంచు - అటూ యిటూ మామిడి పిందెల జరీకమ్ములు - మధ్యంతా చారెడేసి జరీబుటేదారుగళ్ళు-గళ్ళమధ్య జరీతురాయి, చుట్టూ చుక్కలు, రకరకాల పువ్వులూ, ముగ్గులూ అవీ యివీ-వెనకెప్పుడో బరోడా యువరాణీసర్కార్ స్వయంవరానికి ప్రత్యేకంగా ఒక గొప్ప బనారస్ పనివాడు సరికొత్త టెక్నిక్‌తో తయారుచేసిన చీరలాంటి చీర!

ఖరీదులో శేషయ్య అప్పర్ డివిజన్ స్కేలుని 'గోల్' చేసే చీర!

ఆ ఫస్టు తారీఖు సాయంకాలం దీపాలు పెట్టేవేళ కాఫీసునుండి యింటిమొహం పట్టే తోవలో తోటిగుమస్తామిత్రులతో సహా సిటీ సిల్కు ఎంపోరియమ్‌లో దూరి అరగంట తటపటాయించి, గంటన్నర నాణ్యంచేసి సరిగ్గా అలాంటి చీర కనపడేసరికి అరక్షణంలో తెగించి కొనేశాడు శేషయ్య అంతే. అరువుకాదు, చెక్కుకాదు, చిక్కని నగదు దుకాణదారు చేతిలో పోశాడు శేషయ్య.

అతను చీరపేకెట్టు చిక్కనపట్టి దుకాణం మెట్లుదిగుతుండగానే అప్పటికప్పుడే గుసగుసలు ప్రారంభించారు మిగతా గుమస్తా మిత్రులు --

'అప్పుచేసి పప్పుకూడొండుకున్నాడు.'

'అప్పుచేస్తే నేంగాక పప్పుకూడే వండుకున్నాడు లే'


'ఆఁ ఆలికి కోక కొనడం ఊరికిఉపకారం.

'అదిమాత్రం ఎంతకాదు బ్రదర్.' పోరు కోసం, కోకలకోసం పోకిరీవేషాలు వేసే భార్యను చూసీచూడనట్లు వూరుకునే సనాయి ఆ కోపరేటివు స్టోర్సు సేల్సుమన్ బసవయ్యలా కాకుండా......'

శేషయ్య మాంచిహుషారులో వున్నాడు అతనికీ గుసగుసలేవీ వినపడలేదు --

'అలాంటి చీర సరిగ్గా అలాంటి చీర అంతలాంటి చీర కొన్నావు. కొని తీరేవు. సెభాష్ శేషయ్యా' అని సగర్వంగా, ఆఫ్‌కోర్సు స్వగతంగా పునశ్చరణ చేసుకున్నాడు శేషయ్య.

దారిలో ఎవరింటికివాళ్లు జారుకున్నారు.



దోర్నాలనుంచి నల్లమలకొండలమీదుగా, అతి మనోహరమైన అడవుల మధ్యగా శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంవరకూ ప్రభుత్వం నిర్మించిన రస్తాకు మొన్న నవంబరు 24న శ్రీ సంజీవరెడ్డి ప్రారంభోత్సవం జరిపారు. ప్రభుత్వమే బస్సులు నడుపుతుంది. తిరుపతి యాత్రవలె శ్రీశైలయాత్ర కూడా భక్తులకు ఇక అతి సులభసాధ్యమవుతుంది.

శేషయ్య ఇల్లు చేరుకున్నాడు.

రోజూలాకాకుండా 'ఏమేవ్! తలుపు!' అని ధీమాగా, దర్జాగా, హుషారుగా తలుపు తట్టాడు.

'కాస్త తలుపుకి తగలకండా అసింటా వుండండి తీస్తున్నా' అని వినిపించింది లోపలినుంచి. శేషయ్య మనసులో నిరుత్సాహం తలుపు తెరుచుకుంది.

కాంతమ్మ సంతోషానికి మేరలేదు. అలవాటుపడని ఆమె కళ్లు జిలుగుచీర జిగులికి జిగేలుమన్నాయి. సరిగ్గా అదే అదేరకం జరీచీర. ఆ జరీ అంచులూ, గళ్ళూ అవీ తోడికోడళ్ళలాగు చేడ్డాలు పోతున్నట్లున్నాయి. ఆమె దూరంనుంచే అరగంటసేపు తనివితీరా చూసుకుని 'సరే ఆపెట్లో మడత నలక్కుండా జాగ్రత్తగా పెట్టివుంచండి' అంది.

మాకురోజులయాక ముహూర్తం చూసుకుని శ్రీమతి జరీచీర ధారణకి ప్రారంభోత్సవం చేదామనుకొన్నాడు శేషయ్య. తీరా చూస్తే ఆ వేళ చవితి-శనివారం - కృత్తిక నక్షత్రం. పోనీ మర్నాడన్నివిధాలా బాగుందనుకొన్నాడు.

'ఏమేవ్! ఇవాళ మంచిరోజు. అన్నీ కుదిరేయి. ఈ పంచమీ ఆదివారం నాడే నువ్వు పెద్ద...వు ఆఁ. జ్ఞాపకముందా. ఇవాళ నువ్వు చీర కట్టుకుని తీరాలి' అన్నాడు అదే బతిమాలడం, అదే బలవంతంగా.

'పోన్లెద్దురూ. ఉత్తిరోజివాళ మడతెందుకు పాడుచెయ్యడం' అంది పంచాతిలో కూర తరుక్కుంటూ కాంతమ్మ అంత పట్టించుకోనట్టుగా.

'అదేమిటే ఇవాళ నాకు సెలవురోజు. నువ్వు కట్టుకుంటే కళ్ళారా ఆ ముచ్చటేదో తీరుబాటుగా చిత్తగిద్దామనుకుంటున్నాను'

'పోన్లెద్దురూ' అనే మళ్ళీ జవాబు.

శేషయ్య పెట్టెతీసి, పేకెట్టు విప్పి, చీర పొరలు తన వొంటిమీదే అటు యిటూ పరుచుకుంటూ ఎదురుగా గోడలో ఆ ఇంటాసామి తాపడం చేయించిన నిలువుటద్దంలో ఆ జరీ మెరుపుల్ని పరకాయించి మురిసిపోతున్నాడు. ఆ మడత విడిన చీర అలాగే పట్టుకుని పంచాది సమీపించాడు. అతనేదో అనబోతూ వుండగానే 'ఆ చీర మడత విప్పేసి మరీ యిక్కడికి పట్టుకొచ్చేస్తారేమిటండీ. ఈ వంటింటి పొగా, సెగా తగిలి ఆజరీ కాస్తా మాడిపోయింది' అని కాంతమ్మ విసవిసలాడింది.

'పోనీ మరి సాయంత్రమేనా కట్టు

★ సెభాష్ శేషయ్యా ★

కుంటావా ?'

'ఉత్తినే ఎందుకండీ?'

'పోనీ ఇద్దరం యివాళ మేటినీకి వెళ్దాంలే'

'సినీమాకి వస్తాన్లెండి......' నసిగింది కాంతమ్మ.

'అవును గాని అసలు సరిగ్గా అలాంటి చీరే నంటారా యిది!' అని మళ్లా సణుగుడు సాగదీసింది.

'అవునే. అచ్చుమచ్చు ఆనాడు బరోడా యువరాణీసాహేబా, ఆ మన్య మీ తాయారక్క కట్టుకొన్న చీరల్లాంటి చీర. అంచుల్లో గళ్ళల్లో నే కాదు ఆ మామిడి పిందెల్లో, పువ్వుల్లో, మొగ్గల్లో కూడా కొంతంత తేడాకూడా లేదు. అంతా సేం, చూస్తాను. ఆవేళ నువ్వుచెబితే నేనూ నిఘా యించి చూశానుగా!'

'అబ్బ ఆ చీరకట్టుకున్నానని ఆవిడెంత వేడ్డాలు పోయిందండీ ఆ వేళ! మనం కలిమిలో తక్కువవాళ్లమనేగా ఆవిడకంత యిది! ఎంత కలిగున్నవాళ్ళయినా మరీ అంత అతిశయం ఏమిటండీ! మీకు వదినె గారయితే కానీయండి గాని, ఏం మిడిసి పడిపోయింది! దీని మిడిసిపాటు...' అని క్షణంసేపు అనుకోకుండా కూర తరగడం విరమించి మెటికలు నవరించింది కాంతమ్మ.

తన భార్య పెళ్ళి పేరంటాలకిగాని ఆ చీర కట్టుకోదని తేల్చుకున్నాడు శేషయ్య. చీర మళ్ళా పదిలంగా పెట్లో పెట్టేశాడు.

రోజులు గడుస్తున్నాయి. పెళ్ళిపిలుపు లేవీ రాకుండా వున్నాయి. ఇన్నాళ్ళబట్టీ ఊళ్ళో అసలు పెళ్ళిపేరంటాలు జరగడ్లే లేదా? జరిగినా ఎవరూ తన భార్యను పిలవకుండా వున్నారా? శేషయ్యకీ సంగతీ బోధపడటం లేదు. జరిగితే ఎందుకు పిలవరు? ఆ మాటకొస్తే తానిప్పుడు అప్పర్ డివిజన్ క్లార్కు కూడా గదా!

కాని క్రమంగా తెలిసింది. అమస్య అంటే తాను జరీచీర కొన్న తరవాతే, ఒక అప్పర్ డివిజన్‌క్లర్కుగారి యింట్లోనే పెళ్ళి జరిగితే పేరంటానికూడా తన భార్యను పిలవలేదని. పాపం శేషయ్య తనకు రివర్షను వచ్చినంత యిదిగా బాధపడ్డాడు.

ఇక ఈ పేరంటాల కోసం చీర ప్రారంభోత్సవం వాయిదా పడ్డానికి వల్లకాదని గట్టిగా ఒక నిశ్చయానికి వచ్చేశాడు.

ఒకసారి ఎవరోగాని తనభార్యని నిజంగా పేరంటానికి పిలిచారట! పిలిచినవారు పెద్ద యింటివాళ్ళేనట! ఆమె వెళ్ళిందిట గూడా. కాని సదరు చీరకట్టుకోకుండా వెళ్ళిందట. ఈ సంగతి తెలిసేసరికి శేషయ్యగారికి వేళకి హైలు పట్టుకురాని గుమస్తామీద ఆఫీసరుకి వచ్చినట్లు ఆగ్రహం వచ్చింది. భార్యను నిలదీసి సంజాయిషీ అడిగాడు.

ఆమె ఏదో గొణిగింది—

ప్రప్రథమంగా తాయారమ్మ చూడడం పడినప్పుడే కాంతమ్మ చీర కడుతుంది. లేకపోతే కటదు—అనే సంగతి తేలిపోయింది.

సదరు సదవకాశంకోసం నిరీక్షిస్తున్నారు శేషయ్యగారు.

ఒకరోజు తన ఆఫీసరు యింటినుండి పెళ్ళిపిలుపు వచ్చింది. చందనతాంబూలాది సత్కారాలకు మాత్రమే కాకుండా, విందుకుగూడా పిలిచారట! ఆఫీసరు భార్యకి ఆప్తస్నేహితురాలైన తన వదినగారు తాయారమ్మకూడా అక్కడికి వస్తుందని విన్నాడు శేషయ్య. ఇంకేం తాయారమ్మ వస్తుందంటే తయారు కాంతమ్మ. అక్కడికి తన తోటి గుమస్తాల జనానావారుకూడా చాలామంది వస్తారు; తప్పక తన భార్య చీరచూసి దంగైపోతారని తలించాడు శేషయ్య. అయితే ఆఫీసరు ఇంటికి తన భార్య అంతలాంటి చీరకట్టుకుని వెళితే బాగుంటుందా అని తటపటాయించాడు.

కాంతమ్మకదేమీ పట్టలేదు. చిరతీసింది. పసుపుబొట్లు పెట్టాలనికొంటోంది కాని అప్పుడే శేషయ్యగారి నిశానితోసహా దాని మీద పసుపుబొట్లు కనిపించాయి.

ఆమె ముస్తాబై అటూయిటూ ఏదో పని మీద ఇంట్లో తిరుగుతూవుంటే శేషయ్యగారుకూడా ప్రమోషను వచ్చినవాడిలా కూడావుడి పడుతూ, ఎదటా వెనకా ఆమె

ననుసరిస్తూ ఎగా దిగా దిష్టితగిలేటట్టు ఆమె చీరసింగారం చిత్తగిస్తున్నారు.

కాంతమ్మ వయస్సు మలుపులో యీడి గిలబడుతున్న వయ్యారాన్నంతా కూడగట్టు కుంటూ, జారకుండానే పమిటకొంగు సర్దుకుంటూ, వీరకత్తెలా బయలుదేరింది పెళ్లివారింటికి.

పెళ్ళివారింటిదగ్గర ఎవరూ ఆవిడని ప్రత్యేకంగా పలకరించిన జాడలేదు. ఎవరో ఇద్దరు చిన్న అమ్మాయిలు పెళ్ళిపెద్దలపురమాయింపు ప్రకారం నలుగురితోపాటు ముక్తసరిగా ఆహ్వానించి పావిట్లో ఒకచాప వేపు దారి చూపించారు. గుప్‌చిప్‌గా ఒక మూల చతికిలబడిందావిడ చీరసర్దుకుంటూ. అక్కడ ముత్తైదువలు కిటకిటలాడుతూనే వున్నారు. కాని ఒక్కరూ తనరాకని గమనించినట్లులేదు. తానే తాయారమ్మమొహం ఎక్కడేనా కనిపిస్తుందేమోనని నాలుగువేపులా సింహావలోకనం చేసింది కాని, ఆమె కనిపించలేదు సరికదా, ఎవరూ తన చీరవేపన్నా చూసినపాపాన పోయినట్లు కానరాదు. తానేకాస్త అంతల పొంతలవారిని పూసుకుని పలకరించింది మెల్లిగా. చీరల ప్రసంగం కూడా తెగించి ఎత్తుకుంది, వాళ్ళవల్లా ఏవో చీరల ప్రసంగాలు గుసుగుసలాడుకుంటూ సాగేయి కాని తన చీర పూసుమాత్రం రాకుండా వుంది. తరుచు సర్దుబాటులో తన పమిట చెంగు కొందరి మొహాలకి తారసిల్లినా. అసలు అక్కడున్న పేరంటాళ్ళలో అంత ఖరీదైన చీర కట్టుకున్న వాళ్లొక్కరూ లేరు కూడాను. కాని అదేంకర్మమో ఎంతకీ కాంతమ్మగారి చీర ప్రసంగం మాత్రం రాకుండా వుంది.

ఎట్టకేలకు ఎత్తుకొంది ఒక నంగనాచి నాజూకుల వడివయస్సు హెడ్డు గుమస్తా పట్టమహిషి. అచ్చంగా కాంతమ్మగారి చీర గురించే, అయితే ఆ ప్రసంగం కాంతమ్మతో కాదు. అది ప్రక్కవాటుగా, కుప్పకుప్పలుగా పడివున్న పండుటాకుల మీద ప్రాకుతున్న గాలితరగలా అలా అలా సాగిపోతోంది. ఆగాలితరగలో తేలి, ఏవో నాలుగు పొడిముక్కలు కాంతమ్మ చెవిని గూడా తాకేయి.

అవసరాల శేషయ్యగారి భార్య కాంతమ్మ అలాంటి చీర కట్టిందంటే అది అసలు పట్టుచీరేనా అని అనుమానం వచ్చి వట్టుందొకరికి.

'అసలు పట్టుచీరే అయ్యుండొచ్చు' అనుకొన్నమరొకావిడకు, కాస్త జ్ఞానం తెలిసిన నారీమణికి అది పడికట్టుచీరేమో అనే అనుమానం కలిగి వట్టుంది.

విన్నగాక మొన్న మొగుడింకా అప్పర్ డివిజన్‌లో అడుగుపెట్టాడో లేదో అప్పుడే

ఈవారంలో, మేము అంకితం చేస్తున్నాము...

విశాఖపట్టణంలో ఈవారంలో అధికారరీత్యా మేము మారిఫైనరీని ప్రారంభించడం, భారతదేశంపట్లనూ, భారతీయుల పట్లనూ మాకుగల విశ్వాసానికి చిహ్నము. మేము ఈ రిఫైనరీని భారతీయులకు అంకితంచేసి, అపారమైన జాతీయ సాంప్రదాయక కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించడానికి ప్రతిజ్ఞచేస్తున్నాము.

ప్రజల సౌభాగ్యసంపదలకు పురోగమనంలో ఫలసిద్ధి సాధించే ఒక్కొక్కగంట ఒక్కొక్క అడుగువంతున ముందంజ వేయుటకు మీతోపాటు మేము శాయశక్తులా కృషిచేయుదుము. భవిష్యత్తునందు విస్తృత భారతదేశంలో ప్రజలూ - వారి బిడ్డలూ - బిడ్డల బిడ్డలూ - అనుభవించే జీవిత సౌఖ్యమే - మా ప్రతిఫలము.



సెభాష్ శేషయ్యా!

కాంతాయి కెంత సింగారంవచ్చి పడిం దని నాలిక పీక్కుందా క లోయర్ డివిజన్ క్లర్కుణి. సీనియారిటీవున్నా ఇంకా సెక్షన్ హెడ్ హోదాలో ప్రవేశానికి అవకాశం లభించక కొస్త మాగిన అప్పర్ డివిజన్ సతీమణీ అలాగే అనుకుంది! రిటైరయిన హెడ్ గుమస్తాపెళ్లామూ అదేమాట! రిటైరైన హెడ్ గుమస్తా పెళ్లామూ అదేమాట! అందరూ అదేమాట!

'పిల్ల యీసు యిదైపోనూ!'

కొంగుచాటున కాంతమ్మ మెటిక విరిచింది.

ఇంతలో వీధిగుమ్మం ముందు ఏదో కారాగిన చప్పుడు—ఆఫీసరుభార్య హడావుడిగా ఎవరినో తోడుకొనివస్తోంది. ఆ వచ్చినావిడ ఎవరో కాదు కాంతమ్మకి కొసా తోడికోడలు తాయారమ్మ. ఈ సారి ఉత్త ఊదారంగు సాదా సిల్కుచీరతో దిగబడింది! కాంతమ్మకి ఆశ్చర్యం వేసింది.

పాపం కాంతమ్మ తాను కాస్త వాళ్ల దృష్టిపథంలో పడాలని ప్రయత్నంచేసింది. తోడికోడలు తన్ను పలకరించకపోయినా, తన చీరమీద కాస్త చూపులు చిలకరిస్తే చాలనుకుంది.

ఆమె ప్రయత్నం వ్యర్థంకాలేదు. వాళ్లామెను గుర్తించకేం! గుర్తించారు. అసలా క్షణంలో వాళ్ళు చీరగురించే మాట్లాడుకుంటున్నారు. ఆ చీర చూసే ఆఫీసరుభార్య కాస్త ఆగింది. ఆవిడ అలాంటి చీరనే లోగడ తాయారమ్మ కట్టుకోగా చూసి తనకూ అలాంటిదొకటి కొనిపెట్టమని తాయారమ్మను కోరినట్లుంది. తాయారమ్మ పెళ్లి బహుమానాలకోసం తాను తెచ్చిన ఇంకేవో రకరకాల చీరల పేకెట్లు సంచిలోంచి తీసి విప్పిచూపిస్తూ, 'అలాంటి చీరలు దొరక్క కాదు. అది యిప్పుడు అప్టుడేటు కాదు. నాజూకు పోకుల నవనాగరిక యువతీమణుల అభిరుచికి అవుటాఫ్ ఫేషన్ అయిపోయిం' దని ఏమేమో వ్యాఖ్యానం ప్రారంభించింది. కాంతమ్మకి ఒంటిమీది చీరకమ్ములూ, గజ్లూ, తేల్లూ జెర్రులుగా మారిపోయినటనిపించింది. తోటి గుమస్తారాణివాసం వారిమాటలకేమీ పట్టించుకోలేదు కాని తన చీరమీద తోటికోడలిచ్చిన తీర్పుకి కటకట పడింది కాంతమ్మ. తన భర్త ఆ చీర కొనటానికి తాత్సారము చేసినంతలో ఎంతపని జరిగి పోయినది! ఫేషన్మారి పోయింది ఫేషన్! కటా! కట కటా! అక్కటకటా! ★


దంతక్షయాన్ని మరియు నోటి
దుర్వాసనను పోగొట్టండి!
Holynos TOOTHPASTE
Chlorophyll
ఆక్టివ్ క్లోరోఫిల్‌గల ఆకుపచ్చని 'కోలినోస్' టూత్‌పేస్టును వాడుట ప్రారంభించండి
ఆకుపచ్చని 'కోలినోస్' టూత్‌పేస్టులో ప్రకృతియొక్క అద్భుతమైన వింతలలో ఒకటగు ఆక్టివ్ క్లోరోఫిల్ ఉండుటవలన దానిని వాడితే పళ్లు పాడయిపోకుండా గట్టిగా ఉంటాయి! మీ ఊపిరిలో దుర్వాసనలేకుండా ఉండుటకు. మీ నవ్వుకు శోభనిచ్చుటకు ఆక్టివ్ క్లోరోఫిల్‌గల ఆకుపచ్చని 'కోలినోస్' టూత్‌పేస్టును వాడండి. ఆకుపచ్చని 'కోలినోస్' టూత్‌పేస్టు శ్రేష్ఠతకు కారణము దాని ప్రత్యేకమైన క్లోరోఫిల్ మరుగే!
ఆకుపచ్చని 'కోలినోస్'—

స్వయం కల్పితాలు

చీకటి పడుతోంది. ఆకాశం అంచులు ఎర్రగావున్నాయి. "ఈ పిల్లలు ఇంకా ఆటలు మానరు" అని విసుక్కుంటూ లేచి, చాప చుట్టేశాను.

"పదండర్రా పిల్లలూ, ఇళ్ళకి వెళ్ళరా మీరీరోజు?" అని గట్టిగా కేకేశాను. కానీ నామాట వినట్లు ఉయ్యాళ్ళు కిర్రుమంటూనే వున్నాయి. బంతి ఎగురుతూనే వుంది. పుస్తకాలన్నీ తీసుకువెళ్ళి, అలమారులో పెట్టి వచ్చింది నా అసిస్టెంటు వనజ. స్కిప్పింగుత్రాళ్ళు, రింగు, బంతులు పిల్లల దగ్గర్నించి లాక్కోవడం బ్రహ్మాండమైన పని.

బలవంతాన సెట్ విప్పేసి, గదిలోపడేసి తాళం వేసేశాను. రోజూ యిదే వరస. నేను బైటికివెళ్ళి గేటుతాళం చప్పుడుచేసే వరకు ఉయ్యాళ్ళు దిగరు యీ ఆడపిల్లలు. 'పొరబాటున మర్చిపోయినా పోతాను ఒక్కో పిల్లని' అనుకున్నాను.

బైటికివచ్చి పెద్దగేటు గొళ్ళెం చప్పుడు చేశాను. కిలకిలలాడుతూ పరుగెత్తుకొచ్చేశారు పిల్లలు. ఖాళీవూయలలు అల్లా వూగాయి కాస్సేపు. తాళంవేసి, తాళంచెవి బ్యాగ్‌లో వేసుకునేసరికి బాగా చీకటి పడింది.

చుట్టూ పిల్లలు—'అక్కయ్యా' అంటూ ఏవో ఖబుర్లు చెబుతూ. వీళ్ళ ఉత్సాహం చూస్తే, నేనుకూడా ఒక పదేళ్లు వెనక్కివెళ్ళి పోయినట్లనిపిస్తుంది. నిన్న కాక మొన్న కాదూ నేనూ కోలాటాలు వేసింది?

పది అడుగులు వేశానో లేదో వెనకనుంచి వనజకేక వినిపించింది. "అగు అక్కయ్యా," అని నా సహాదరులతోసహా ఆగాము రోడ్డు మధ్య. రొప్పుకొంటూ పరుగెత్తుకొచ్చింది వనజ.

"మా కాంత లోపల వుండిపోయిందేమో అక్కయ్యా. ఆమూల ఉయ్యాల వూగుతోంది యిందాక," అన్నది ఆదుర్దాగా. నా గుండె గతుక్కుమంది. 'అయ్యో' అని ఒక్క ఉదుటున గేటువరకు వెళ్ళాను. గేటు నానుకునివుంది కాంత. ఘొల్లుమని ఏడుస్తోంది.

తాళంతీసి, ఎత్తుకున్నాను కాంతని. వెక్కివెక్కి ఏడుస్తోంది. గొంతంతా తడిసి పోయింది. "ఊరుకో అమ్మా—కాంతా, చూడు. వూరుకో, బైటికివచ్చేశావుగా మరి. ఊరుకో." భయదాయింపులకి ఆగటంలేదు ఆ పసిపాపదుఃఖం. ఆ ఒంటరితనం, నిస్సహాయత తలచుకుని తలచుకుని ఏడుస్తోంది అనిపించింది.

వనజ చెల్లి చేయిపట్టుకుని తీసుకువెళ్ళింది యింటికి.

మళ్ళీ తాళం వేయబోయి, ఎందుకైనా మంచిదని ఓమాటు లోపలికివెళ్ళి మూలలన్నీ చూసివచ్చాను. నాతోపాటు యీపిల్లమూక!

ఇంటికిచేరేసరికి ఎనిమిది గంటలైంది. అమ్మతో చెప్పాను యిదంతా. "అయ్యో పాపం, మీరంతా వచ్చేస్తే ఏమైపోను ఆ అమ్మాయి?" అన్నది అమ్మ. నిజమేపాపం, నిర్జనం ఆప్రాంతమంతా. ప్లేగ్రౌండుతప్పించి యింకేయిళ్లూ లేవు అక్కడ. ఎత్తుగోడలు, పిలిచినా వినిపించుకునేదిక్కు లేదు. గేటు గట్టిదికూడాను.

★ యం. [illegible]

కాంతదీనవదనం, ఆఏడుపు జ్ఞాపకంరాసాగాయి నాకు. భోజనంచేసి పడుకున్నాను- చల్లనిగాలి...

ఉలిక్కిపడి లేచాను ఒకగంటలోనే. గడియారం 11 గంటలు కొడుతోంది. కళ్ళు తెరచి చూశాను. గడియారంక్రింద మేకుకి ప్లేగ్రౌండు తాళంచెవి. నాన్నగారింకా వ్రాసుకుంటూనే వున్నారు.

చిట్టి—ఆ ఐదేళ్ళపిల్ల, ఆ సందుమొదట్లోనే వుంటోంది. సాయంకాలం 'సీసా' క్రింద పడుకునుంది. కునికిపాట్లు పడుతోంటే కేకలేశాను. ఉయ్యాల ఎక్కింది కాస్సేపు. మళ్ళీ వెళ్ళి అక్కడే పడుకుంది. నిద్రపోలేదుకదా? ఆ 'సీసా' క్రింద చూశాను కాదు మందమతిని.

చటుక్కున మంచంమీద లేచి కూచున్నాను. నా గుండె దడదడ కొట్టుకుంది.

"నాన్నగారూ, చిట్టి తాలూకు వాళ్ళెవరూ రాలేదా మనింటికి?" అన్నాను.

మా నాన్నగారు ఆశ్చర్యపోయినారు. "ఏమిటమ్మా? లేచావేం?" అన్నారు.

"చిట్టికోసం ఎవరూ రాలేదా నాన్నగారూ వెతుక్కుంటూ?" అన్నాను మళ్ళీ. నా కళ్లముందు, సీసా క్రింద అమాయకంగా నిద్రిస్తున్న చిట్టి రూపమే కనిపిస్తోంది.

"లేదమ్మా! ఏం? వినా వాళ్ళ యిల్లు దగ్గరా, దాపా? అమ్మమ్మగారింటికి వెళ్ళి వుంటుంది ఆ పిల్ల. ఎందుకమ్మా అల్లాగ అడుగుతున్నావు?" అన్నారు. కలం మూసేసి నా మంచం దగ్గరికి వచ్చారు.

"పడుకో తల్లీ! అదే ధ్యాసవల్లే ఎల్లాగ? అందరూ ఎవరిళ్లకి వాళ్లు వెళ్ళివుంటారు క్షేమంగా" అన్నారు. కానీ నేను పడుకోలేదు. లేచి, హాల్లోకి నడిచి వచ్చాను. నాకు ఏమీ పాలుబోవటం లేదు.

"లేదు నాన్నగారూ, చిట్టి ఆ సీసా క్రిందో, జారుడుబల్ల క్రిందో పడుకునుంటుంది నాన్నగారూ. నిద్రపోతూ వున్నది అప్పుడు. నేను చూడలేదు సరిగ్గా. నల్లపరికిణీ. కాదు నాన్నగారూ, చీకట్లో కనిపించి వుండదు".

లాంతరు వెలిగించాను. మా నాన్నగారు, అమ్మ నావంక ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అది కాదమ్మా, ఎందుకా భంగారు? ఆ పిల్ల యింటికి వెళ్లక ఏమౌతుంది? నీదంతా చాదస్తం తల్లీ. పడుకో. రోజూ తాళంవేసి రావటం లేదూ?" అన్నది మా అమ్మ.

కానీ నా మనస్సు పరిపరి విధాల పోతోంది. చెప్పులు వేసుకుని లాంతరు తీసుకున్నాను. ఆ గోడలు ఎత్తు. చుట్టూ తాటి చెట్లున్నాయి. చిట్టికంటికి బంగారంకూడా వున్నది. అమ్మో, ఏం కాను ఆపిల్లకి ఆకలితో, భయంతో-ఈ చీకట్లో...నాకు వూపి రాడలేదు.

"పదండి నాన్నగారూ, వాళ్ళ అమ్మమ్మ దగ్గరుందని వాళ్ళ వాళ్ళు అనుకుంటారు.

స్వయం కల్పితాలు

ఇంటికి వెళ్ళిపోయిందని అమ్మమ్మ అడుగుతుంది. ఉపేక్ష చేస్తారు. వాళ్ళకు తెలియదు నాన్నగారూ". నాన్నగారు చెప్పులు వేసుకుని, కర్రతీసుకుని బయలుదేరారు. "భద్రం అమ్మాయి" అని మా అమ్మ గేటు దగ్గర తిన్నెమీద కూర్చుంది.

అర్ధరాత్రివేళ—సందులో మా అడుగులే ప్రతిధ్వనించాయి. లాంతరు వెలుగుకి, గోడలమీద మానీడలు. నా అడుగుల చప్పుడుకి మిన్నగా నా హృదయం కొట్టుకుంటోంది.

ప్లేగ్రౌండు సమీపించిన కొద్దీ నా చెవులు పసిపిల్ల ఏడుపుకోసం ఎదురుచూశాయి. సన్నగా ఏడుపు, 'అక్కా' అన్న పిలుపు నాకు వినిపించింది.

తలుపుతీశారు మా నాన్నగారు. చిమ్మచీకట్లో ఉయ్యాలలు మామూలుగా, ప్రశాంతంగా వున్నాయి. 'సీసా' అచేతనంగా వుంది. బేడ్మింటన్ కోర్టులో అడుగుజాడ లున్నాయి లోతుగా. చిట్టిమాత్రం లేదు. మా నాన్నగారు జారుడుబల్ల క్రింద తొంగిచూశారు. నాహృదయంలో ఆరాటం తగ్గలేదు. మా నాన్నగారు నిట్టూర్పు విడిచారు గేటు మూసేస్తూ. నాకు కొంచెం నిస్పృహ కలిగినమాట వాస్తవమే.

సందులో చిట్టి అమ్మమ్మగారి యింటి తలుపు తట్టాం. "చిట్టి వచ్చిందాండీ?"అన్న నా ప్రశ్నలో అర్థం స్ఫురించలేదు నాకు. మంచంమీద, దుప్పటిలో చిన్నగా, వెచ్చగా వుంది చిట్టి—నా ఆరాటం అర్థం కాలేదు చిట్టి అమ్మమ్మకి. "ఏమమ్మా, మామూలుగానే ఇంటికి వచ్చేసిందే" అన్నది ఆవిడ ఆశ్చర్యంగా.

మా నాన్నగారు సన్నగా మందలిస్తూండగా యింటికిచేరాము. "నేను చెబుతుంటే విన్నావుటే అమ్మాయి! ఇంత ఇదైతే ఎల్లాగమ్మా" అంటూ మా అమ్మ లాంతరు తగ్గించింది.

ఆనాటి రాత్రి ఎప్పటికోగాని నిద్ర పట్టలేదు. ఆరాటంతో, ఆతురతతో నిండిన ఆ కాలం—నా మానసిక భావనలు అర్థము కాలేదు ఎవరికీ. అర్థం కావు—పరిపరివిధాల పరుగులెత్తే నా వూహాలు—నాలో నాకే కలిగిన భయాలు—అన్నీ స్వయంకల్పితాలు. కారణరహితాలు.

కాని—చిట్టి ఆ గ్రౌండులోపల ఏడుస్తూ దీనంగా కనిపిస్తే నా హృదయానికి సంతృప్తి కలిగేదేమో!

ఏమో! ★

ఇద్దరు హాస్యనటులు

సింగరాజు రామచంద్రమూర్తి

ఒక పట్టణంలో ఇద్దరు హాస్యనటు లుండేవారు. నాటకాలు చూసేవారికి వారిద్దరూ రెండు కండ్లవంటి వారు. ఒకరికి తీసిపోని నైపుణ్యం మరొకరిది హాస్యంలో. గోపాలరావు రంగస్థలంమీదికి వచ్చి నోరు తెరవగానే ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వేవారు. అంతటి హాస్యగాడతను. రమణమూర్తి మాట్లాడకుండా రంగంమీద కాసేపు నిలబడితే చాలు, చూస్తున్నవాళ్ళ నవ్వకు అంతుండేది కాదు. అతని నైపుణ్యం అటువంటిది. నిజానికి ఆ ఇద్దరిలో ఎవరిది పైచేయి అన్న విషయం పెద్ద పెద్ద కళాకారులకీ, న్యాయాధిపతులకు, మహామహులకు కూడ కొరుకుడుపడలేదు. విక్రమాదిత్యునివంటి వారెవరయినా తేల్చవలసిందే కాని సామాన్యుల వలన కాదని చాలామంది అభిప్రాయం.

వృత్తిలో వారిద్దరికీ అంతటి పోటీఉన్నా వాళ్ళు ఆప్తమిత్రులు. ఒకరి కష్టసుఖాలు మరొకరివి. వాళ్ళ స్నేహాన్ని పరీక్ష చేసేందుకన్నట్టు వాళ్ళకు ఒక సమస్య ఎదురయింది. ఆ సమస్య పేరు రాధ.

రాధ ఆ ఊళ్ళోనే ఒక గొప్ప నర్తకి. ఆమె పేరు వాడవాడలా మ్రోగింది. ఆమె అందం జగత్ప్రసిద్ధం. రాధతో పరిచయభాగ్యం పొందాలని చాలామంది తహతహలాడేవారు. కాని ఆమె వారికి అందనిపండయింది. రాధతో బాగా పరిచయమున్నవాళ్లు ఇద్దరు. గోపాలరావు, రమణమూర్తి. ఎప్పటికయినా వారిద్దరిలో ఒకరిని ఆమె వివాహమాడుతుందని చాలామంది ఉద్దేశం, నమ్మకమూను. నిజం కూడ అంతే. ఆమె వారిద్దరినీ మనసారా ప్రేమించింది. ఆమెకోసం ఏత్యాగం చేసేందుకయినా వారిద్దరూ సిద్ధమే. రాధ కూడ వారిని సమానమయిన ప్రేమతో చూస్తుంది. గోపాలరావు అందం ఆమెని ఆకర్షించింది. రమణమూర్తి నాజూకుతనం ఆమెని వశం చేసుకున్నది. రాధకు వారిద్దరూ ప్రాణసమానులు. వారికి రాధే ప్రాణం.

తమ ఇద్దరిలో ఎవరిని రాధ వరిస్తుందో వారికి తెలియదు. ఇద్దరిలో ఎవరిని ఎన్నుకోవాలో ఆమెకు తోచలేదు. ఒకనాడు ఆ విషయమే వారికి చెప్పింది.

"ఇదీ సమస్య" అంది.

ఇద్దరూ నిట్టూర్చారు.

"మీలో ఎవరు గొప్ప హాస్యం చేయగలరో వారిదాన" నంది తల వంచుకుని.

"ఆ విషయం తేల్చేదెవరు? ఇద్దరూ గొణిగారు.

"అదే సమస్య!" అంది.

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు మౌనంగా, బాధతో. చివరికి రాధ "నాకొక ఉపాయం తోస్తోంది" అంది.

"ఏమిటి?"

"సంక్రాంతికి రాజధానిలో నాటక ప్రదర్శనాలవుతాయి కదూ?" అంది.

"అవు"నన్నారు.

"మీలో అధికులెవ్వరో అక్కడే తేల్చుకుందాం".

ఇద్దరూ నిరాశ పొందారు "తేల్చేదెవరు?"

"అవును తేల్చేదెవరు?"......

"ప్రజలు! ప్రజల నిర్ణయాన్ని మనం తీసుకుందాం. అది ఫైనల్ దాని ప్రకారం చేద్దాం" అంది రాధ తృప్తిగా.

సరేనని బయటికి వచ్చేశారు.

అప్పుడు గాని వాళ్ళకి అసలు విషయం తట్టలేదు. వెంటనే దగరలో ఒక పెద్ద హోటలుకి వెళ్ళి కూలబడ్డారు.

"ఇన్ని రోజులుగా తేలని సమస్య ఆ నాడు తేలుతుందని నమ్మకమేమిటి?" అన్నాడు గోపాలరావు.

"అవును నమ్మకమేమిటి?"

పోనీ హాస్యంగాక ఇంకో పాత్ర వేసి అందులో మనం పోటీపడితే! ప్రతిపాదించాడు మూర్తి.

గోపాలరావు కిది నచ్చలేదు.

"లాభం లే"దన్నారు ఇద్దరూ ఒకేసారి.

వీళ్ళిట్లా తలపట్లు పడుతూంటే ఆ చుట్టుప్రక్కల నున్న వాళ్ళు "వాళ్ళే ప్రఖ్యాత హాస్యగాళ్లు" అనుకుంటూ ఒకళ్ళకొకళ్లు చూపించుకుంటున్నారు. ఇంతలో

"క్షమించండి. నాకో చిన్న సాయం చేయగలరా" అన్నాడు శుభ్రమైన బట్టలు వేసుకుని ఎదురుగా నిలబడిన ఒక ఆసామీ.

ఆయన్ని పరిశీలనగా చూశారిద్దరూ. ముప్పయిఅయిదు ప్రాంతాల ఉంటాడు.

"మా సమస్య తేలక మేము ఇదవుతుంటే మీకు సాయమేం చేయగలం?"

"చేయగలరు. చిన్న సాయం. నేను రేపొక సభలో మాట్లాడవలసి ఉంది. అసలే నాకు సభాకంపం. బాగా వదిలించుకోవటం ఎలా అని ఆలోచిస్తున్నాను."

"'అనివార్య కారణాలవలన రాలేకపోయినందుకు క్షమింప ప్రార్థన' అని ఉత్తరం రాసిపారేయండి." రమణమూర్తి సూచించాడు.

"అలా వీల్లేదే! నేను మాట్లాడితీరాలి."

"సరే అయితే. దేనిగురించి మీరు మాట్లాడాలి" అడిగాడు గోపాలరావు.

"నా స్వానుభవాలు. నేను సెంట్రల్ జైలులో పనిచేసి రిటైరయాను. నా కళ్ళ ముందుగా బోలెడుమంది ఉరితీయబడ్డారు. నాకా జీవితంమీద విరక్తిపుట్టింది. అసహ్యం వేస్తోంది. ఇప్పుడా సభ ప్రేక్షకులు అంతే 'క్యాపిటల్ పనిష్మెంటు' మీద ప్రజలలో ఏవగింపు కలిగించేందుకు ఏర్పాటయింది. అందువలన నావంటి వాడి అనుభవాలు చెప్పటం చాలా అవసరం," అన్నారు ఆసామీగారు.

గోపాలరావుకి హఠాత్తుగా తలలో మెరుపు మెరిసింది. దాని తాలూకు కాంతి ముఖంమీద ప్రసరించింది.

"మిమ్మల్ని ఆవూళ్ళో ఎవరన్నా ఎరుగున్నారా?" అడిగాడు.

"వ్యక్తిగతంగా నన్నెవరూ ఎరగరు. కాని నా పేరు విన్నారు."

గోపాలరావు ఆనందానికి అంతులేదు.

"అయితే ఒక్క విషయం. మీ కెంత కావాలంటే అంతిస్తాను. నేనా సభలో మాట్లాడేందుకు మీరొప్పుకుంటే" అన్నాడు. ఆయన కర్థంకాలేదు.

"నేను మీకు బదులు, మీ పేరుతో వెళ్ళి అక్కడ మాట్లాడతాను. మిమ్మల్ని ఎవరూ ఎరగరు కాబట్టి అనుమానించరు. అసలు విషయం తరువాత వెల్లడయితే 'హాస్యచక్రవర్తి గోపాలరావు ఎంతటి యుక్తిపరుడు!' అని విస్తుపోతారు. సరేనా" అన్నాడు హుషారుగా.

★ ఇద్దరు హాస్యనటులు ★

రమణమూర్తికి కాళ్ళు చేతులు చల్లబడ్డాయి.

"సరే, అలాగే" అని చెప్పి వెళ్ళిపోయాడు ఆసామీ.

ఇదేగనక సవ్యంగా జరిగిపోతే తనముఖం ఎవరుమూస్తారు? గోపాలరావు ఘనవిజయం సాధించినట్లే. రాధ అతనిదయిపోతుంది. తనకి మిగిలేది చీకటి అని రమణమూర్తిచాలా బాధపడ్డాడు కాని చేయగలిందేముంది?

తను చేయబోతున్న పనిని రాధకి వివరించి చెప్పాడు రావు. రమణమూర్తిని, రాధని ఆ సభకి వచ్చి తన విజయాన్ని కళ్ళారాచూసి ఆనందించమన్నాడు. ఇద్దరూ సరే నన్నారు.

తనకి రాబోయే విజయం, పట్టబోయే అదృష్టం, కాబోయే భార్య అతన్ని ఆనంద సాగరంలో తేల్చినట్టు గోపాలరావు భావించాడు.

* * *

తన ముఖం అందరికి సుపరిచితం కాబట్టి కావలసిన విధంగా మారువేషం వేసుకుని చేరుకున్నాడా ప్రొ॥ గోపాలరావు. ఘనంగా ఆహ్వానించ బడ్డాడు.

రాత్రి బహిరంగ సభ. కరతాళ ధ్వనుల మధ్య వేదిక నెక్కాడు. అధ్యక్షుడు ఉపన్యాసకుడిని పరిచయం చేస్తూ "జైళ్ళలో చాలా అనుభవం కలవారు. వారి చేతి మీదుగా చాలా మంది ఉరికంబానికి పంపించబడి నందుకు ఆయన పడుతున్న బాధ ఇంతింతకాదు" అన్నారు.

తరువాత గోపాలరావు మొదలు పెట్టాడు. తన బాల్యం, తిరిగిరాని చిన్నతనపు రోజుల లోని ఆనందం వగైరా ఏకరువు పెడుతున్నాడు.

"గోపాల్ తన మామూలు ధోరణిలో హాస్యం మొదలుపెట్టాడు. చూడు అంతా ఎంత ఆనందంగా ఉన్నారో!" అంది రాధ రమణమూర్తితో.

"పొరపాటు. క్రమేణా అసలు విషయం లోకి వస్తాడు చూస్తుండు."

అతనన్నట్టే అయింది. అసలు విషయం లోకి వచ్చాడు ఉపన్యాసకుడు. హాస్య రేఖలు ఆవరించుకొన్న అతని ముఖంలో విచారం పొడిగట్టింది. అతనితో పాటు శ్రోతలు కూడ మారుతున్నారు. తన చేతి మీదుగా బలిఅయిన ఒక్కొక్కరిని, వారప్పుడెలా ప్రవర్తించిందీ మొదలయిన వన్నీ ఏకరువు పెట్టాడు. సూది పడితే వినబడేంత నిశ్శబ్దంగా ఉంది సభాస్థలం. ఏ క్షణంలో నయినా కళ్ళనుంచి ప్రవాహాలు ఉరకవచ్చు నన్నట్టున్న ముఖాలతో వింటున్నారు. శిలా ప్రతిమల్లా కూర్చున్నారు సభికులు.

చివరి కతని ఉపన్యాసం ముగిసింది. భారమైన అడుగులతో వేదిక దిగాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. చప్పట్లు కొట్టలేదు. రాళ్ళకి మల్లే కదలకుండా ఉన్నారు. గోపాలరావుకి కావలసింది కూడ అదే. తన ఉపన్యాసానంతరం కరతాళ ధ్వనులు చేశారంటే తన శ్రమ అంత వృధాఅని అతని ఉద్దేశం.

విజయోత్సాహంతో రాధ దగ్గిరికి చేరుకున్నాడు. "చాలా గంభీరోపన్యాసం ఇచ్చావు గోపాల్! అందరినీ శోకసముద్రంలో ముంచావు," అంది రాధ అభినందిస్తూ. ఆమెకండ్లలోని మెరుపు గోపాలరావుని సంతృప్తి పరిచింది.

"నిస్సెవరూ గుర్తుపట్టలేదు. బాగా నటించావు" అన్నాడు రమణమూర్తి నిర్లిప్తంగా.

గోపాలరావు చుట్టు జనం మూగయారు. అభినందించని వారు లేరు. ఇంతలో ఒకతను వచ్చి అతని చేతిలో ఒక అందమయిన కవరు పెట్టాడు. "మా వెంకటేశ్వరపురం జమీందారుగారు మీకియ్యమన్నారు" అన్నాడు సవినయంగా.

గోపాలరావు కౌగిలం తీసి చూశాడు. ఆ నాటిరాత్రి తనతో విందారగించేందుకు తన భవనానికి రావలసినదిగా మరీ మరీ కోరారు అందులో.

"వస్తానని చెప్పు వారితో" అని వాడిని పంపేసి రాధవైపు తిరిగి ఆ విషయం చెప్పి తను రాత్రికి విందుకు వెడుతున్నానని కూడ చెప్పాడు.

"వెంకటేశ్వరపురం జమీ పేనింతవరకు వినలేదు." రమణమూర్తి గొణిగాడు.

"రాత్రికి మిమ్మల్ని కలుసుకుంటాను" అని చెప్పి విందుకు తయారయేందుకు వెళ్ళిపోయాడు.

ఆహ్వానలేఖలోని గుర్తుల ప్రకారం అక్కడికి చేరుకున్నాడు గోపాలం. అతని ఆశ్చర్యాని కంతులేదు. అక్కడ ఒక చిన్న సైజు కోట, లేక భారీ ఎత్తున మేడ ఉంటాయని ఊహించిన అతనికి అక్కడ వున్న చిన్న డాబా చాలా ఆశాభంగం కలిగించింది. "ప్రస్తుతానికిందులో ఉంటున్నారు కాబోలు"నని సరిపెట్టుకుని ఇంటి దగ్గరికి వెళ్ళాడు. ఒక నౌకరు అతన్ని ఆహ్వానించి ఒక హాలులో కూర్చోపెట్టాడు.

"అయ్యగారు పది నిముషాలలో వస్తారు. మరో విధంగా అనుకోకుండా మిమ్మల్ని కూర్చోమన్నారు" అన్నాడు.

గోపాలం చాలా నిరుత్సాహపడ్డాడు—హాయిగా, ఆనందంగా రాధతో భోజనం చేయక కోరి ఈ తద్దినం తెచ్చుకున్నానని బాధపడ్డాడు. పావుగంట గడిచాక వంగిపోయిన ఒక ముసలాయన కర్ర పుచ్చుకుని, మెల్లిగా అడుగు వేసుకుంటూ ప్రవేశించాడు. గోపాలం లేచి నిలబడ్డాడు మర్యాదగా.

"కూర్చోండి. కొంచెం ఆలస్యమైంది" అని తానుకూడ ఒక సోఫాలో కూలబడి "మీరు నా కోరిక ప్రకారం ఇక్కడికి రావడం చాలా ఆనందం. ఇందాక మీ ఉపన్యాసం విన్నాను. చాలా గొప్పగా వుంది. వెంకటయ్యా, భోజనాలు పట్టుకురా." అని కేకేశాడు.

గోపాలరావుని ఆ ఇల్లూ, ఆయన పరిస్థితీ చాలా గ్రుంగదీశాయి.

ఆ పరిస్థితిలో భోజనం మాట వినేప్పటికి నిజాని కతనికి కొంతహుషారు కలిగింది. జమీందారు లేది ఎలా గున్నా భోజనం మట్టుకు బాగా చేస్తారని అతని విశ్వాసం... కానీ వడ్డించిన ఆధరువులు చూడగానే అతనికి నోటమాట రాలేదు.

ఎలాగో భోజనం అయిందనిపించారు.

"మీరు ఇందాక చెప్పినవన్నీ నిజమేనా?" అడిగాడు ముసలాయన.

"అక్షరాలా"

"అయితే మీరు వెంకటపతిని గురించి చెప్పినది కూడా నిజమేనా?"

"పూర్తిగా."

కాసేపాయన ఏమీ మాటాడలేదు. ఇంతలో రెండు గ్లాసులనిండా, ద్రాక్షరసం పట్టుకొచ్చి బల్లమీద పెట్టాడు ప్యూన్.

"ముందు అది కాస్త తాగండి. తరువాత మాట్లాడుకుందాం" అని తనొకటి తీసుకొని గోపాలంకి ఒకటందించాడు. ఇద్దరూ తాగేశారు.

"ఉరితీసేందుకు తీసుకువెడుతుంటే మంచి ధైర్యంగా ఉన్నాడా, లేకపోతే విచారం కనబరిచాడా?"

"ఎవరు?"

"అదే వెంకటపతి"

"అతనా, చాలా ధైర్యంగా ఉన్నాడు"

"ఠీవిగా నడిచాడా?"

"ఆహా! హుందాగా"

"చివరిదాకా అలాగే ఉన్నాడా?"

గోపాలానికి ఈ ప్రశ్నలు అర్థం కాలేదు. "చివరిదాకా కూడా" అన్నాడు విసుగ్గా.

"నీచేతులతోనే వాడిని చంపించావు కదూ" సూటిగా అడిగాడు.

గోపాలం తృళ్ళిపడ్డాడు...సర్దుకుని "న్యాయం చేతులో ఆయుధాన్ని మట్టుకు నేను. ఆయుధాలకి ఆలోచించే శక్తి ఉండకూడదు" అన్నాడు తన మాటలకి తనే ఇదవుతూ.

"కటిక గుండె నీది. ఎలా చంప బుద్ధేసింది? ఘాతకుడా!" అరిచాడు ఉద్రేకంగా జమీందారుగారు.

ఆయన ముఖం చూస్తే గోపాలానికి భయం వేసింది. నెరసిన కనుబొమల క్రింద ఉన్న కండ్లలో కోపం ప్రస్ఫుటంగా కనబడుతోంది.

"నేను అమాయకుడిని, అని వాడు చెప్పలేదూ?"

"ఉరితీయబడేముందు అంతా అలాగే అంటారు."

"నువ్వు నమ్మలేదా?" సూటిగా చూస్తూ అడిగాడు.

"ఊహూ. ఇవన్నీ నమ్ముతూ కూర్చుంటే ఉద్యోగం వదులుకోవాలిందే"

"కాని, వాడు అమాయకుడు. నిజంగా అమాయకుడు" అన్నాడు బాధతో కూడిన కోపంతో జమీందారుగారు.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.

"వాడు నా కొడుకు"

ఝెళ్ళున వీపుమీద ఎవరో కొట్టినట్లయింది గోపాలరావుకి "మీ...కొడుకా?" అడిగాడు ఖంగారుగా.


"అవును, నా కొడుకు. నాకు ఈలోకంలో ఉన్నది వాడొక్కడే. వాడ్ని నాకు కాకుండా చేశావు. పైగా గొప్పగా దాని గురించి చాటుకుంటున్నావు. నువ్వు చేసిన దానికి అనుభవిస్తావు. ఎక్కడో కాదు. ఈ లోకంలోనే. ఇప్పుడే" అంటూ పెద్దగా నవ్వసాగాడు.

గోపాలానికి భయం వేసింది. లేచి నిలబడ్డాడు పారిపోదామని. "నువ్వు ఈ గది విడిచి బయటికి వెళ్ళలేవు. నీ ఆయువు మూడింది. ఆ ద్రాక్షరసంలో మంచి విషం కలిపించాను. నువ్వు జీవించేది ఇంకా అరగంటమాత్రం" అన్నాడు కర్కశంగా నవ్వుతూ.

అదిరిపడ్డాడు గోపాలం. కాళ్ళక్రింద భూమి కదిలిపోతున్నట్లు, తలలో అగ్నిపర్వతాలు, అణ్వస్త్రాలు పగులుతున్నట్టు బాధపడ్డాడు. అప్పుడే విషం పనిచేస్తున్నట్టుగా కడుపులో తిప్పటం మొదలెట్టింది. కళ్ళు తిరిగాయి. కుర్చీలో కూలబడ్డాడు.

ముసలాడు వికటాట్టహాసం చేస్తున్నాడు. "నా కొడుకు ఆత్మ శాంతిస్తుంది. నాకు తృప్తి కలిగింది. నీనుంచి ఇప్పుడు నేను భయపడేదేమీ లేదు. మృత్యుదేవత కబంధ హస్తాలలో నలిగిపోతావు ఇంకాసేపట్లో. నీజీవిత నాటకానికి భరతవాక్యం పలకబోతున్నావు. తెర పడిపోతుంది. నా కొడుకు ఆత్మకి శాంతి కలిగింది"— అరుస్తున్నాడు ముసలాయన. గోపాలం భయంతో వణికిపోతున్నాడు. అతనికి దుఃఖం ముంచుకొచ్చింది. తను ఆశించినవి, తనకందుబాటులో రాబోతున్నవి

(48- వ పేజీ చూడండి)


తల్లులకు హెచ్చరిక!
ప్రమాదకరమైన వ్యాధికి దించకముందే
మీ బిడ్డ జలుబు బాధ నివారించుకోండి!
ఈ మంచి ఘాటైన పూత మందును ముక్కు, గొంతు, గుండెల బాధల నివారణకు రాత్రిపూట రుద్దండి!
మీ బిడ్డకు జలుబు చేసినపుడు అశ్రద్ధ చేయవద్దు. మీ బిడ్డ గుండెల మీద, వీపుకు, గొంతుకు రాత్రిపూట నిద్రపోబోయే ముందు రుద్దండి. ఎక్కడైతే జలుబు బాధలు వుండగలవో అక్కడల్లా అతడికి కొంత ఉపశమనం కలుగుతుంది. రాత్రల్లా మీ బిడ్డ హాయిగా నిద్రపోతూ వుండగానే మీ బిడ్డ జలుబు బాధలను విక్స్ వేపోరబ్ నివారిస్తూనే వుంటుంది. ఉదయానికల్లా అతడు మామూలుగా అవుతాడు.
జలుబును 2 విధాల నివారిస్తుంది:
1
ముక్కు ద్వారా పనిచేస్తుంది.
మీ బిడ్డ గాలివి పీల్చునపుడు విక్స్ వేపోరబ్ ఘాటైన వాసన శ్వాస నాళాలలోనికి పోయి ముక్కు, గొంతుల జలుబు బాధలను నివారిస్తుంది.
2
చర్మం ద్వారా పనిచేస్తుంది.
విక్స్ వేపోరబ్ మీ బిడ్డ చర్మానికి వెచ్చదనం చేకూర్చి, ఉపశమనం కలిగించి, తద్వారా గుండెల లోని జలుబు బాధలను నివారిస్తుంది.
గుండె, గొంతు, వీపులపై రుద్దండి!
VICKS VAPORUB
విక్స్ వేపోరబ్
విక్స్ వేపోరబ్ ఇప్పుడే వాడి చూడండి!
కొత్తది, చేతిలో ఇముడు నమూనా సైజు డబ్బా ధర 40 న.పై. మాత్రమే
పన్నులు అదనం
VICKS VAPORUB

ప్రేమించని పెళ్ళికొడుకు

కీర్తిప్రియ

విసన కర్రలు టపటప లాడుతున్నాయి. రకరకాల నవ్వులూ, ఆత్మస్తుతీ, పరనిందా జీవిత పరమావధిగాగల వాళ్ళ పలుకులూ ఎదుట వాళ్లు నమ్ముతారా లేదా అన్న ఆలోచనకూడా లేకుండా కొందరు పెద్ద మనుష్యులు తెలిపే ప్రపంచపు వింతలూ విడిది యింటి గదుల్లో వినిపిస్తున్నాయి. భుక్తాయాసాలు తీర్చుకోవడానికి వీపులు గోడకు చేరవేసి కొందరూ, జంబుఖానాల మీద శరీరాలు వెల్లకిలవేసీ, బోర్ల వేసీ కొందరూవున్నారు. అంతటి సందడిలోనూ మహాకాయుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ, మహానుభావుల గురకలు వినబడుతూనే ఉన్నాయి.

మేడమీద మధ్య హాలులో గది నిండా పరచిన జంబుఖానామీద ఒకపక్క చంద్రశేఖరం కూర్చున్నారు. ఆయన సమీపంలో పెద్దలూ, పిన్నలూ కూర్చున్నారు. చంద్రశేఖరం 'కబుర్లపోగు'! ఆయనచెప్పే కబుర్లు వినడానికి పిన్నాపెద్దా చుట్టూచేరుతారు. ఆయన వస్తున్నారంటే రాలేనివాళ్లు కూడా పెళ్ళిళ్ళకి వస్తారు. పెళ్లిచేస్తే నలుగురూ వచ్చి భోజనాలుచేసి తీరాలని అనే పూర్వకాలపు మనుష్యులు ఏమాత్రం సంబంధం వున్నా చంద్రశేఖరాన్ని పెళ్లికి రమ్మని బలవంత పెడతారు. అతనువస్తే ఇంకో నలుగురువస్తారని అలా బలవంతం పెట్టడం వల్లే చంద్రశేఖరం యీ పెళ్లికి వచ్చేరు. యథార్థానికి ఆయన పెళ్లికొడుక్కి చాలా దూరపు బంధువు.

చంద్రశేఖరం ఎదుట తమలపాకులూ, సున్నం, వక్కపొడివున్న పళ్ళెం వుంది. అక్కడున్న వాళ్ళు ఆకులకి సున్నాలు రాసి వక్కపొడి చేర్చి వేసుకుంటున్నారు. సాహసించి తమలపాకులు తీయలేని కొందరు కళ్లు అప్పజెప్పి చూస్తున్నారు. చంద్రశేఖరం చెప్పే కథలూ, కబుర్లు వినడానికి వాళ్లందరూ అక్కడ చేరేరు.

ఇంతలో పెళ్లికొడుకు పినతండ్రీ, ఆయన బావమరిది అక్కడికి వచ్చేరు. 'దయచేయండి, దయచేయండి' అని మన్ననచేసి స్థలం చూపించేరు అక్కడున్న వారు. కూర్చుంటూ 'హమ్మయ్య' అన్నారు. పెళ్ళికొడుకు పినతండ్రి, "'క్షేమ' మని లేచ్చక హమ్మయ్యా అంటారేం అండీ బావగారూ" అన్నారు చంద్రశేఖరం, "అనొద్దటండీ పెళ్ళయినవరకూ అవుతుందా లేదా అనుకున్నాంగదా" అన్నారు పెళ్ళికొడుకు పినతండ్రి ప్రక్కనున్న ఆయన బావమరిది. హాలాహలం మ్రింగలేక, పైకి క్రక్కలేక కంఠంలో దాచిన గరళకంఠుడిలా అప్పటివరకు ఆయన దాచిపెట్టేడా రహస్యాన్ని. దాన్ని కాస్తా యిప్పుడు బయటికి చెప్పేసేడు.

"ఏమిటి విశేషం" అన్నాయి రెండు మూడు కంఠాలు.

"మరేం లేదు. అసలు పెళ్ళికొడుకు చాలా వినయవిధేయతలు కలవాడే, పెళ్ళికూతుర్ని చూస్తేనేగాని పెళ్ళిళ్లు చేసుకోని యీ రోజుల్లో "పెద్దల యిష్టమే కానియ్యండి" అన్నాడు. వివాహ ప్రయత్నాలు అన్నీ అవనిచ్చి మూడురోజుల క్రిందట నే నాపెళ్ళి చేసుకోనని చిందులు త్రొక్కడం మొదలుపెట్టేడు. 'ఏమిటి విశేషం' అని అడిగేం. "పెళ్లికూతురు పెద్ద వయసుదానిలా వుందని ఆడవాళ్లు అందరూ పరిహాసం అంటున్నారట. పెళ్లికూతురు గ్రామంవాడే అయిన క్లాస్‌మేట్ ఒకడు 'షేక్‌స్పియరులాగ పెద్దవయసు పెళ్లాన్ని పెళ్ళాడుతున్నా వేంరోయ్' అన్నాడట.

"దానితో వాడికి వెర్రెత్తి నానాహంగామా చేసేడు. కొందరిమొహాలు ముదరమొహాలుంటాయనివాణ్ని సమాధానపరచి, ఆపిల్లజాతకం తెప్పించి చూపించి, ఉభయత్రా బాంధవ్యమున్న వాళ్ళచేత పుష్కరాల లెక్కనీ, 'తాంబూల రోజుల' లెక్కనీ పెళ్ళికూతురు వయసు సప్రమాణికంగా బుజావు చేయించి ఒప్పించేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది. అప్పటికీ తీరా ఆశుభ ఘడియలు కాస్తా దగ్గరపడ్డాక ఏం ప్రేత్తుతుందో అని ఎంతో జాగ్రత్తపడ్డాం. ఆ మూడు ముళ్లు పడ్డాయికదా మరి భర్వాలేదని రహస్యంగా వున్న విషయం కాస్తా పైకి చెప్పేసేను." అన్నాడా చుట్టం చుట్టుప్రక్కల కలయజూస్తూ.

"ఓస్! అంతే కదటండీ! ఇకభర్వాలేదు. సంవత్సరం తిరిగేటప్పటికి ఓ పిల్లాణ్ని భుజాన్నేసుకొని ఆవిడగారు 'ఏవోయ్ బిల్లీ' అంటూంటే మనవాడు కాలుకాలిన పిల్లిలా తిరుగుతుంటాడు" అన్నారు చంద్రశేఖరం. అందరూ విరగబడి నవ్వేరు.

"ఎందుచేతనంటే పెళ్లికూతురుకు రూపనో, చదువురానిదనో పెళ్ళిచేసుకోనని గొడవపెట్టే పెళ్లికొడుకులూ, పెళ్లికొడుకు పల్లెటూరి మొద్దనో, పట్నవాసం వాడయినా శుభ్రంగా షోకుచేసుకు వీధుల్లో తిరగడనో కంటతడి పెట్టే పెళ్ళికూతుళ్ళి తరచూ చూస్తూనే వుంటాం. వాళ్లు అన్ని అలకలు అలిగి ఆఖర్న నిక్షేపంలాగ కాపురాలు చేసుకుంటారు. ఓ సారి ఓ గమ్మత్తయిన సంఘటన జరిగింది"

'ఏమిటండీ అది' అని ఎవరూ అడగకుండానే చంద్రశేఖరం చెప్పడం ప్రారంభించేరు.

"పెళ్లికొడుకు తండ్రి తాతా, మా తాతగారు పెత్తండ్రి పినతండ్రి బిడ్డలు. అంటే యిపుడు నేనూ జగన్నాధమూ అయినట్టు" అని అక్కడ కూర్చున్నవారిలో ఒకరివైపు చూసేరు చంద్రశేఖరం.

"ఎవరూ ఆ సుబ్బయ్యగారి విశ్వనాధం పెళ్ళిగురించిటండీ, చెప్పండి, చెప్పండి అప్పుడేదో గొడవైందనుకున్నారు. నేను ఉత్తరాది యాత్రబండి వెళ్తే అందులో వెళ్లాను. పెళ్ళికి రాలేదు" అన్నాడు జగన్నాధం.

మరే, మరే, ఏమీలేదు. నలుగురూచేరి ఒక సలక్షణమైన సంబంధం చూసేంకదా. పిల్లా బుద్ధిమంతురాలు, పనిమంతురాలు. పిల్లతండ్రా స్థితిపరుడు, మంచిసంప్రదాయం వున్నవాడూనూ. శ్రేష్ఠమైన సంబంధం అనుకున్నాం అందరం. పెళ్ళికి మగపెళ్ళివారమంతా వెళ్ళి పెళ్ళయాక తిరిగి వచ్చేం."

"పెళ్లయి తిరిగివస్తే మరి జరిగిన గొడవ

★ ప్రేమించని పెళ్ళికొడుకు ★

తేమిటి" అన్నాడు శ్రోతల్లో ఒకడు.

"అక్కడే వుందండీ కథంతా. శోభనం నాడు రాత్రి గదిలో ప్రవేశపెట్టడానికి అన్నిసన్నాహాలుచేసి పెళ్లికొడుకుని వెదక బలసివచ్చింది. ఎక్కడచూసినా కనపడడు. పెద్దలలో చలనం బయలుదేరింది.

"ఎక్కడకు పోయివుంటాడా అని నేనూ ఆలోచిస్తున్నాను. ఆ మూడుముళ్లు వేసిం దగ్గరనుంచీ అదోలా వున్నాడు మనిషి. తిరిగి వస్తుంటే రైలుపెట్టెలో కుర్రకారంతా వాణ్ని హేళన చెయ్యడం మొదలుపెట్టేరు. 'నీ పెళ్లాం హిడింబిరా' అని ఒకడూ, 'భాబూ! గుమ్మాలు మార్పించావా లేదురా' అని ఒకడూ, 'ఫరవాలేదు అడుగా తిరిగి అడుగు పెడుతుందిరా' అని ఒకడూ రకరకాలుగా అనడం మొదలుపెట్టేరు. ఆ పెట్టెలోనే నేనూ వున్నప్పటికీ, మీద పెట్టెలు పెట్టేచోట బలవంతాన్ని కళ్లుమూసుకుని వుండడాన్ని నిద్రపోతున్నాననుకున్నారు వాళ్లు. నేను ఆగోలవినలేక కూర్చుని దిగువకు వంగి చూసేటప్పటికి, విస్సిగాడి మొహం బాధుక చెయ్యని యింటికివుండే తుప్పపట్టిన తాళంకప్పలా వుంది. నేను దిగువకుదిగగానే అందరూ 'గప్‌చుప్' మని వూరుకున్నారు.

"జరిగిన విషయాలు మననం చేసుకొని విస్సిగాడు కనపడకపోవటానికి కారణం వూహించుకుంటుంటే వాళ్ళ నాన్న వచ్చేడు. అతను 'అన్నయ్యా! వాకేం పాలు పోవటం లేదు. అంతా గ్రామంలో వెదకడానికి వెళ్ళేరు. ఇంతవరకూ చక్కగా జరుగుతూ వచ్చిన శుభకార్యం కాస్తా ఏమౌతుందో' అని వుంది. నా గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయంటే నమ్ము' అన్నాడు.

"నాకు ఒక్కసారి మెరుపులా ఆలోచన తట్టింది. 'నీకేం భర్యాలేదు సుబ్బన్నా! వాడేవస్తాడు. కుర్రవాడు కదూ యీ రోజున కాస్త ముందుగానే యింట్లో వుంటే కుర్రకారంతా హేళన చేస్తారని ఎటో వెళ్ళివుంటాడు. నేను తీసుకువస్తాను. నువ్వు నీ పనులు చూసుకో' అన్నాను.

"వెంటనే మామిడి తోటల మధ్య కాలిబాటల గుండా గ్రామానికి ఉత్తర దిశగా వెళ్ళాను."

"గ్రామానికి ఉత్తర దిశను ఏంటుందేమిటండీ" అన్నాడొక శ్రోత.

"ఏంలేదండీ. రెండుఫర్లాంగులదూరంలో తూర్పు పడమలకు పోతూ రైలు రోడ్డు వుంది. ఆ గ్రామానికి అటు రెండు మైళ్ళలోనూ, యిటు రెండు మైళ్ళలోనూ చిన్న స్టేషన్లున్నాయి. నేను రైలు గట్టుచేరి అటూ యిటూ చూసేను. అంతా వెన్నెల వెలుగులు, చెట్ల నీడల చీకట్లు, కీచురాళ్ల శబ్దాలు తప్ప ప్రకృతి నిశ్శబ్దంగా వుంది. అటు యిటూ కనుచూపుమేర ఎవరి జాడా లేదు. వెన్నెలలో రైలు బద్దీలు అనంతంలో కలిసిపోతున్న రెండు సన్నని వెలుగు బాటల్లాగ వున్నాయి.

నా యెడమ చేతి వైపు రెండు ఫర్లాంగుల దూరంలో రైలు రోడ్డు ప్రక్కనే ఓపాడు వడిన వంటగది యిల్లు వుంది. అది దెయ్యాల నివాసస్థలమని ప్రసిద్ధి. అటు వక్క వెళ్ళడమా కుడిచేతి వక్క వెళ్ళడమా అని ఆలోచించవలసి వచ్చింది. ఏం చేలోచావసిద్ధమై వచ్చినవాడుకూడా ఆ దెయ్యాలకొంప వైపు వెళ్ళడనిపించింది. యథార్థం చెప్పొద్దూ, ఎంత వుచ్చుపుట్టెలా వెన్నెలవున్నా అటువెళ్లడానికి నాకే భయం వేసింది. అటు ఓ పదిగజాల మేర వెళ్ళి ముందుకుడిచేతివైపువెళ్లి అవసరమయితే అటువైపు వెళ్ళవచ్చునుకుని మళ్ళీ వెనక్కి తిరిగేను."

"అటుపక్క కనపడ్డాడా?"

"కనపడక ఏమౌతాడు. అలా ఓ మైలు దూరము వెళ్ళేటప్పటికి కొద్దిగజాల దూరములో 'లెవెల్ పలకని' చేరబడి 'విస్సి' కన్పించేడు. దూరానికి రూపం కన్పించక పోయినా వాడేఅయిఉండాలనిపించింది. కాళ్ళు రెండూ దగ్గరచేర్చి మోకాళ్ళమీద నుదురుఆన్చి అంతర్ముఖుడయియున్నాడు. కునుకుపాట్లు పడుతున్నాడేమో.

దగ్గరగావెళ్ళి 'విశ్వనాథం', 'విశ్వనాథం' అని పిలిచేను. 'ఎవరూ...' అని కేకవేస్తూ లేచి నిలబడ్డాడు. 'నేనూ శేఖరం పెదనాన్నని' అన్నాను.

'ఏం పెదనాన్నా!' అన్నాడు ఏమీ తెలియనివాడిలా.

'ఏం పెదనాన్నా! అని యింకా యిక్కడ కూర్చుంటే ఎలా. పద' అని వాణ్ని రెక్కపట్టుకు లేపి నడిపిస్తుంటే నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ తూర్పుదిశనుండి రైలు యింజను శబ్దంచేసింది. స్టేషనువిడిచిపెట్టిందన్నమాట. తనువు లేకపోవడాన్ని ఒక్కసారి ఝల్లుపడ్డాం. పట్టాలకడ్డుగా పరుగెత్తి అవతలపక్కకి చేరేం.

'నేను రాను పెదనాన్నా' అన్నాడు. అన్నాడేగాని అప్పటికప్పుడే వాడికి మళ్ళీ ప్రాణంమీద తీపికలిగింది. అంచేతే చెయ్యి విదుల్చుకుని పరుగెత్తకుండా నిలబడ్డాడు.

'అయితే నేను చెప్పేవి నాలుగుముక్కలూ విని, నీకు తోచినట్టు చెయ్యి' అన్నాను. విశ్వం ఏం మాట్లాడలేదు.

'చూడు. ఎవరో కుర్రవెధవలు నీ పెళ్లాం లావుగావుందని అన్న మాత్రాన మూడుముళ్లు వేసేక దాన్ని కాదంటావా. అదీకాక పెళ్ళి కూతురు లావుగావుందనే అనుకున్నావు. గాని నువ్వు సన్నంగా చీపురుపుల్లలా వున్నావన్న సంగతి గుర్తుతెచ్చుకున్నావా? ఆ పిల్లని వాళ్ల స్నేహితులు ఆక్షేపించరూ? అందులో ఆడవాళ్ల ఆక్షేపణ చెప్పతరమా? అంతమాత్రాన యిపుడు ఆ పిల్ల ఉరిపోసుకుంటానందా? నుదుట ఎలా వ్రాస్తే అలానే అవుతుందని నువ్వు మంగళసూత్రం గట్టిగా బిగిస్తుంటే మాటాడక వూరుకుంది. లావు



రాధ-మాధవుడు

ఫొటో: వట్కాల సుబ్బారావు—చల్లపల్లి.

కాక, పన్నంకాక, పొట్టికాక, పొడవు కాక, అన్ని విధాలా అందంగా వుండి, చెప్పినమాట వినేవాళ్ళూ, చదువున్నవాళ్ళూ పెళ్ళాలు కావాలని మగవాళ్ళూ, పెద్ద ఉద్యోగం చేస్తూ, నౌకర్లూ చాకర్లూ వుండి ఎర్రగా బుర్రగా వుండి, లక్షలు ఆర్జించే భర్తలు కావాలని ఆడవాళ్ళు అంతా కోర్కెలు కోరితే ప్రపంచంలో నూటికి తొంభై మందికి పెళ్ళవుతాయా? శారీరకంగానూ, మానసికంగానూ విభిన్న ప్రకృతులు గల వాళ్లు జంటగా జీవితం గడపడమే వివాహంలో గొప్ప విశేషం."

"ఇలా ఏవేవో మాట్లాడుతూ యింటి వైపు నడక సాగించేను. పెద్దవాణ్ని కావడం చేతో, ఆమాటలు నచ్చడంచేతో విశ్వం నాపక్క నడుస్తూ వచ్చేయడం మొదలు పెట్టేడు. రైలు నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నిప్పులు కక్కుకుంటూ వెళ్ళిపోయింది.

నేను సంభాషణ సాగిస్తూ 'నీలాగే మా పినతల్లిగారమ్మాయి చాలాకాలం క్రిందట పెళ్ళిలో గొడవ పెట్టింది. ఆ కథ చెబుతా విను అన్నాను."

"భేష్! భేష్ కథలో కథ. బాగుంది, చెప్పండి" అన్నా డాకాయన.

"కథలో కథ చెప్పడానికి నేనేం కథా సరిత్సాగరం తప్ప చెపుతున్నా ననుకున్నా రటండీ. యథార్థంగా ఆ వేళ జరిగిన విషయమే చెపుతున్నాను."

"చిన్నవాడు వాడికేం పోనిద్దురూ, మర్యాదా మప్పితం తెలీదు. మీరు కానివ్వండి" అన్నా రొక మీసాల ఆసామి.

"ఆ! కథకేం వుందిలెండి. మా పినతల్లిగారమ్మాయి లేదూ...మీలో చాలామందికి తెలియకపోవచ్చులెండి. నర్సీపట్నం దగ్గర ఓ చిన్న పల్లెటూరు యిచ్చేరు. వాళ్ళది కూడా ఆ దగ్గర గ్రామమే. ఆ పెళ్ళికి నేను వెళ్ళేను. అన్ని పెళ్ళిళ్ళకి తయారయ్యే భోజన ప్రియుణ్ని స్వయానా పినతల్లి కూతురు పెళ్ళికి వెళ్ళినా.

"అప్పుడింక పెళ్ళిపీటలమీద కూర్చోవలసిన సమయానికి పెళ్ళికూతురు నేను వెళ్ళనని ఏడుపు లంకించుకుంది. అంతకు ముందే పెళ్ళికూతురు చిన్నన్న ఆ సంబంధానికి ఆగ్రహించి పెళ్ళికి యింటిదగ్గర వుండడం మానేసేడు. మా పినతల్లి ఓ మూల కూర్చుని కళ్లు ఒత్తుకుంటుంది.

"వాళ్ళకి ఆ పిల్ల ఒక్కర్తే ఆడపిల్ల. ఎంతో ముద్దుగా పెంచేరు. చిన్నపిల్లప్పటి నుండి నర్సీపట్నంనుండి ఓ మేష్టరువచ్చి సంగీతం నేర్పేవాడు. అల్లికా, కుట్టూ గ్రామంలోనే నేర్చుకుంది. వాళ్ళ చిన్నన్న ఇంగ్లీషు పాఠాలుకూడా నేర్పేడు. పిల్ల కూడా అందంగా వుంటుంది. అన్ని విధాలా అదృష్టవంతురాలైన ఆ అమ్మాయికి దక్కని

(47-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

(4-12-57 మొదలు 10-12-57 వరకు)

గ్రహ స్థితి

	కే		
	మేష, వృషభ, మిథున, కర్కాటకములలో చంద్రుడు		
శు			
బు	ర శ	కు గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

గత వారము వలెనే ఈ వారము కూడా ఆదాయాభివృద్ధికి అధిక కార్యభారమును పైన వేసుకొని ఆశాభంగము పొందుతారు. అయిననూ కోర్టువ్యవహారములలో కొంత అనుకూలత వుంటుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి. వ్యాపారస్తులకు లాభము తక్కువ. ఆరోగ్యము చెడే సూచనలున్నవి. వ్యవహారముపట్ల నీచస్త్రీలతో వివాదము కలుగుతుంది. 4, 5 తేదీలలో కార్యభారమువల్ల శ్రమ. 6, 7, 8 తేదీలలో కొంత అనుకూలత. 10 తేదీన వివాదము, మనస్తాపము.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారముకూడా మీకు మంచియోగము కాదు. సోదరునివల్ల కలిగిన ఆర్థిక సహాయము అవసరాలకు చాలక కుటుంబములో కలతలు, గాయములవంటి ప్రమాదము కలుగవచ్చును. అధికారుల చురుకుమాటలచేత ఉద్యోగస్తులు ఆరాట పడతారు. 4, 5 తేదీలలో ఖనిజముల, లోహముల వ్యాపారస్తులకు శ్రమ ఎక్కువైయైననూ లాభము కలుగుతుంది. వారాంతమున కొంత మేలు. 10వ తేదీని అస్థిమితము.

కృత్తిక [అ, ఈ, ఉ, ఏ]

ఉన్నత స్థితిలో నున్న వారి సహాయము వల్ల ప్రయత్నించిన కార్యములు నెరవేరుతాయి. ధనాదాయము ఎక్కువవుతుంది. కొత్తమిత్రులను కలుసుకుంటారు. బంధువులనుకూడి శుభకార్యములలో పాల్గొనుట, శుభకార్యనిశ్చయము చేస్తారు. విద్యార్థులు నూతన విషయాలు నేర్చుకుంటారు. వైద్యులకు, మందుల వర్తకులకు మేలుకాలము. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ కలుగుతుంది. 4, 5 తేదీలలో ప్రయాసము, అధికఖర్చులు. 6, 7, 8, 9 తేదీలలో కవులకు, కళాకారులకు, లాభదాయకము.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

ఈ వారము మీకు యోగకాలము. విజ్ఞుల సాంగత్యమువల్ల నూతనాంశాలను తెలుసుకుంటారు. కోర్టు వ్యవహారముల వంటి చిక్కు సమస్యలు పరిష్కారానికి వస్తాయి. సంతానమునకు సంబంధించి అభివృద్ధికలిగే యేర్పాట్లు చేస్తారు. పండితులకు న్యాయ

***

బి. నరసింగరావు

***

వాదులకు మేలు కలుగుతుంది. విద్యార్థుల చదువు చురుకుగా సాగుతుంది. 4, 5 తేదీలలో శ్రమతోకూడిన కార్యక్రమము. 6, 7, 8, 9 తేదీలలో కార్యానుకూలత. శుభయోగము. 10వ తేదీని అలసట. నటీనటులకు వారమంతయూ యోగకాలము.

* మృగశిర [వే, వో, కా, కీ]*

గత వారము మీకు కలిగిన చిక్కులు తీరిపోతవి. అనుకున్న సొమ్ము చేతికివస్తుంది. బంధువులను కలుసుకొని లాభముపొంది మృష్టాన్నభోజనముతో వినోదిస్తారు. గృహమందు కలిగిన అశాంతి తొలగుతుంది. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ కలుగుతుంది. వెండివర్తకులకు ప్రయాణమువల్ల లాభము కలుగుతుంది. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము, 4, 5 తేదీలలో ఖర్చులు ఎక్కువగుటచే అశాంతి, శ్రమ. 6, 7, 8, 9 తేదీలలో శుభయోగము.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. గతవారము అసంపూర్తిగా వున్న పనులను ఈ వారము లాభకరముగా ముగించుకుంటారు. వాహనయోగము కలదు. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులు లాభము పొందుతారు విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 4, 5 తేదీలలో త్రిప్పట; అశాంతి. 6, 7, 8, 9 తేదీలలో స్త్రీలతోనూ, అప్తులతోనూ విందు, వినోదము, శుభవార్త. 10 తేదీన అస్వస్థత.

* పునర్వసు [కే, కో, హా, హీ,] *

శరీరమునకు ఎక్కువ శ్రమ గలిగే పనులు చేయవలసివస్తుంది. ఆర్థికస్థితి ఏమంత తృప్తికరముగా వుండదు, పితృవర్గమువల్ల కలిగిన సహాయము అవసరములకు సరిపడక గృహకలతలు కలుగును. అందుచేత మనస్సునకూ అశాంతి కలుగుతుంది. వేళ తప్పిన భోజనమువల్ల ఆరోగ్యము భంగపడుతుంది. కోర్టు వ్యవహారములు వాయిదా పడతాయి. 4, 5 తేదీలలో ఉద్యోగస్తులకు ఒత్తిడి ఎక్కువ వారాంతమందు కొంత మెరుగుగావుంటుంది 10 వ తేదీని ఆరోగ్య భంగము.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈవారము మీకు అంత యోగకాలము కాదు. మొదట్లో కార్యానుకూలత కనబడినా చివరకు ఆశాభంగమగును. అయిననూ మిత్రుల సహాయమువలన కొంతవరకూ సానుకూలపడి ఊరట కలుగుతుంది. ఉద్యోగస్తులకు ఆర్థికముగా ఒత్తిడి ఎక్కువ, వ్యాపారస్తులకు మాంద్యముగా వుంటుంది. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ తక్కువ. 4,5 తేదీలలో అవసరాలు తీరనందున మనోవ్యథ. 6,7 తేదీలలో ప్రయాణము. వారాంతమున మిత్రసహాయము.

ఆశ్లేష [డీ, డూ, డే డో],

ఈవారము మీకు మిశ్రమయోగం. ఖర్చులు ఎక్కువయత్న కార్యములుఫలించక పోవచ్చును. సంసారముపట్ల నిర్మోహముగా వుండునట్లు కనబడుటచేత గృహకలతలు కలుగును. ఉత్తమగ్రంథపఠనమువల్ల ఆధ్యాత్మికచింత కలిగి మనశ్శాంతి ఏర్పడుతుంది. ఉద్యోగస్తులు కొంత కష్టపడినమీదట మేలు పొందుతారు. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ తక్కువైననూ కొత్తవిషయాలు నేర్చుకుంటారు. 4, 5 తేదీలలో కార్యసాధనలో జాప్యము; అశాంతి. 6,7 తేదీలలో పెద్దల సాంగత్యము; విజ్ఞానలాభము. వారాంతమున కొంత మేలు.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈవారము కార్యభారము ఎక్కువవుతుంది. సమయమునకు సొమ్మురాకపోవుటచేత ఖర్చులు ఎక్కువయి అస్థిమితము కలుగుతుంది. కోర్టువ్యవహారములు కొంతమేరకు

మీ పరముగా తీర్పు అవుతాయి. ఉద్యోగు లకు శ్రమ. వ్యాపారస్తులకు అశాంతి. దుష్ట స్త్రీలతో వివాదము. ఆరోగ్యము చెడే సూచనలు కనబడగానే శ్రద్ధ వహించడము మంచిది. విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ తక్కువ. 4, 5 తేదీలలో కార్యభారము; ఆశాభంగము. 6, 7, 8 తేదీలలో లాభము లేని ప్రయాణము. 10 వ తేదీన అనా రోగ్యము.

* పూర్వ ఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

మిత్రులు తటస్థముగావుండి సకాలములో సోదరులవల్ల ఆర్థిక సహాయము అందకపోవుట చేత తలపెట్టినపనులు నెరవేరక మనోవ్యధ కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారుల చురుకుమాటలచేత మనస్సు గాయపడుతుంది. విద్యార్థులకు చదువుమీదకన్న వినోదము లపై ఉత్సాహము కలుగుతుంది. దెబ్బలు తగులుటవంటి ప్రమాదములు జరుగవచ్చును. 4, 5 తేదీలలో కార్యభంగము. ఆర్థికదుస్థితిచే అలజడి. 6, 7 తేదిలలో ఖనిజలోహముల వ్యాపారస్తులకు లాభము. 10 వ తేదీన అనారోగ్యము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పి]

ఈ వారము మిత్రసహాయముచేతను, స్వశక్తిని ఉపయోగించి కార్యానుకూలతను పొందుతారు. జ్ఞాతులను కలుసుకొనుట, సంతోషవార్త వినుట వంటి శుభయోగములు కలుగుతాయి. విద్యార్థులు క్రొత్తవిషయాలు నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు మేలుకాలము. మందుల వ్యాపారస్తులకు లాభము. కవులకూ, చిత్రలేఖకులకూ, నటీ నటులకూ యోగకాలము. 4, 5 తేదీలలో కార్యభారము, శ్రమ. 6, 7, 8 తేదీలలో బంధుమిత్ర దర్శనము, శుభయోగము. 10 వ తేదీన అస్వస్థత.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీకు మంచి యోగకాలము. పండితులవల్ల నూతనాంశాలు తెలుసుకుం టారు. కోర్టువ్యవహారములవంటి చిక్కులు అనుకూలముగా పరిష్కారమవుతాయి. ధనాదాయము అభివృద్ధి అవుతుంది. విద్యార్థులు ఉపయోగపడే విషయాలు నేర్చు కుంటారు. ఉద్యోగస్తులకు అధికారుల ఆద రణ లభిస్తుంది. పుత్రులకు అభివృద్ధి కలుగు తుంది. న్యాయవాదులకూ, పండితులకూ, కళాకారులకూ మేలుకాలము. 4, 5 తేదీ లలో కార్యాచరణలో శ్రమ. 6, 7, 8 తేదీ లలో ధనయోగము, పండిత సాంగత్యము, విజ్ఞానార్జన. 10 తేదీన అశాంతి.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము యత్నకార్యములు అనుకూ లిస్తాయి. మిత్రులతో వినోదములలో పాల్గొంటారు. తూర్పుదిక్కునుండి శుభ వార్త వింటారు. వెండి వ్యాపారస్తులకు లాభదాయకము. విద్యార్థులకు నూతనోల్లా సము కలుగుతుంది. కళాకారులకు, కవులకు, నటీనటులకూ యోగకాలము. 4, 5 తేదీ లలో కార్యభారమువల్ల త్రిప్పట, అశాంతి. 6, 7, 8 తేదీలలో కార్యసిద్ధి. ఆర్థికలాభము 10 తేదిని అస్వస్థత.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈవారము ఆర్థికస్థితి బాగుంటుంది. ధర్మ కార్యాచరణలో నిమగ్నులౌతారు. కోర్టు వ్యవహారములు సుముఖమవుతాయి. బంగా రము వర్తకులకు లాభము, వాహనయోగము కలుగుతుంది. పిల్లలశుభకార్యములగురించి ఆలోచన చేస్తారు. విద్యార్థులు ఉత్సాహ ముగా వుంటారు. కవులకూ, గాయకులకూ, నటీనటులకూ యోగకాలము. 4, 5 తేదీలలో కార్యభారమువల్ల శ్రమ 6, 7, 8, 9 తేదీ లలో ప్రయాణము, కార్యలాభము, బంధు వులతో విందుభోజనము. 10 వ తేదిన అశాంతి.

విశాఖ [తీ, తూ, తే, తో]

మీ ఆర్థికాభివృద్ధికి చేసే ప్రయత్నాలు విఫలమవుతాయి. సకాలములో పితృవర్గము నుండి కోరినసహాయము రానందున గృహోపక రాలు తీరక కలతలు వస్తాయి. కార్య భారముచే శరీరస్థితి, మానసికస్థితి అసంతృప్తి కరముగా వుంటుంది. వేళతప్పిన భోజనము చేత ఆరోగ్యము చెడుతుంది. వెంటనే శ్రద్ధ తీసుకోవడం మేలు. వర్తకులకు ఒడి దుడుకులచే అశాంతి. క్రొత్త సమస్యలు తలెత్తుటచే ఉద్యోగస్తులు కలవరపడుతారు. 4, 5 తేదీలలో త్రిప్పట, కార్యభంగము, అశాంతి. 6, 7, 8, 9 తేదీలలో స్వల్ప యోగము. 10 వ తేదిని అనారోగ్యము.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈవారము సకాలములో ధనాదాయము కలుగకపోవుటచేత తలపెట్టిన పనులు నెర వేరక వ్యథ కలుగుతుంది. మీరు విరోధి అని అపోహపడే వ్యక్తి సహాయంవల్ల వారాంత మున కార్యానుకూలతను పొందుతారు. వ్యాపారస్తులకు మొదట్లో అనుకూలము లేక పోయిననూ వారాంతమునకు లాభిస్తుంది. విద్యార్థులకు చదువుపై అశ్రద్ధ. 4, 5 తేదిలలో అధికఖర్చులు, ఆశాభంగము, శరీరాయాసము. 6, 7, 8, 9 తేదీలలో ప్రయాణము. మిత్రసహాయము, కార్యాను కూలత. 10 వ తేదిని అస్వస్థత.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము అనుకున్నట్టుగా పనులు అవకపోవుటచేతను, కోరిన సహాయము లభిం చకపోవుటచేతను అవసరములు తీరక గృహ కలతలు వస్తాయి. అయిననూ ఓర్పుతో కార్యసాధనకు ప్రయత్నించుతారు. జ్ఞానుల సాంగత్యమువల్ల ఆత్మశాంతి పొందుతారు. 4, 5 తేదిలలో వర్తకులకు త్రిప్పట, ఆశా భంగము. వారాంతమున కొంత లాభము. విద్యార్థులకు చదువు సాగదు. 6, 7, 8, 9 తేదీలలో ఉద్యోగస్తులకు కొంత అనుకూ లము. 10 వ తేదిన గృహమందుండువారి ఆరోగ్యమునుగురించి వ్యథ.

మూల [యే, యో, బా, బీ]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. కార్యభారము అధికమగుటచే శ్రమ, అశాంతి. కోర్టువ్యవహారములు కొంత వరకూ అనుకూలిస్తవి. ఇచ్చిపుచ్చుకొనే చోట్ల దుష్టస్త్రీలతో వివాదమువల్ల మనో వ్యథ. భార్యకు అనారోగ్యము. 4, 5 తేదీ లలో యత్నకార్యభంగము, వివాదము. 6, 7, 8, 9 తేదిలలో స్వల్ప అనుకూలత.

ధరలు

నూలు, వస్త్రములు: మందమగును.

నూనెదినుసులు: మందమగును.

బెల్లము, పంచదార, చింతపండు ఓ స్వల్పముగా హెచ్చును.

ఆహారధాన్యములు:-మందగించును.

పప్పుదినుసులు: మార్పు లేదు.

వెండి, బంగారము: నిలకడగా వుండును.

ఒక్కొక్కచోట వర్షపీడ కలుగును. దక్షిణదేశమున బాగుగా వర్షించును. 8 వ తేదీ తరువాతను కొద్దిగా వాయుపీడ కలుగును.

జన్మనక్షత్రమునుబట్టిగాని, జన్మ నక్షత్రము తెలియనివారు నామ నక్షత్రము (వారివారి పేర్లననుసరించి పేరు మొదటి అక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణు డను పేరునకు మృగశిరానక్షత్రమును, కృష్ణుడను పేరునకు స్వాతియును, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్ర పాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనేపేర్లకు పూర్వా షాఢయును చూచుకొనునది.

★ నక్షత్రఫలితాలు ★

10 వ తేదీన భార్య అనారోగ్యముచే వ్యథ. విద్యార్థులకు బద్ధకము హెచ్చు.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఎక్కువ శ్రమకలిగే పనులు సాహసముతో పైని వేసుకొని కార్యసాధన కానందున నిరాశకలుగుతుంది. అయినప్పటికీ భ్రాతృ సహాకారమువల్ల కొంత సాధించకలుగుతారు. ఉద్యోగస్తులు అధికారుల చురుకు మాటలచే కలతచెందుతారు. వాడిగల పనిముట్లవల్లగాని అగ్నివల్లగాని ప్రమాదము. 4 5 తేదీలలో త్రిప్పట, శ్రమ, అశాంతి కలుగుతాయి. 6, 7, 8, 9 తేదీలలో లోహపుసామానులు, రంగులు వ్యాపారము చేయువారికి లాభిస్తుంది. 10 వ తేదీని అనారోగ్యం.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

గత వారము మీకు కలిగిన కార్యనష్టము కూడదీసుకుని లాభము పొందుతారు. శుభ కార్యములను గురించి చేసే ప్రయత్నములు పరిష్కారానికి వస్తాయి. గృహమందుండు వారి ఆరోగ్యము సరియవుతుంది. కవులు నూతన గ్రంథరచన చేస్తారు. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు గౌరవము, హోదా పెరుగుతాయి. వైద్యులకు, మందుల వ్యాపారస్తులకు మేలు కాలము. కవులకు కళాకారులకు నటీనటులకుయోగము. 4 5 తేదీలలో కార్యభారం, త్రిప్పట, శ్రమ. 6 7 8 తేదీలలో శుభ యోగము. 10 వ తేదీని అస్వస్థత.

శ్రవణము [జూ, జే, జో, ఖా]

ఈ వారము పండితగోష్ఠివల్ల, గ్రంథ పఠనవల్ల జ్ఞానాభివృద్ధిచేసుకుంటారు. యత్న కార్యములు ఫలిస్తాయి. భార్యా బిడ్డలతో సుఖముగా గడుస్తుంది. వ్యాపారస్తులకు లాభ యోగము. విద్యార్థులకు చదువు చురుకుగా సాగుతుంది. ఉద్యోగస్తులకు గతవారము గలిగిన మనోవ్యథ తీరుతుంది. ఆర్థిక స్థితి మెరుగుగా వుంటుంది. న్యాయవాదులకు, పండితులకు, కళాకారులకు యోగకాలము. 4 5 తేదీలలో శ్రమ. 6 7 8 తేదులలో ప్రయాణమువల్ల లాభము. కార్యసిద్ధి. 10 వ తేదీన అనారోగ్యము.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈ వారము మీ ఆర్థికస్థితి బాగుంటుంది. బంధుమిత్రులను కూడి గాయకులతోనూ, కళాకారులతోనూ వినోదముగా గడుపుతారు. మాతృవర్గమువారి సహాయముతో శుభ కార్య నిశ్చయము చేస్తారు. అప్తులతో మృష్టాన్న భోజనము ఆరగిస్తారు. వెండి వర్తకులకు లాభముగా వుంటుంది. విద్యార్థులకు చదువు శ్రద్ధగా సాగుతుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగ కాలము. 4, 5 తేదీలలో శ్రమ, 6, 7, 8, 9 తేదీలలో ప్రయాణము, బంధుదర్శనము, శుభకార్య చింత. 10-వ తేదీని అస్వస్థత.

శతభిషం [గో, సా, సీ, సూ]

ఈ వారము మీకు చాలాయోగకాలము. కొన్నాళ్ళనుండి బాధకలిగిస్తున్న చిక్కు సమస్యలు పరిష్కారానికి వస్తాయి. ఆదాయము వృద్ధిఅవుతుంది. విలువైన వస్తువులను కొని అమ్మటవల్ల వర్తకులు లాభముపొందుతారు. విద్యార్థులు ఉత్సాహముతో కొత్త విషయాలను నేర్చుకుంటారు. ఉద్యోగస్థులకు కొంతకాలమునుండి వున్న అశాంతి తొలగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 4, 5 తేదీలలో ప్రయాసము. 6, 7, 8, 9 తేదీలలో శుభయోగము. 10-వ తేదీన అనారోగ్యము.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

తగిన నిర్ణయమునకు రాలేక చేయవలసిన పనులు సకాలములో జరుగక శరీరస్థితి, మానసికస్థితి అసంతృప్తికరంగా వుంటుంది. పితృవర్గమువల్ల పొందవలసిన సహాయము సమయమునకు రానందున అవసరములు తీరక గృహకలతలు కలుగుతవి. వేళతప్పిన భోజనమువల్ల ఆరోగ్యము చెడుతుంది. వెంటనే శ్రద్ధతీసుకుంటే మేలు. 4, 5 తేదీలలో త్రిప్పట, అస్థిమితము, ఉష్ణాధిక్యము, 6, 7, 8, 9 తేదీలలో అనుకూలత, స్వల్ప సహాయము, 10 వ తేదీని అనారోగ్యము.


***ఉత్తరాభాద్ర [దూ, శం, ఛా, ధా] ***

ఈ వారము మిశ్రమఫలములుకలుగుతాయి. మొదట్లో కార్యభంగమువల్ల నిరాశకలిగినను వారాంతమున తెలియకుండా మిత్రుల సహాయమువల్ల నిలిచిపోయిన కార్యములు నెరవేరుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి ఎక్కువ. విద్యార్థులకు చదువు చురుకుగా సాగదు. అనుకున్న ఆర్థికసహాయము అందకపోవుటవల్ల నిందలపాలు; మనోవ్యథ; 4, 5 తేదీలలో కార్యహాని, త్రిప్పట, శ్రమ. 6, 7, 8, 9 తేదీలలో మిత్ర సహాయము కార్యానుకూలత. 10 వ తేదీన ఆరోగ్య భంగము.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము అనుకున్న పనులు నెరవేరక ఆశించినసహాయము కలుగకపోవుటచే అవసరములు తీరక గృహకలతలు కలుగుతాయి. అయినను ఓర్పుతో కార్యసాధనకు ప్రయత్నిస్తారు. పెద్దల సాంగత్యమువల్ల ఆత్మశాంతి కలుగుతుంది. గృహమందుండువారి ఆరోగ్యముచెడుటచే ఆందోళన. విద్యార్థులకు చదువుసాగదు. 4, 5 తేదీలలో వర్తకులకు త్రిప్పట, ఆశాభంగము. వారాంతమున కొంత లాభము. 6, 7, 8, 9 తేదీలలో ఉద్యోగస్తులకు కొంతశాంతి. 10 తేదీని అస్వస్థత. ★





సుమారు ఎనభైఏళ్ళ క్రితం జరిగిన కథ ఇది. భారతదేశపు ఈశాన్యమూలగా అస్సాంరాష్ట్రంలో కాకులుదూరని కారడవులు, చీమలుదూరని చిట్టడవులు...అంతా చిత్తడి నేల...ఎప్పుడూ హోరున జోరున వాన...జలగలు ... మనుషుల్ని పీల్చి పిప్పి

మనదేశంలో నూనెపరిశ్రమ

చేసే భయంకరమైన "కాలాజార్"... వీటన్నిటికీ తెగించి కొందరు ఉత్సాహవంతులు చెట్లను ఛేదించుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. సూర్యరశ్మి జొరబడని ఆ కీకారణ్యాలలో పగలూ, రాత్రీ ఒకటే. రాత్రిళ్లు క్రూరజంతువుల భయం కూడా ఉంది. అటువంటి అడవి దారుల్లోంచి ముందుకుసాగే ఆ వ్యక్తులు "అస్సాం రైల్వేస్ ఎండ్ ట్రేడింగ్ కంపెనీ"కి చెందినవారు. లెడోనుంచి బ్రహ్మపుత్ర ఒడ్డున ఉన్న దిబ్రూఘర్‌కు బొగ్గు రవాణా చేయడానికగాను రైలుమార్గం వేయాలని వారి సంకల్పం.


ఆ భీకర పరిసరాలకి అలవాటు పడిన జంతువొకటి ఆకంపెనీ సిబ్బందిలో ఏనుగు ఉద్యోగం చేస్తోంది. ఏనుగుకి అప్పుడప్పుడు కాస్త మదపిచ్చి ఎక్కుతుందన్నమాట నిజమేగాని స్వతహాగా అది నిరపాయకరమైనది; మంచి తెలివితేటలు గలది. నీడపట్టున ఒంటరిగా కూచోడం, వేళాపాళా లేకుండా నీళ్లలోదిగి తలంటిపోసుకోడం దీనికి మహాఇష్టం. నీడ, ఏకాంతం, నీరు పుష్కలంగా ఉండే అస్సాం అడవులను ఏనుగు అందుకే బాగా మరిగింది.

ఒక రోజున ఆ ఏనుగు అధికారుల అనుమతి తీసుకుని సరదాగా ఈతలు కొట్టి రావడానికి చెరువుకు వెళ్లింది. మళ్లీ తిరిగి వచ్చేటప్పుడు అది కాళ్ళనిండా ఏదో నల్లటిజిడ్డు పదార్థం అంటించుకు వచ్చింది. దాన్ని చూసి ఇంజనీర్లు ఆశ్చర్యపోయి దాని అడుగుజాడలు అనుసరిస్తూ అది స్నానంచేసిన చెరువుకు వెళ్లారు. చూస్తే ఏముంది? అడుగునుంచి నూనె ఊట ధారాళంగా వస్తోంది. నీళ్ళనిండా నూనె తేలుతోంది. ఈ విధంగా అస్సాంలో నూనెని కనుక్కున్నారు.

అంతకుముందు 1866 లో రెండు చోట్ల నూనె దొరుకుతుందేమోనని బావులుతవ్వారు. కాని అది విఫలమైంది. 1867 లో 'మార్గరిటా' సమీపాన 'మాకుం' వద్ద 118 అడుగుల లోతున నూనె కనబడింది. కానిరవాణా రహదార్లులేకా, దూరాభారంవల్లా ఆ నూనె బావిని అలాగే వదిలేశారు.

1882 లో అస్సాం రైల్వేస్ ఎండ్ ట్రేడింగ్ కంపెనీ రైలుమార్గం వేసిం తరవాతే నూనె బావి తవ్వడానికి సరైన ప్రయత్నం జరిగింది. 1889 నాటికి 'డిగ్ బాయ్' వద్ద మొట్టమొదటి బావిని తవ్వారు. ఒక బావి అయిపోతే ఇంకోటి, అదైపోతే ఇంకోటి, ఇలా ఎన్నో బావులు తవ్వుతూ వచ్చారు. ఇప్పటికి 'డిగ్ బాయ్' నూనె బావులనుంచి 5 కోట్ల పీపాలనూనెతోడారు. ఆ నాడు కుగ్రామమైన 'డిగ్ బాయ్' ఈనాటికి పెద్ద పారిశ్రామిక నగరంగా వర్ధిల్లింది. నూనె వ్యాపారం చక్కగా సాగించేందుకు "అస్సాం ఆయిల్ కంపెనీ" అనేది

(41-వ పేజీ చూడండి)



★ చుక్క చుక్కగా పెట్రోల్ పుట్టుక ★


మనిషి సుఖంగా, నాగరికంగా జీవించడం అలవాటు చేసుకుంటున్నకొద్దీ భూగర్భంలో దొరికే అనేకపదార్థాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నాడు. ఎన్నో లక్షల ఏళ్లనుంచీ భూమి అడుగున బొగ్గు, ఇనుము మొదలైనవి నిరుపయోగంగా ఉండిపోయాయి. మనిషి తన బుద్ధికుశలతచేత వాటినిఉపయోగించడం నేర్చుకుని, తన జీవితాన్ని మరింత సులభంగా, సుకరంగా చేసుకుంటున్నాడు. ఈవిధంగా మనిషికి అత్యంత ఉపయోగకరమైన భూగర్భ పదార్థాల్లో పెట్రోలియం ఒకటి. పెట్రోలియం అంటే ముడినూనె, లేక మడ్డినూనె.

గడచిన 50 ఏళ్లలో ప్రపంచంలో అనేక చోట్ల భూమిత్రవ్వి 6600 కోట్ల పీపాల నూనె తీశారు. మరి కొంతకాలంలో నూనె వస్తుందని తెలిసిన స్థలాల్లో తవ్వి మరొక 9200 కోట్ల పీపాల నూనె తీయవచ్చును. అదికూడా అయిపోతే ఏంచేయడమా అని దిగులుపడక్కర్లేదు. సముద్రాల అడుగున ఒకటిన్నర లక్షలకోట్ల పీపాల నూనె ఉందని అంచనా!

అందుచేత నూనె నిలవలు ఇప్పుడప్పుడే అయిపోతాయేమో అనే బెంగ అక్కరలేదు. మనిషి కనిపెట్టగలగాలే గాని కావలసినంత నూనె.

ఇంతనూనె ఎక్కణ్ణించి వచ్చింది? ఎలా వచ్చింది? అని ఆశ్చర్యం కలుగుతుంది.

అబ్బో! ఇది నిన్న మొన్నటి కథా? భూగోళపు చిన్నతనం రోజుల్లో జరిగిన కథ. కొన్నికోట్ల ఏళ్ళు వెనక్కి వెళ్లాలి. వెళ్ళినా మనకి సరిగ్గా సమాధానం తెలియదు. కొంత ఊహ, కొంత సిద్ధాంతం, కొంత మాత్రమే ఋజువు, అవుతుంది.



విశాఖలో మడ్డినూనెను ఆవిరిద్వారా నిష్కల్మషంచేసి శుభ్రపరిచే "క్రూడ్ డిస్టిలేషన్ యంత్ర విభాగం" సాంద్రతనుబట్టి గ్యాసొలీన్, కిరోసిన్, డీసెల్ ఆయిల్ గా మడ్డినూనె ఈ యంత్రంలోనే మార్పు చెందుతుంది.

పెట్రోలియమ్‌లో హైడ్రోజన్, కార్బన్ అనే రెండు మూలపదార్థాలున్నాయి. ఇవి వేడివలన, ఒత్తిడివలన రసాయనికమైన మార్పులు పొంది పెట్రోలియంగా రూపొందాయని కొందరంటారు. కాని ఇప్పుడందరూ అంగీకరించే ఇంకో సిద్ధాంతం ఏమిటంటే, కొన్ని లక్షల జంతువులు, మొక్కలు చచ్చిపోయి రసాయనికమైన మార్పులుపొంది హైడ్రోకార్బన్లుగా పరిణమించాయని.

భూమిమీద కొన్నికొన్ని భాగాలు చాలా కాలందాకా చెక్కుచెదరకుండా ఉంటాయని భూగర్భశాస్త్రజ్ఞులు అంటారు. మంచు కరిసీ, వాన కురిసీ నదులప్రవాహంలో కొట్టుకువచ్చి బోలెడు బోలెడు మడ్డి డెల్టా ప్రాంతాల్లోను, నదిముఖద్వారాల్లోను, నేలకి దగ్గరగాఉండే సముద్రపు పడియలలోను చేరుకుంటుంది. కొన్నికోట్ల చిన్న చిన్న ప్రాణులు, మొక్కలు కుళ్ళిపోయి ఈ మడ్డి ఏర్పడుతుంది. ఇలా మడ్డి ఒక పొర మీద మరొకపొరగా కొన్ని లక్షల ఏళ్ళ పాటు పేరుకుపోతుంది. ఈ పొరలబరువు వల్ల సముద్రపు అడుగుభాగం కుంగిపోతుంది. పై పొరల ఒత్తిడికి అడుగుపొరలు గట్టిపడి రాళ్ళుగా మార్తాయి. మడ్డిలోఉన్న జంతువుల కళేబరాలు, మొక్కలు కొంత కాలానికి కుళ్ళిపోతాయి. సూక్ష్మజీవులమూలంగా ఈ కుళ్ళిపోయిన పదార్థంలో నూనెచుక్కలు ఏర్పడతాయి. ఈ నూనెచుక్కలను సున్నపురాళ్లు, ఇసుకరాళ్లు, పీల్చుకుంటాయి.

తరవాత ఎప్పుడో కొంతకాలానికి పెద్ద పెద్ద భూకంపాలువచ్చి భూగర్భంలోఉన్న మడ్డిరాళ్ళపొరలను పైకెత్తి పెద్దపెద్ద కొండలు ఏర్పడేట్టు చేస్తాయి. కొన్ని పొరలు మాత్రం ఇంకా అడుగునే ఉండిపోతాయి. ఇలా భూకంపం వచ్చినప్పుడు, భూకంపం ఆగిపోయినతరవాత భూమి అడుగున ఉండే నీటిప్రవాహాలు నూనెచుక్కలను మోసుకొని పోవడం మొదలెడతాయి. క్రమంగా ఈ నూనెచుక్కలన్నీ ఒకచోటికి చేరుకుని పెద్ద రిజర్వాయరుగా ఏర్పాటవుతాయి. సాధారణంగా చెక్కుచెదరకుండా ఉన్న మడ్డిపొరలవద్దనే పెద్ద పెద్ద నూనె నిలవలు దొరుకుతాయి. ఉదాహరణకి గంగా, బ్రహ్మపుత్ర నదుల లోయలలో చెదరకుండా ఉన్న మడ్డిపొరలలోనే నూనె నిలవలు బోలెడు ఉన్నాయి. నూనె పోదా చేస్తే అక్కడే చెయ్యాలి. డిగ్‌బాయ్ నూనె

(55-వ పేజీ చూడండి)

కాల్టెక్స్ కథ

ఆర్థిక పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నవాధ్యాయ రచనకు ఆంధ్రప్రదేశ్ ఉపక్రమిస్తున్నది. కాల్టెక్స్ కంపెనీ విశాఖ పట్టణంలో నిర్మించిన నూనెశుద్ధి యంత్రాగారానికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నవంబరు 30 న ప్రారంభోత్సవం జరుపుతున్నారు.

యుద్ధ సమయంలోనూ, శాంతి సమయంలోనూ కూడా రకరకాల రూపంలో లభ్యమవుతున్న నూనెలు ఆధునిక మానవ సమాజంలో అతిప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నవి. ఉత్తమోత్తమమైన రేవు స్థానమని అంతర్జాతీయ ఖ్యాతి గాంచుచున్న విశాఖ పట్టణంలో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా రూపొందుతున్న ఈ నూనెశుద్ధి యంత్రాగారాన్ని నిర్మించిన కాల్టెక్స్ కంపెనీ కథ ఏమిటి?

న్యూయార్క్‌కు చెందిన టెక్సాస్ కంపెనీ సలహాదారులు క్రీ.శ. 1911 లో బొంబాయి నగరంలోని రావిన్ వీధిలో ఒక చిన్న కార్యాలయం స్థాపించుకుంది. అప్పట్లో అది కేవలం ట్రాక్టర్లకు మడ్డినూనెలనూ, కిరసనాయిల్‌నూ మాత్రమే దిగుమతి చేసి దేశంలో విక్రయిస్తుండేది. దేశంలో మోటారుకార్లు అప్పటిలో ఇప్పటంత విరివిగా వాడకంలో వుండేవి కావు. కొంతకాలం పాటు డంకన్ స్ట్రాటన్, వాల్కార్ట్ కంపెనీలు, టెక్సాస్ కంపెనీ సరుకు మన దేశంలో అమ్మిపెడుతూవచ్చినవి.

ఇలావుండగా, 1929 జూన్ 1 న టెక్సాస్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్ అనే పేరుతో బొంబాయిలోనే ప్రధాన కార్యాలయాన్ని స్థాపించారు. మద్రాసు, కలకత్తా, కరాచీనగరాలలో దానికి బ్రాంచి కార్యాలయాలను కూడా పెట్టారు. బొంబాయిలోని ప్రధానకార్యాలయం మహాత్మాగాంధిరోడ్‌లోని 'జహాంగీర్ భవనంలో' వుండేది. ఆనాడు కంపెనీ రిజస్ట్రేషన్ వ్యవహారాలను హెచ్. ఏ. థామస్ అనే అతను చూసేవాడు. తర్వాత టెక్సాస్ కంపెనీ అధ్వర్యాన్ని సి. బి. గ్రాహాం వహించాడు. అతనే దాని మొదటి మేనేజింగ్ డైరక్టరు. ఎఫ్. హెచ్. ఫ్లాన్‌సర్ అనే అతను మార్కెటింగ్ శాఖను ఇటీవలివరకూ నిర్వహిస్తూ వచ్చారు.

అచిరకాలంలోనే తమ సరుకు బహువిరివిగా అమ్ముడుపోవడంతో 'టెక్సాకో' కార్యాలయాన్ని విశాలమైన 'కెయిజర్-ఇ-హింద్' భవనానికి మార్చివేశారు. తర్వాత 'కాల్టెక్స్‌హౌస్'కి మారింది.

కాలిఫోర్నియా స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ బాహ్రేన్ దీవిలో ఆధునిక నూనె శుద్ధి యంత్రాగారాన్ని నిర్మించడంతో, కాలిఫోర్నియా-టెక్సాస్ ఆయిల్ కంపెనీ అనే ఒక కొత్తదాన్ని స్థాపించారు. ఇదే సంక్షిప్తంగా 'కాల్టెక్స్ కంపెనీ' అయింది. దీని నుంచే కాల్టెక్స్ (ఇండియా) లిమిటెడ్ 1937 జూలైలో ఉద్భవించింది. అప్పటి నుంచీ ఇది శాఖోపశాఖలుగా విస్తరించి దేశాభ్యుదయానికి కృషిచేస్తున్నది. నూనె శుద్ధి యంత్రాగార స్థాపన విషయంలోనే గాక, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి లోయ మొదలైన ప్రాంతాలలో నూనెగనుల అన్వేషణ విషయంలో కూడా ఈ కంపెనీ ఇకముందు విశేష శ్రద్ధాసక్తులను ప్రదర్శిస్తుందని ఆశించవచ్చు. ★



హెచ్. బి. నికల్స్

వీరు న్యూయార్కులోని కాల్టెక్స్ కంపెనీ ఉపాధ్యక్షులు.

జి. ఆర్. ఫెర్గుసన్



కాల్టెక్స్ ఈస్ట్ కంపెనీ అధ్యక్షుడు, కాల్టెక్స్ ఆయిల్ రిఫైనింగ్ (ఇండియా) లిమిటెడ్ డైరక్టర్ల సంఘాధ్యక్షుడు. కాల్టెక్స్ కంపెనీలో అత్యున్నత పదవికి రాకపూర్వం వీరు ప్రపంచంలోని పలుప్రాంతాలలో ప్రధానమైన అనేక ఉద్యోగ బాధ్యతలను నిర్వహించి వున్నారు.

వీరిజననం బ్రూక్లిన్ (న్యూయార్కు) పట్టణంలో. కార్నెల్ విశ్వవిద్యాలయంలోనూ, మెసాచూసెట్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లోనూ విద్యాభ్యాసం చేశారు. రసాయనిక ఇంజనీరింగ్ వీరి అభిమానశాస్త్రం.


1926 లో టెక్సాస్ కంపెనీ ఉద్యోగంలో ప్రవేశించి నూనెశుద్ధి శాస్త్రంలోనూ, నూనెశుద్ధి యంత్రాగారాలకు రూపురేఖలు తీర్చిదిద్దడంలోనూ, నూనె పంపిణీ, విక్రయ కార్యాల అభివృద్ధి విషయంలోనూ విశేషానుభవం గడించారు.

శ్రీ ఫెర్గుసన్ ఆస్ట్రేలియాలో చిరకాలంపనిచేసి చివరకు అక్కడిసంస్థకు జనరల్ మేనేజర్‌గా నియుక్తులైనారు. 1941 లో వీరు పిలుపుమీద స్వదేశానికి వెళ్లినపుడే అమెరికా ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ప్రవేశించడం జరిగింది. కాల్టెక్స్ కంపెనీపదవికి మరి కొంతకాలం సెలవుపెట్టి, అమెరికన్ యుద్ధపరిశ్రమలకు సంబంధించిన అనేక ప్రధానోద్యోగాలను నిర్వహించారు.

సైనిక శిబిరాలకు కృత్రిమ రబ్బరుతో టైర్లను తయారుచేయడం, సైనికుల ఉపయోగంకోసం సముద్రపు నీటిని ఉప్పునీటిగా మార్చే యంత్రాలను తయారుచేయడం మొదలైనవి. వీరు అప్పుడు సాధించినపనులలో కొన్ని. షర్షియాలోని అబదాన్ నూనెశుద్ధి యంత్రాగార విస్తరణకు ప్రాజెక్టు ఇంజనీరుగాకూడా పనిచేశారు.

యుద్ధానంతరం 1946 లో వీరు తిరిగి కాల్టెక్స్ సర్వీస్‌లో చేరారు. ఈ ఏడాదే వీరిని కాల్టెక్స్ ఈస్ట్ కంపెనీ అధ్యక్షుపదవికి నియమించారు. ★

విశాఖప
నూనెశుద్ధి య



విశాఖపట్టణం, సముద్ర తీరాన కట్టిన కాల్టెక్స్ నూనెశుద్ధి కర్మాగారానికి పదిహేనుకోట్ల రూపాయలు ఖర్చయింది. పారిశ్రామికంగా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ లో ఇంతపెద్ద ప్రైవేటు వ్యాపారసంస్థ ఇంతకుముందు లేదు. ఈ కర్మాగారంవల్ల ఆంధ్రదేశానికే కాదు, భారత ఆర్థికవ్యవస్థకే క్రొత్త బలం చేకూరుతుంది. ఈ కర్మాగారం మన విదేశీ ద్రవ్యం వృథాగా ఖర్చయిపోకుండా చేయడమేకాదు, ఎంతమందికో జీవనోపాధి కలిగిస్తుంది. విశాఖపట్టణం వెనకవున్న విశాలప్రాంతాలకి ఇంతవరకూ దూరదూరాల నుంచి నూనె సరఫరా చేయవలసివచ్చేది. ఇప్పుడా బాధ లేదు. విశాఖపట్టణంలోనే నూనెశుద్ధికర్మాగారం ఉండడంచేత, తేలిగ్గా, త్వరగా నూనెను, ఇతర పెట్రోలియం పదార్థాలను సరఫరా చేయడానికి వీలవుతుంది.

ఈసమస్య మనదేశానికి నూనె అవసరం చాల హెచ్చింది. అందుచేత క్రొత్తగా ఒక నూనెశుద్ధికర్మాగారాన్ని కట్టవలసిన అవసరం ఏర్పడింది. ఇంతకుముందు ఈ కర్మాగారాలన్నీ పడమటి కోస్తాలో బొంబాయి దగ్గిరే కడుతూ వచ్చారు. ఈసారి కర్మాగారాన్ని తూర్పుకోస్తాలో కడితే బావుంటుందని తోచింది. 1952 లో ముగ్గురు నిపుణులతో కూడిన ఒక సంఘం తూర్పుకోస్తాను క్షుణ్ణంగా పరిశీలించి చూసింది. విశాఖపట్టణం దగ్గిర కర్మాగారాన్ని కడితే క్షేమంగా ఉంటుందని నిశ్చయించారు. 1958 మార్చి 28న కాల్టెక్స్ కంపెనీకి భారతప్రభుత్వానికి ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం క్రొత్త కర్మాగారాన్ని కట్టడానికి గాను, కాల్టెక్స్ కంపెనీ "కాల్టెక్స్ ఆయిల్ రిఫైనింగ్ (ఇండియా) లిమిటెడ్" అని ఒక భారతీయ కంపెనీని స్థాపించింది.

ఈవిధంగా ఈ కర్మాగారం ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఒక ముఖ్యభాగమైంది.

కర్మాగారం తాలూకు స్థలం 518 ఎకరాలుంది. అంటే, మనుషులు పనిచేయడానికి కావలసినట్టే కాగా. సుఖంగా, హాయిగా

...ట్టణం ...ంత్రాగారం



పని చెయ్యడానికి అనువైన అందమైన పరిసరాలు! ఇంత పెద్ద జాగా మనదేశంలో ఏ యితర నూనె కర్మాగారానికీ లేదు. కర్మాగారాన్ని ఇంకా పెద్దది చేయాలన్నా ఈ చోటు సరిపోతుంది.

ఆంధ్రప్రదేశ్ పరిశ్రామిక రాష్ట్రం. ఈ రాష్ట్రంలో ఇంత పెద్ద కర్మాగారం కట్టడం మూలాన రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహం జరుగుతుందనడానికి సందేహం లేదు. విశాఖపట్టణం ఇంతకు మునుపే భారత నౌకా నిర్మాణానికి కేంద్రంగా ఉంటోంది. ఈ నూనె కర్మాగారంతో దాని కీలక ప్రాముఖ్యం, వ్యాపార ప్రాధాన్యం ఇనుమడించాయి.

కర్మాగారం ప్లాను పూర్తిగా తయారుచేయడానికి రెండేళ్లు పట్టింది. ఈ ప్లాను తయారుచేసినది లండన్, కాల్టెక్స్ సర్వీసెస్ లిమిటెడ్. నిర్మాణానికి లండన్, లూమస్ కంపెనీ కంట్రాక్టు పుచ్చుకుని, కొన్ని భారతీయ కంపెనీలను సబ్ కంట్రాక్టర్లుగా నియమించింది.

నిర్మాణ వివరాలు

1955 మధ్యలో, బుల్‌డోజర్లు పని మొదలుపెట్టాయి. నేల చదును చేశాయి. తరవాత పునాదులు కట్టారు. పని సాగినకొద్దీ ఎన్నో సమస్యలు బయలుదేరాయి. ఇంజనీర్లు అన్నిటినీ ఎదుర్కొని పరిష్కరించేశారు. 1957 మధ్యకాలానికి కర్మాగారం తయారై పని మొదలుపెట్టింది. పెట్రోలు, డీసెల్ నూనె, ఇంధన తైలాలు, కిరసనాయిలు ఇవన్నీ తయారుచేస్తూ దేశంలో అన్నిచోట్లకీ సరఫరా చేయసాగింది. ఇప్పుడు ఏడాదికి సుమారు 8,11,000 టన్నుల శుద్ధిచేసిన నూనె రైలుమార్గాన, మరొక 2,82,000 టన్నులు సముద్రమార్గాన దేశంలో సరఫరా అవుతుంది.

ఇంతకుముందు విశాఖపట్నానికి నీటి ఎద్దడి జాస్తిగా ఉండేది. అందుకని కర్మాగారానికే కాక, నగరమంతటికీ మంచినీరు సరఫరా చెయ్యడంకోసం ప్రభుత్వం 26 అంగుళాల గొట్టం నిర్మించింది. దీనికైన ఖర్చును కర్మాగారమే నీటిపన్ను చెల్లిస్తూ భరించింది. ఈ విధంగా నగర ప్రజలకు కర్మాగారం ధర్మమా అని నీటి సౌకర్యం కలిగింది.

నగరానికీ, కర్మాగారానికీ కావలసిన విద్యుచ్ఛక్తిని 125 మైళ్ల దూరాన ఉన్న మాచ్‌ఖండ్ ప్రాజెక్టు సరఫరా చేస్తోంది.


వీలైనంతవరకూ భారతీయ కంట్రాక్టర్లనే నియమించారు. వస్తుసామగ్రి కూడా ఈ దేశంలోనే కొన్నారు. రకరకాల సామగ్రి సప్లయి చేసే కొత్త పరిశ్రమలు కొన్ని బయలుదేరాయి. అసలు ఈ కర్మాగారం ఎంత పెద్దదో ఈ అంకెలు చూస్తే తెలు

(55-వ పేజీ చూడండి)

నూనె శుద్ధిపద్ధతి

బావులు తవ్వి నూనెను బయటికి తోడగానే పనంతా అయిపోదు. తవ్వి తీసిన నూనె ముడిగా ఉంటుంది. నూనె తవ్వడం ఒక ఎత్తు అయితే, దాన్ని శుభ్రం చెయ్యడం మరొక ఎత్తు. ముడినూనెను శుభ్రం చేయడంలో ఒక విశేషం ఉంది. సాధారణంగా ఒక ముడి పదార్థంలోంచి చాలా తక్కువ మాత్రమే మంచి పదార్థాలు తయారవుతాయి. కాని ముడినూనె లేక పెట్రోలియం నుంచి తయారయ్యే శుభ్రపదార్థాలు లెక్కలేనన్ని ఉన్నాయి. ఇవన్నీ ఎందుకో అందుకు పారిశ్రామికంగా పనికొచ్చేవే.

హైడ్రోజన్, కార్బన్ అణువుల కలయికవల్ల హైడ్రోకార్బన్ కణాలు (మాలెక్యూల్స్) ఏర్పడి, ఈ కణాల సంయోగంవల్ల నూనె ఏర్పడుతుంది.



ముడినూనెలోని బొగ్గుపదార్థాన్ని తొలగించే యంత్రం. విశాఖ యంత్రాగారంలోని మరో అంతర్భాగం.

పోనీ ఈ నూనె అయినా శుభ్రంగా ఉంటుందేమో అంటే అదీలేదు. హైడ్రోకార్బన్ కణాలతో పాటు అమ్లజని, సహజ వాయువులు, హైడ్రోజన్ సల్ఫయిడ్, నీరు, ఉప్పు, నత్రజని, సల్ఫర్ మొదలైనవి కలిసి ఉంటాయి. శుద్ధి చెయ్యాలంటే ఈ అనవసర పదార్థాలను ముందు తొలగించాలి. ఈ పని సాధారణంగా నూనె బావిదగ్గరే జరుగుతుంది. సహజ వాయువులను ముందు తొలగిస్తారు. ఎలక్ట్రిక్ డీహైడ్రేటర్లు (నిర్జలీకరణ యంత్రాలు) నీళ్లను పీల్చేస్తాయి. ఉప్పును కడిగేసి ఆవిరి చేస్తారు.

తరవాత ముడినూనెను శుద్ధికర్మాగారానికి పంపిస్తారు. అక్కడ రసాయన శాస్త్రజ్ఞులు, సాంకేతిక నిపుణులు ఉంటారు. వీరు ఏ నూనెలో ఏయే కణాలు కలిసిఉన్నాయో ముందు తెల్చుకుని వాటిని శుద్ధిచేయడమెలాగని ఆలోచిస్తారు.

ముందు నూనెను "క్రూడ్‌స్టిల్" (వడబోత) అనబడే భాగంలోకి పంపిస్తారు. అక్కడ కణ మిశ్రమాన్ని ఛేదిస్తారు. ముడినూనెను బ్రహ్మాండమైన కొలిమిలోంచి పంప్‌చేసి, ఒక పెద్ద వడబోత గొట్టంలోకి పంపిస్తారు. వేరువేరు రకాల కణాలకి వేరువేరు బరువులు, బాయిలింగ్ పాయింట్లు ఉంటాయి. అధికమైన వేడిమి, ఒత్తిడివలన నూనెలోని వేరు వేరు మిశ్రమాలు విడిపోతాయి. తేలిక మిశ్రమాలు ముందు వాయువుగామారి వడబోత గొట్టానికి పై భాగాన చేరతాయి. ఆ వాయువును అక్కణ్ణించి పంపులద్వారా తీసుకుపోయి మళ్ళీ ద్రవ పదార్థంగా మారుస్తారు.

కొంచెం బరువైన హైడ్రోకార్బన్లు గొట్టంలో కొంచెం దిగువ భాగాన విడిపోతాయి. బాగా బరువైన హైడ్రోకార్బన్లు వాయువుగా మారడానికి వీలుగాక గొట్టం అడుగునే తారుగా (ఆస్ఫాల్ట్) మారి అది పంపులద్వారా అవతలికి పోతుంది.

గొట్టంపైనించి కిందిదాకా వడబోతపోస్తే ఈ క్రింది పదార్థాలు తయారవుతాయి:- తేలిక, మధ్యరకం, బరువురకం గాసొలిన్లు, కిరసనాయిలు, డీసెల్ నూనె, గ్యాస్ నూనె, ల్యూబ్రికేటింగ్ నూనె, ఇంధనతైలం, తారు.


ఇదైన తరువాత, శుద్ధి కార్యక్రమం ఇంకా జరగవలసి ఉంది. ఈ పనిచేసే భాగాన్ని 'కెటాలిటిక్ క్రాకర్' అంటారు. ఇందాక చెప్పిన 'క్రూడ్‌స్టిల్' యంత్రం హైడ్రోకార్బన్ కణాలను ఇతర కణాల నుంచి వేరుచేసే యంత్రం. కెటాలిటిక్ క్రాకర్ అనేది పెద్ద కణాలను చిన్న కణాలుగా బద్దలుగొట్టే యంత్రం. ఈ యంత్రంలోకి ఇందాక తయారైన గ్యాస్ నూనెను పంపిస్తారు. ఈ నూనె మార్పులుచెంది విమానాలకు పనికొచ్చే గాసొలిన్‌గా, ఇతర రకాల గాసొలిన్‌గా తయారై వస్తుంది. 'క్రూడ్ స్టిల్' లో తయారయ్యే గాసొలిన్ కంటే ఈ 'క్రాకర్' లో 5 రెట్లు ఎక్కువగా గాసొలిన్ తయారవుతుంది.

కర్మాగారంలో 'కెటాలిటిక్ రిఫార్మర్' అనే మరొక భాగం ఉంటుంది. ఇదికూడా కణాలను బద్దలుకొట్టి తిరిగి మేలు రకం చిన్న కణాలుగా మిశ్రమం చేస్తుంది. ఈ యంత్రంలోకి నాఫ్తా అనే పదార్థం పంపిస్తారు. ఈ నాఫ్తాలోంచి మేలురకం గాసొలిన్ తయారవుతుంది.

ఇలాగ హైడ్రోకార్బన్ కణాలను బద్దలుచేసి తిరిగి మిశ్రమం చేయడంలో విమానాల గాసొలిన్, టొల్యూన్, జైలీన్, బుటేన్, ఇంకా ఎన్నో రకాల పెట్రోకెమికల్ పదార్థాలు తయారవుతాయి. ఈ పదార్థాల్లో ఏదీ వృథాగాపోదు. ప్లాస్టిక్ పరిశ్రమనుంచి, బట్టల పరిశ్రమదాకా ఎన్నిటిలోకో ఇవన్నీ పనికివస్తాయి.

క్రూడ్‌స్టిల్, కెటాలిటిక్ క్రాకర్, కెటాలిటిక్ రిఫార్మర్ అనే మూడు భాగాల్లోనూ తయారైవచ్చిన పదార్థాలేవీ వెంటనే వాడకానికి తగినవిగా ఉండవు. ప్రతిభాగానికి అనుకుని ఇంకా శుద్ధిచేసే యంత్రాలుంటాయి. ఉదాహరణకి అల్కిలేషన్ యంత్రం, థర్మల్ క్రాకర్, సల్ఫర్ డయాక్సయిడ్ యంత్రం, ల్యూబ్ నూనె యంత్రం, మైనంయంత్రం మొదలైనవి.

ఇన్ని యంత్రాల్లోకి పోయి, ఇన్ని మార్పులు పొందిన తరవాత మొదట్లో చూసిన ముడినూనెకీ, తయారైన పదార్థాలకీ పోలికే ఉండదు. నిత్య జీవితంలో ఎన్ని సందర్భాల్లోనో వీటి అవసరం వస్తుంది. కొవ్వొత్తుల దగ్గర్నించి, మోటారుకార్లు, విమానాల దాకా ఎన్నిటికో ఆధారమైన ముడిపదార్థం పెట్రోలియమే. ★



కొన్ని రసాయనిక పదార్థాల స్పర్శఫలితంగా ముడిచమురు త్వరితగతిని పరిశుభ్రమవుతుంది. వీటినే కెటాలిటిక్ ఏజెంట్లంటారు. ఇది విశాఖపట్టణం యంత్రాగారంలోని కెటాలిటిక్ క్రాకింగ్ యూనిట్ విభాగం.

★ యంత్రాగార నిర్వాహకవర్గం ★



ఆర్. ఆర్. టిల్లోట్సన్
కాల్టెక్స్ ఆయిల్ రిఫైనింగ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్.



జె. ఆర్. ప్రైస్
రిఫైనింగ్ కంపెనీ డైరక్టర్; కాల్టెక్స్ (ఇండియా) మేనేజింగ్ డైరక్టర్.



హెచ్. ఆర్. టిట్స్వర్త్
యంత్రాగారం అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్ శాఖ)



డి. ఎం. బెర్రిక్
రిఫైనరీ మేనేజర్.




ఎఫ్. డబ్ల్యు. పోర్టర్
యంత్రాగార నిర్మాణశాఖ మేనేజర్.



ఆర్. సి. స్క్వయిర్స్
శ్రామిక సంబంధాల మేనేజర్.



పి. బి. థాంప్సన్
మేనేజింగ్ డైరక్టర్ సహాయోద్యోగి



ఆర్. డేవిస్
(అసిస్టెంట్ మేనేజర్ (ఇంజనీరింగ్ శాఖ)



ఇ. ఆర్. కుక్
యంత్రాగార నిర్వహణశాఖ సూపరింటెంటు

పెళ్ళిసంగీతం

మధిర భానుమూర్తి

ఈమధ్యన మా సుబ్బారావుని కలుసుకుని చాలా రోజులే అయింది. సరిగ్గా చెప్పాలంటే వాడి పెళ్ళయాక మళ్ళా కలుసుకోలేదనే చెప్పాలి. పెళ్ళి పీటలమీదనుంచి లేవకుండానే వాడికి ఉద్యోగం రావటం, అదంతా ఆ పెళ్ళికూతురు అదృష్టమేనని, ఆమె ఆ ఇంట్లో అడుగుపెట్టిన వేళా విశేషమేనని అందరూ కొనియాడటం, తత్ఫలితంగా ఆ నూతన వధూవరులు తిన్నగా ఉద్యోగపు ఊరుకి వెళ్ళటం జరిగాయి. అందుచేతనే నేను ఆనాటినుంచి ఈ నాటి వరకూ మళ్ళా చూడలేదు మా సుబ్బారావుని...

ఇన్నాళ్ళకి చూడటం తటస్థపడేసరికి నాకు ఎంతో సంతోషమయింది. చాలా ఉత్సాహంగా నేను వాడి దగ్గరకివెళ్ళి. "ఏరోయ్! చాలరోజులకి వచ్చావ్! ఎప్పుడు రావటం?- ఏమిటి కథ?..." అంటూ అడిగాను.

"ఇప్పుడే వచ్చాను" అన్నాడు వాడు.

కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాము. మేము ఇంత ఆప్యాయంగా మాట్లాడుకుని చాలా రోజులు కావటంవల్ల చాలాసేపు మాట్లాడాం. ఆ మాటలమధ్యలో నేను వాడి వైవాహిక జీవితాన్ని గురించి అడగటం అవసరమని తోచింది.

"ఏరా - అబ్బీ! ఏమిటికథ? మీసంసారం బాగా ఉందా?..." అని అడిగాను.

"బాగానే ఉంది!..."అన్నాడు ముభావంగా.

వాడు అల్లా అనేసరికి నాకు అనుమానం వేసింది. ఇటువంటి విషయాలువస్తే వాడు చాలా ఉత్సాహంగా మాట్లాడుతాడు గాని ఇంత ముభావంగా ఎప్పుడూ మాట్లాడడు. అందువల్ల నాకు అనుమానం ఎక్కువయింది. ఏదో దీనికి తగినంత కారణం ఉండిఉండాలి. అదేమిటో అడగటం ఎలాగో నాకు బోధపడలేదు...అలాగని ఆ విషయం వదిలెయ్యటానికి అసలే మనస్కరించటం లేదు.

"ఏం? అలాగన్నావ్?..." అన్నాను.

"అబ్బే! ఏమీ లేదు!..." అన్నాడు. కాని వాడేదో అసంతృప్తిగా ఉన్నాడని మాత్రం నా కర్థమయింది అది చెప్పటం యిష్టంలేక బహుశా అలాగ అంటున్నాడనిపించింది.

ఏదోతెలియనిబాధ

"నువ్వేదో దాస్తున్నావ్!...సరిగ్గా చెప్పటంలేదు..." అన్నాను. "వాడి అసంతృప్తికి కారణమేమయి ఉంటుందా." అని ఎంత ఆలోచించినా కారణం మాత్రం కనిపించటంలేదు...వాడి భార్య అతిలోక సౌందర్యవతి కాకపోతే కాకపోవచ్చును గాని, అందగత్తె కాదనలేరెవరూను...పైగా వాడు ముందు చూసుకునే పెళ్ళి చేసుకున్నాడాయె!...పోనీ పెట్టుపోతల్లో ఏమైనా లోపం జరిగి ఉంటుందా—అంటే అదీ ఉన్నట్టు తోచదు. వాడి మామగారు పెళ్ళి చాలా వైభవంగాచేశారు...అదీకాక పిల్లని వాడితో పంపే రోజున ఆయన ఇచ్చిన సామాన్లు వగైరాలన్నీ మనవాడు అంతదూరం మోసుకు వెళ్లలేక కొన్నింటిని అక్కడే దిగవిడిచిన వైనం నాకు బాగా గుర్తుంది. అందుచేత ఆ విషయమై అసంతృప్తి ఉండటానికి అసలు అవకాశమే లేదు!...నా బుర్ర ఎంత శ్రమపడ్డా ఇదమిత్థమని ఒక జవాబు మాత్రం దొరకలేదు.

"నేను ఆవాళ పిల్లని చూచేందుకు వెళ్ళినప్పుడు నాతోకూడా నువ్వూ వచ్చావుగా?..." అని అడిగాడు సుబ్బారావు.

నా గుండె గతుక్కుమంది అవును! ఆవాళ నేనుకూడా వెళ్ళినమాట నిజమే!...అయితే అప్పుడు ఆ పిల్లకి ఏవంకా ఉన్నట్టు కనిపించలేదు. ఆ మాట సుబ్బారావుకూడా ఒప్పుకున్నాడు. అంతేకాదు, ఆ పిల్ల నేతిప్ప చేసుకోవని మొరాయించాడు కూడాను... మరి అటువంటిది ఇవాళ ఆమెలో ఏంలోటు వాడికి కనిపించిందో నాకు అనూహ్యము. ఇప్పుడు—ఆ లోటు నేను ఆనాడే ఎత్తి చూపించలేదని నా మీద మండిపడతాడు. కాబోలునని ఎంతో భయపడ్డాను. కాని ఏమైనా తప్పదుగా!

అందుకని "ఆఁ!...వచ్చాను!..." అన్నాను.

"అయితే ఆవాళ హార్మోనియంవాయిస్తూ పాట ఎలా పాడింది?..." అని మరోక ప్రశ్న వేశాడు.

ఇంతకీ వాడు నన్ను అడగదల్చుకున్న విషయమేదో నాకు స్పష్టంగా తెలియలేదు. కాని వాడు అడిగిన ప్రశ్నలకి జవాబులు మాత్రం సరిగా చెప్పి తీరాలనే నిశ్చయాని కొచ్చేశాను.

"పాటకేం?...అద్భుతంగా పాడింది!" అన్నాను.

"అదుగో! అలా అనే నా గొంతు కోశావ్!..." అన్నాడు.

పాచితెంపకాయ కొడదామన్నంత కోపం వచ్చింది. నేను వాడి గొంతు కొయ్యటము ఏమిటి—కాకపోతేను!... నేను బాగుందన్నానని నాకు పడి ఏడవట మెందుకు?...వాడి చెవులేమయాయి? వాడు వినలేదా?...మరి ఆవాళ ఎందుకు అంతగా పొగిడాడు — ఆ పాటని?... ఇవాళ ఇదేమిటి?—ఇవన్నీ అడిగెయ్యాలనిపించింది. కాని వాడి అసలు బాధ ఏమిటో తెలియనిదే తొందరపడటం ధర్మం కాదని నిభాయించుకుని.

"మరి నువ్వూ విన్నావుగా!...అప్పుడు బాగుందనే అన్నటున్నావ్..." అని అడిగాను.

"ఆఁ!...అన్నాను...విన్నంతవరకూ బాగానే ఉంది!" అని నీరసంగా అన్నాడు.

"ఇప్పుడేమయింది?..."అన్నాను.

"ఏమన్నా అయింది—ఇంకా ఏం కావాలి? ఆవేళ విన్నదాన్ని బట్టి హార్మోనియం వాయిస్తుంది. గొప్ప పాట పాడుతుంది— అనుకున్నాను ... ఇప్పుడు కాదని తెలిసింది...ఇప్పుడేమనుకుని ఏం లాభం?-ఇంతకీ ఇదంతా నీ చలవ!..." అన్నాడు.

నిజం చెప్పొద్దూ! దీనికంతకీ నేనే కారకుడినన్నట్టు వాడు మళ్ళా అనేసరికి నాకు విర్రికోపం వచ్చింది.

"అదేమిటి?—పదే పదే నన్నంటా వెందుకు?...అప్పుడు పాటవిన్నది నువ్వు-

చూసుకున్నది నువ్వు—పెళ్ళాడినది నువ్వు—" అన్నాను విసురుగా.

"ఆఁ! – చూశావా!–ఎంత కోపం వచ్చిందో?... అయితే విను!... నువ్వు ఆ రోజున నా తరఫున పెద్దగా వచ్చావు–జ్ఞాపకముందా?..."అని అడిగాడు.

"ఓ!... మీ నాన్నగారు నిన్నొక్కణ్ణీ పంపటం బాగుండదని మరీ మరీ చెప్తే వచ్చాను..." అన్నాను.

"అవున్లేవోయ్! అందుకు కాదు!... నువ్వు ఆహ్వాదాలో ఉండి ఆవాళ ఏం చేశావ్?—పెళ్ళికూతురు పాట ప్రారంభించిందే తడవుగా చాల్లే అమ్మా! అనలేదూ?"

"అన్నాను!..."

"అదే! ఇప్పుడింత కొంప తీసింది..."

"ఏం?..."

"ఆవిడగారికి వచ్చినదల్లా ఆ ఒక్క పాటేనట! అది మనకేం తెలుసును?... నువ్వు ఆపమనే సరికి 'బ్రతుకు జీవుడా' అనుకుని వెంటనే ఆపేసిందట!..."

"ఇది ఇంకా బాగుంది! ఆపమనకపోతే అరగంట పాడమంటామా? ... మర్యాదగా ఉండొద్దూ!..."

"ఆ మర్యాదే ఇంతవరకూ తెచ్చింది!" ఏమిటోయ్ ఇప్పుడు నీకొచ్చిన ఇబ్బంది?...అంత అలాగయితే పోనీ నువ్వే అడక్క పోయావ్?– ఇంకో ఫది పాటలు పాడమని?" అప్పుడు మూగనోము పట్టావేం..." అని అడిగేశాను.

"మరి నువ్వు ఉన్నావుగా–నీ మర్యాద నిలబెడదామని! పైగా అవోకలాగ అనిపించింది!..."అన్నాడు.

"అందుకే అనుభవించు!...కనీసం నాతో ముందుగానైనా చెప్పలేదు—సంగీతంబాగా పరీక్ష చెయ్యమని!..."

"నాకు సంగీతం అంటే ఇష్టమని నీకు తెలుసును గదా–నేను చెప్పాలా?—అనుకున్నాను..." అన్నాడు.

"ఇది ఇంకా బాగుంది! నీకు సంగీతం అంటే ఇష్టమని తెలుసునుగాని గొప్ప గాయనీ మణి భార్య కావాలని కలలు గంటున్నావని నాకేం తెలుసు?...తెలిస్తే అప్పుడే చెప్పిఉండేవాడిని–ఇవన్నీ పెళ్ళి సంగీతాలు–వీటిని నమ్మవద్దని!...అయినా, అనుకుంటాంగాని, ఎంత గొప్ప సంగీత విద్వాంసురాలు అయితేమాత్రం అనుక్షణం ఆమె కచేరీలు వింటూ కూచుంటామా!–ఆడదన్నాక ఇంటిపనులు అవ్వీ చూసుకోవటం ప్రధానంగాని!...అది ఉన్న తర్వాత ఇంకా ఏకళైనా తెలిస్తే మంచిదేననుకో!..." అని నసిగాను.

కాని వాడికిమాత్రం నచ్చలేదు. వాడికి ఈ అన్యాయం చేసినది నేనేనని అభిప్రాయం దృఢంగా ఉండిపోయింది.

పెళ్ళికూతురు పరీక్ష

అయినా నేనేంచెయ్యగలను–చెప్పండి! ఈ పెళ్ళిచూపులనే వ్యవస్థలోనే అన్నీ అలా తయారయాయి. ఇదంతా అనాదినుంచీ వస్తున్నదే!...పెళ్ళిచూపుల్లో మొగపెళ్ళివారు పెళ్ళికూతురుకి ఇవ్వబోయే ప్రశ్నాపత్రం ఇదివరకే బయటపడిపోయింది. ఆడపెళ్ళివారు చెయ్యవలసినదల్లా ఆ పిల్లకి ఆయా ప్రశ్నల జవాబులుచెప్పి క్షుణ్ణంగా వచ్చేవరకూ భట్టీయం వేయించటంమాత్రమే! అలా నూరిపోసిన జవాబులు తనవిగాచేసుకుని ఎంత చక్కగా, తడుముకోకుండా చెప్పగలిగితే అంత త్వరగా పరీక్షలో నెగ్గుతున్నారు పెళ్ళికూతుళ్ళు.

అవునా! అలాంటప్పుడు తప్పనిసరిగా పరీక్షలో వచ్చేప్రశ్న అయినటువంటి "ఏదేనా పాట పాడగలవ్?–ఏదీ–ఒక్కటి పాడు!..." అనే ప్రశ్న ఉందే!–దానికి సిద్ధపడని కన్యాదాత కల్లోనైనాదొరుకుతాడంటారా?..దొరకడు అని ఘంటాపథంగా చెప్పచ్చు... అందుచేతనే సంగీతంలో శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం...ఇత్యాది విభాగాల్లోకి "పెళ్ళి సంగీతం" అనే నూతన విభాగం వచ్చి చేరింది.

ఆలాగ ఒక ప్రత్యేకశాఖగా అది ఒక స్వతంత్ర ప్రతిపత్తి సంపాదించుకోగలిగిందంటే నిజంగా దానికి ప్రత్యేకత ఏదో ఉండితీరాలి! అది పరిశీలిద్దాం!...

దాని లక్ష్యం ఒక కన్యను ధర్మపత్నిగా మార్చటమే గనక, ఆ లక్ష్యాన్ని సాధించిన వెంటనే దాని పని పూర్తయినట్టే గనక ఆ జీవితంనుంచి పూర్తిగా నిష్క్రమిస్తుంది. కనక పెళ్ళిచూపులనాడే పెళ్ళికొడుకులు తమకితృప్తికలిగేవరకూ పెళ్ళికూతుళ్ళచేత పాటలు పాడించుకోవాలిగాని అప్పుడు మొగమాటపడితే తరువాత యావజ్జీవితం బాధపడవలసివచ్చితీరుతుంది.

ఇది ఇలాంటి స్వల్పకాలిక ప్రయోజనం కలిగినది కావటంచేతనే ఈ రకం సంగీతం నేర్పేందుకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు కూడా తయారయారు. ఆడపిల్లని కన్న ప్రతి తండ్రి ఆ పిల్లకి అంతో ఇంతో సంగీతం చెప్పించక తప్పదు గనక ఎవరో ఒక సంగీతం మేష్టారిని (అందరిలోకీ బాగా తక్కువ జీతం పుచ్చుకునే ఆయన్ని) కుదిర్చి సంగీతం చెప్పిస్తాడు. ఆ మేష్టారు ఏదో చిన్న పరీక్ష ప్యాసయి కొన్ని స్వరజతులు, కొన్ని వర్ణాలు పాడుతూ వాయించగల సామర్థ్యం సంపాదించుకుని ఉంటారు. వారిలో కృతులు ఒకటి రెండు వాయించను, పాడను చేతనైన వ్యక్తి ఉంటే ఘనుడే!... ఇలాగ చవకగా అందరికీ అందుబాటులో ఉండే స్థితికి కళలని తీసుకుని రావటానికి బద్ధకంకణుడైన ఆ మేష్టారి ముందు కేవలం అమ్మ, నాన్న, అమ్మమ్మ, తాతయ్య, మామ్మ...మొదలైన పెద్దల సంతృప్తికోసమని—(తనకు ఏమాత్రం ఇష్టంలేకపోయినా సరే!)–సంగీత విద్యాభ్యాసానికి కూచుంటుంది–కాబోయే పెళ్ళికూతురు...

రాగాలు-గారాలు

ఏ రోజుకారోజే "అబ్బ! నాకొద్దే;" అంటూ గారాలు గునిసే అమ్మాయి, "ఆ మూడు ముక్కలూ వచ్చేవరకేనా కాస్త 'ఝంయ్' 'ఝంయ్' మనిపించవే? తరవాత మేం చెప్పించేదీలేదు, నువ్వు చెప్పుకునేదీ లేదు." అనే తల్లి, "మేష్టారూ! మాంఛి పాట ఒక్కటి బాగా సాధకం చేయించండి! చాలు!..." అని తన ఆదుర్దాని అన్ని వేళలా ఆ మేష్టరుముందు వ్యక్తపరచే తండ్రి, "మా మనుమరాలు ఎంత బాగా పాడుతోందనుకున్నారు?..." అంటూ పొరుగింటి పుల్లమ్మతో ఉత్సాహంగా చెప్పే నాయనమ్మ, "ఆఁ!...మేం రోజూ వింటున్నాంగా!..." అని వెటకారంగా అనే పొరుగింటావిడ,...ఇన్ని హంగులతో కూడిన ఆ సంగీత సాధన తనివితీరా వినాలి, చూడాలి, ఆనందించాలిగాని వర్ణించటం అసాధ్యం.

ఈ సాధకం చేసేటప్పుడు తన శ్రుతికే

(48 వ పేజీ చూడండి)

వనితా లోకం

"ఏంరా రామం! పరీక్షపేపర్లు ఎలా వ్రాసేవు?" అని అడిగాడు మా మామయ్య వాళ్లబ్బాయిని. "బాగానే వ్రాశాను నాన్నా! అన్నిట్లోను ప్యాసు మార్కులు వస్తాయి. కాని ఒక్క ఇంగ్లీషు, లెక్కలలోనే తక్కువ వస్తాయేమో" అన్నాడు రామం.

"ఫరవాలేదులే ఆ రెండింటిలో నేకదూ నీకు సందేహం. ఆ పేపర్లు మన నరసింహారావు మాష్టారిదగ్గరకే వచ్చేయిట. నేను వెళ్ళి మాట్లాడుతాలే" అన్నాడు మామయ్య.

ఆ సమయంలో అక్కడేవున్న నాకు వాళ్లమాటలు ఆశ్చర్యాన్ని కల్గించేయి. పిల్లడు పరీక్షపేపర్లు పాడుచేస్తే చివాట్లువెయ్యడానికి బదులు "నీకేం ఫరవాలేదులే" అని ధైర్య మిస్తున్నాడు మామయ్య. మామయ్యలాంటి మనుష్యులు ఎంతమందో యీ ప్రపంచంలో అని సందేహం కల్గింది. ఆ అబ్బాయేమో చదివేది మళ్ళీ ఫిఫ్తుఫారం. అసలు స్వయంకృషి వల్ల ప్యాసయింది ఒక్కటేకూడా లేదు. ప్రతియేడు ఏదో సబ్జెక్టులో వుండిపోవడం మామయ్య హెడ్ మాష్టారితోటి మిగిలిన టీచర్సుతో మాట్లాడి అవసరమయితే పదులు, పాతికలు ఖర్చుపెట్టి పైక్లాసుకి త్రోయించడం. చదివినవాళ్ళు పాసవుతున్నారు, చదవకుండానే మేము పాసవుతున్నాము. ఇదే బాగుందనుకొని పరీక్షనాడుకూడా పదిగంటల దాకా ముసుగుపెటి నిద్రపోవడం అలవాటయింది ఆ అబ్బాయికి.

తగని వైఖరి :

పిల్లలూ, ★ ★ చదువులూ ★

వి. సత్యవతీదేవి

పడరానిపాట్లు

ఒక్క మామయ్యేకాదు. నూటికి సగంమంది తమ పిల్లల్ని పరీక్షలో ఉత్తీర్ణులను చేయించేందుకు పడరానిపాట్లు పడుతూవుంటారు. తమపిల్లలు పరీక్షలో పాసుకావాలని వున్నవాళ్ళు మొదటినుంచి వాళ్ళచదువు విషయంలో శ్రద్ధతీసుకుంటే తరువాత నలుగురు టీచర్ల వెనకాల తిరగవలసిన అవసరం ఎందు కుంటుంది? స్కూల్లో పిల్లల్ని జాయిన్ చేసింది మొదలు మళ్ళీ ఏన్యువల్ పరీక్షలో వాళ్ళు పేపర్లు బాగా వ్రాయలేదని అనేవరకు ఈ ఏడాది పొడుగునా పిల్లలు ఏవేళప్పుడు చదువుతున్నారో, ఏమిటి చదువుతున్నారో కూడా వాళ్ళకు అవసరం వుండదు.

ఇంక పరీక్షలో తక్కువమార్కులు వస్తాయని తెలిసినప్పుడుమాత్రం ఏ టీచరుదగ్గరకు ఏ పేపర్లొచ్చాయో తెలుసుకొని సంభావనలతో కూడా వాళ్ళని దర్శించి మార్కులు వేయించడానికి చేసేప్రయత్నాలలోమాత్రం మిక్కిలి శ్రద్ధ చూపిస్తారు. చాలామంది అది గొప్పగా భావిస్తారు. తమ పలుకుబడికి అది కొండా అన్నమాట.

ఇక యీ పిల్లల ప్రవర్తనచూస్తే మరీ అధ్వాన్నం. క్లాసులో టీచర్లు కంఠశోష పడి ఎంత అరచిచెప్పినా వీళ్ళబుర్రకి ఎక్కదు. ఏనాడేనా ఇంటిదగ్గర చదివిన పాపాన పోతేకదూ అర్థమవడానికి. హైస్కూలు క్లాసులో అయితే టీచర్లు ఒకమాటుకి మరోమాటు చెప్పిఅవసరమయితే అర్థమయిందాకా కూడా చెప్పి అందరి మంచిచెడ్డలు చూస్తారు. కానీ కాలేజీల్లో లెక్చరర్సుకి ఆ బాధ్యత వుండదు. ఎవరెలా పోయినా తమవంతు తాము చేసుకుపోవడమే వాళ్ళపని. అటువంటప్పుడు క్లాసులోలాస్టు బెంచీమీద కూర్చొని ఎవరేమేగ్గను చదువుతున్నా ఏ అల్లరిచేసినా చూసేదాతా దైవముండడు. అంతా వాళ్ళయిష్టమే.

భావిపౌరులా?

ఇంక తండ్రి ప్రమేయం లేకుండా ప్యాసయే విద్యార్థులు నేటివాళ్ళలో సగంమంది. టీచర్లు వీళ్ళతో బాధపడలేక నోట్సులు డిక్టేటు చేస్తూవుంటే అవికంఠతాపెట్టి పరీక్ష అయిందనిపిస్తారు. ఇంక పరీక్షలయిపోయిన

(౭౦-వ పేజీ చూడండి)

వనితలకు వినతి


ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక 'వనితాలోకం' విభాగానికి రచనలు, డిజైనులు పంపేవారు ఈ క్రింది సూచనలను గమనించి, పాటించ కోరుతున్నాము:

కాగితానికి ఒకవైపునే వ్రాయాలి. ప్రతివ్యాసానికి చివర రచయిత్రి పూర్తిపేరు, చిరునామా విధిగా వుండాలి. చిరునామాను విడిగా చిన్నకాగితంపై వ్రాసి అతికించవద్దని మనవి.

రచనలు, ఉపయోగించని పక్షంలో త్రిప్పిపంపగోరేవారు ఎనిమిది నయాపైసలకు తక్కువకాకుండా తపాలాబిళ్లను అతికించిపంపాలి. రచనలు పంపినవెంటనే, వాటిగురించి అడుగుతూ పదేపదే ఉత్తరాలు వ్రాయవద్దని మనవి.

డిజైనులు ఇండియన్ ఇంకుతో, పదునుగా వ్రాసిపంపాలి.

ప్రతి రచనపైనా ఆంధ్ర వారపత్రిక వనితాలోకం శీర్షికకు అని స్పష్టంగా వ్రాయాలి. చిరునామా: 6 & 7 తంబుచెట్టివీధి, జార్జిటౌన్ మద్రాసు అని వ్రాయాలి.



కర్టెన్‌ల మీదకు క్రాస్‌స్టిచ్ డిజైను— బి. రమాదేవి (మార్కాపురం)

గృహవైద్యం:

శిరోజముల సంరక్షణ

"ఆడవాళ్ల తలకట్టును గురించి వ్రాయాలంటే ఒక పెద్దపుస్తకము అవుతుంది" అని అంటాడు చిన్నమామయ్య. మామయ్య చెప్పినదాంట్లో అతిశయోక్తి యేమీ లేదని ఒప్పుకోకతప్పదు. చిన్నప్పుడు మా రుక్మిణి అత్తయ్య చెప్పిన కథల్లో తలవెంట్రుకను చూసి, చిత్రంగీసిన మంత్రికుమారుడు కథ నాకు యిప్పటికీ గుర్తు. రాక్షసుల తల వెంట్రుక ఒక్కొక్కటి తాటిచెట్టంత పొడుగు ఉంటుందని మా అమ్మమ్మ సవాలక్షసార్లు నొక్కి వక్కాణించింది! కవులు కూడా స్త్రీల శిరోజములుగురించి అనేక రకాలుగా వర్ణించారు. "కోదమ తుమ్మెద రెక్కలని, పడగవిప్పిన నాగుపాము అని" యింకా...నా కన్నీ రావు మరి.

తలకు నూనె రాయటము

ఇప్పటి ఫ్యాషను ప్రకారం - నూనె పైపైన రాసుకోవటము. అదరాబాదరా దువ్వి- అయిదు నిమిషాలలో రెండు అల్లులు అల్లుకోవటము మామూలు. మనమొక మొక్కను నాటాము అనుకోండి. ఆ మొక్కకు తగినంత నీరు కుదుట్లో పోస్తేనే అది వృద్ధిపొంది-ఫలించేది. లేకపోతే అది యెండి యెండి చచ్చిపోతుంది. మొక్క యెలాంటిదో, మన తలకట్టుకూడా అంతే! నూనె పైపైన రాయకుండా, వాటి కుదుళ్లకి పట్టించాలి. కనీసము నూనె పావుగంటసేపన్నా రాయాలి. అలా రాస్తేగాని వెంట్రుకలు వాటిస్థానాన్ని అవి బలపరుచుకోలేవు. పూర్వము స్త్రీలు కనీసము అర్ధగంటసేపన్నా నూనె రాసేవారట. అందుకనే మన అమ్మమ్మ-నాయనమ్మల తలలు యెనభైఏళ్లు వచ్చినా ముగ్గుబుట్టలు కాకపోవటము."

మరి యిప్పుడో! పాతికేళ్ళు నిండకుండానే తల నెరుస్తుంది. ఆడవారికిగాని మగవారికిగాని తలకట్టే అందం. ఆ అందం వారుతీసుకునే శ్రద్ధపైనే ఆధారపడి ఉంటుంది.

వెంట్రుకల కుదుళ్ళు బలపడాలంటే వాటికి తగినంతనూనె పుర్రెకి (ముఖ్యంగా తాలువకు) యిగిరిపోయేటట్టు మర్దించాలి. ఈ విషయం అందరు. (అంటే స్త్రీ పురుషులు అందరు) గుర్తించాలి.

శిరోజాల గుణగణాలు

శిరోజాలు నెలకి అర అంగుళము పెరుగుతాయి. వీటికి సాగే గుణము కూడా వున్నది. సాగతీస్తే ఒకటింట ఆరువంతులు వరకు సాగుతయ్యి. ఇవి శీతాకాలములో కంటె, వేసవి కాలంలో యెక్కువ చురుకుగా పెరుగుతై. ఎందుకనంటే వేసవి కాలములో రక్తం తన్నుతాను చల్లబలచుకోటానికి చర్మం దగ్గరగా వస్తుంది. అలా రావటము మూలాన, కుదుళ్ళకు పుష్కలంగా రక్తం అంది, అవి పెరగటానికి దోహదం జరుగుతుంది. వంట్లో రక్తము బాగావున్నప్పుడే గదా శిరోజాలు పెరిగేది. స్త్రీలు ప్రసవించినప్పుడుగాని, పెద్ద పెద్ద జబ్బులు పడ్డప్పుడుగాని జుట్టు రాలిపోతుంది—రక్తము అంతా పలమాలం అవటం మూలాన కుదుళ్ళకు కావలసిన రక్తము అందక వెంట్రుకలు రాలిపోతాయి. మళ్ళా ఆ మనిషికి ఒంట్లో రక్తము

నందూరు రాజ్యలక్ష్మి

పట్టేసరికి తిరిగి మొలవటం మొదలెట్టుతాయి. ఇవి, వీటిసహజగుణాలు. జుట్టురాలిపోవటము పెద్దజబ్బుగా యెంచి డాక్టర్లకు ఫీజు చెల్లించనక్కరలేదు. జుట్టు రాలిపోతున్నందుకు గాబరాపడకుండా సంతోషించండి. యెందుకంటే అవి రాలగానే కొత్తవి చురుకుగా దట్టముగా మొలకెత్తుతవి.

బట్టతల

ఒక్కొక్కమాటు వెంట్రుకలకు బలము లేక మధ్యలోనే రాలిపోయి అక్కడ బట్టతల ఏర్పడుతుంది. ఇది తలమీద కొద్దిభాగములోగాని అంతటాగాని యేర్పడవచ్చు. దీనిని ప్రారంభంలోనే అరికట్టాలి. బాగా ఆలస్యం అయిన తరువాత యెన్ని మందులు వాడినా లాభములేదు. బట్టతల కాకుండా ఉండాలంటే-వారముకు రెండుసార్లు తలంటుపోసుకోవటము, అప్పుడప్పుడు తలారా చన్నీళ్ళ స్నానము చేయడము, స్నానము అయ్యాక జుట్టు విరబోసి బాగా గాలి చొరబడేట్టు ఆరపెట్టడము ముఖ్య విషయాలు. ఇలా చేసినా బట్టతల యేర్పడితే యింకోపని చేయాలి. అతిమధురము, లక్క-గురివింద ఆకు, నాభి యీ నాలుగు సమంగా తీసుకుని, పులిసిన బియ్యపుకడుగుతో ముద్దగా నూరి దాంట్లో బాగా నానపోసి తైలము కాచి, అది రోజూ తలకు మర్దనచేస్తే తిరిగి వెంట్రుకలు మొలకెత్తడం ప్రారంభమవుతుంది. ఇందులో యేమాత్రము సందేహము లేదు. ఇంకో విధానము ఏమిటంటే యేనుగుదంతాన్ని బూడిదఅయ్యేటట్టు కాల్చి దానిని మేకపాలలో కలిపి వ్రాస్తే కూడా గుణమిస్తుంది.

రంగు వేయటం

వృద్ధాప్యమువచ్చి శిరోజాలు తెల్లపడేసరికి, మళ్ళా అవి తుమ్మెద రెక్కల్లాగా నిగనిగలాడాలని, చాలామంది బజారులో అమ్మే రంగు యెక్కువ డబ్బు పెట్టికొని తెచ్చి వెంట్రుకలకు వేస్తారు. కాని యీ రంగు వేయుటవల్ల ఏమీ ప్రయోజనము లేదనిగ్రహించాలి. ఎందుకంటే బైట ఉండే వెంట్రుకలకే ఆ రంగుఅంటుతుంది మరల మొలకెత్తేవెంట్రుకలన్నీ తెల్లగానేవుంటవి. రోజూ రంగువెయ్యకపోతే లాభము లేదు. లాభము లేకపోగా రంగులో చర్మమునకు చెరుపుచేసే రసాయన పదార్థములు అనేకము లున్నవి. చెడుగుణాలు వెంటనే కనుపించక పోయినప్పటికి తరువాత బైటపడుతవి. వెంట్రుకలు తెల్లపడటం వృద్ధాప్యచిహ్నము. దీనిని అరికట్టడము సామాన్యవిషయము కాదు. "కాని కొంతమందికి 20 ఏళ్లు రాకుండానే తలనెరసి ముగ్గుబుట్టల్లాగా అవుతున్న యిగదా. మరి దీనికి ఏమంటారు"? అని మీరు అడుగవచ్చు. అకాలపు నెరుపుకు రంగుకంటె, సాధనాంతరాలవల్లనే, తగ్గించే ప్రయత్నము చేయాలి. రోజూ చన్నీటిస్నానము, పుర్రెకు పట్టేటట్లు బాగా కొబ్బరినూనె మర్దనచేయటము, వారానికి రెండుసార్లు, గుంటగలగరాకు ఎండపెట్టి, చూర్ణముచేసి దానితో తలంటుకోవటము. ఆకు కూరలు, పుల్లటి

★ కాలీఫ్లవర్‌తో హల్వా ★

క్యాలీఫ్లవర్‌తో వంటలు చేయడం చాలామందికి తెలుసు. దానితో రుచియగు స్వీటు కూడా చేస్తారు. నేను ఒక కొలతలో ఇస్తున్నాను. కాలీఫ్లవర్ తెల్లపూవు విడిగా తొకాలి (సన్నగా తరగాలి). పచ్చకాడ ఏమాత్రం ఉండగూడదు. అలా తరిగిన కాలీఫ్లవర్ కోరు పావు శేరు, అర్ధశేరు చక్కెర, పావుశేరు కమ్మని నెయ్యి, అర్ధపావుశేరు సీమబాదం పలుకులు, 5 తులాలు పిస్తా, ఒక శేరు చిక్కని పాలు సిద్ధపరచుకోవాలి.

పాలు కుంపటిమీద మరుగుచున్నప్పుడు కోసిపెటిన కాలీఫ్లవర్ వేసి బాగా ఉడకనివ్వాలి. ఈ పూవు పాలు మెత్తగా ఉడికి చిక్కపడ్డాక దింపెయ్యాలి. చక్కెర మెత్తగా విసిరి జల్లించి పెట్టుకోవాలి. పలుకులు అన్నీ రెండు చెమ్చాల నెయ్యి వేసి దోరగా వేయించి తీసిపెట్టుకోవాలి. బాణలిలో సగం నెయ్యి పోసి కాలీఫ్లవర్ ముద్ద వేసి దోరగా వేయించాలి. విసిరిన చక్కెర, పలుకులు, మిగిలిన నెయ్యి వేసి గట్టిపడేదాక అడుగు మాడకుండా బాగా కలుపుతూండాలి. హల్వా మాదిరి అయ్యాక దింపి పెట్టుకోవాలి. చాలా రుచిగా ఉండి, చూచుటకు తెల్లగా బావుంటుంది.

మీగడ పూరీలు

పావుశేరు మీగడ, పావుశేరు మైదా, కొద్దిగ వుప్పు, కుంకుమపువ్వు.

పొయ్యిమీద పెడల్పుగా ఉంటే గిన్నె పెట్టాలి. మైదా, మీగడ, ఉప్పు, కుంకుమపువ్వు అన్ని వేసి సన్నసెగమీద వేయించాలి. లేనిచో మాడిపోతుంది. ఇవి అన్ని ముద్దగా అయాక దింపి చల్లార్చాలి. పూరీల మాదిరిగా త్తి చేతిలోనే వేయించాలి. తీపి కావలనుకున్న యెడల వేయించేప్పుడు ఇష్టమున్నంత చక్కెరగూడా వేసుకొనవచ్చు.

యం. రాధాశ్రీధర్,
(హైదరాబాదు).

* * *

ఫలాలు యెక్కువగా తినటము. ఇలాంటి అభ్యాసములవలన చాలావరకు గుణము కనిపించుతుంది. ఇంకోవిధము ఏమిటంటే-ఉసిరిక-కరక-తాడి. యినుముపొడి. నీలిఆకు-యీ అయిదు సమభాగాలు తీసుకుని గుంటగలగర ఆకురసముతో ఇనప అమాందస్తాలో నూరి రోజూ తలకు బాగా మర్దించాలి.

* * *

కాంట్రుకల ఆరోగ్యముకోసం శరీరములో ఇతరభాగాలకులాగా తలపై చర్మానికి కూడా గాలి కావాలి. మొగవారు తరచుగా టోపీలు, తలపాగాలు తలమీద యెక్కువసేపు ఉంచకూడదు. కురుల్లకు పట్టిన చమట ఆరిపోవాలంటే గాలి కావాలి. గాలి తగలకపోతే తలంతా దుర్వాసన వేస్తుంది. రోజుకు 3, 4 సార్లు దువ్వెనతో బాగా దువ్వాలి. మన శరీరారోగ్యము బాగా వుంటేగాని, శిరోజాలు ఎదగటముకు సావకాశము వుండదు. కొందరికి ఆడ-మొగ అనే భేదము లేకుండా తలనిండా పేలుపడతెయ్యి. ఈ బాధని భరించటము చాలాకష్టము. వల్లుమెత్తాకు రసంలో పాదరసం కలిపి పాతగుడ్డకు పట్టించాలి. ఆ గుడ్డను కళ్లకు తగులకుండా తలకి కట్టుకుని 2-3 గంటలుంచాలి. అప్పుడు పేలు చచ్చిపోతై. తర్వాత తలంటు పోసుకోవాలి. కొంతమంది నొక్కుల జుట్టుకోసం పడే అవస్తచూస్తే నవ్వువస్తూంది-జాలీవేస్తుంది. కాని అవి సహజముగా ఉండాలిగాని, సాధనమీద రావటము కష్టము. తలస్నానము చేసిన తరువాత తుండుతో నొక్కులుగా నొక్కుతూ తుడవాలి. అలా తుడవగా వారిశ్రమ చాలావరకు ఫలించవచ్చు. జుట్టు నల్లగా వుండటము-నొక్కులుగా వుండటము స్త్రీ పురుషులు అంతా కోరుతారు. పైన చెప్పిన విషయాలన్నీ పాటిస్తే పేలుపోవటము-శిరోజాలు బాగా ఎదగటము వగైరాలు జరుగుతయి. ఇవన్నీ ఆచరణలో పెట్టటము కష్టమనుకొండి-మరి పెద్దలు "కష్టే ఫలే" అని ఎందుకన్నారంటారు? ★

పిల్లలూ, చదువులు


(36-వ పేజీ తరువాయి)

తరువాత బుర్రకాలి.

ఇటువంటి పిల్లలే భావిపౌరులు. వీరు ఎన్ని డిగ్రీలు సంపాదించి నప్పటికి జ్ఞానం మాత్రం శూన్యం. డాక్టర్లు, లాయర్లుగా తయారయేవాళ్ళసంగతి మరీ అర్థాన్నం. బోలెడంత డబ్బుపోసి నానాశ్రమలుపడి తండ్రికొడుకుని డాక్టరుగాగాని లాయరుగాగాని తయారుచేసి అతనిసంపాదన నెలకి ఎన్ని వేలుంటుందాఅని వేళ్లులెక్కపెడుతూ వుంటే బోర్డుకట్టిన మరునాడే అటునుంచి యిటు తిరగవేస్తారు ప్రాక్టీసు లేక.

అసలు తల్లితండ్రులకుకూడా పిల్లలు పాసవడం ముఖ్యంకాని యేదైనా లోకజ్ఞానం సంపాదిస్తున్నారా లేదా అన్నమాట అవసరంలేదు. పరీక్షలయిపోయిన తరువాత అశోకుడెవరంటేకూడా వాళ్ళకు తెలియదు. రెండుమూడేళ్ళ క్రిందట 'ఆంధ్ర పబ్లిక్ సర్వీసు కమిషను' పరీక్షల్లో మాయాదేవి యెవరని అడుగుతే అశోకునితల్లి అని సమాధానం చెప్పేడుట ఒక ప్రబుద్ధుడు.

అందుచేత బాధ్యతగల తల్లితండ్రులు తమ పిల్లల చదువు విషయంలో మొదటినుంచీ శ్రద్ధతీసుకోవడం ముఖ్యం. తీరికదొరికినప్పుడల్లా వాళ్ళని ఏంచదువుతున్నారో ప్రశ్నిస్తూ టీచర్లని కలుసుకొని తమపిల్లల గురించి కనుక్కుంటూ వుండడం మంచిది. కొందరు



కోటి విద్యలూ కూటికొరకేనా?

30-10-57, తేదీ వారపత్రికలో, నారాయణ పుణ్యవతిగారు కోటి విద్యలూ కూటి కొరకే! అంటూ రాసినవ్యాసం చదివి ఆశ్చర్యపడ్డాను. సంపన్నులంతా యథాశక్తిగా దానధర్మాలు చెయ్యాలంటారు ఆవిడ. కానీ అడిగిన వాళ్ళందరికీ దానధర్మాలు చేస్తూ వుంటే సంపన్నులు సంపన్నులుగా ఎన్నాళ్ళు వుంటారు? కోటివిద్యలూ కేవలం కూటికొరకేనా? కాదు, అనేక అవసరాల నిమిత్తం ధనార్జన చెయ్యవలసివస్తోంది, కష్టపడకుండా సంపాదించాలనుకొనేవాళ్ళకి యాచన అందుబాటులో వున్న ఉన్నత విద్య. "ముష్టివాళ్ళు ఒకరిని ఇమ్మని బలవంతపెట్టరు. దొంగతనం చెయ్యరు. పనిచేసి జీవించటానికా వాళ్ళకు ఏదో అవయవ లోపం వుంటుంది", అంటారు పాపం, పుణ్యవతిగారు. అది నిజంకాదు. కొందరు ముష్టివాళ్లు స్వతహాగా అవయవలోపం లేకపోయినా యాచన నిమిత్తం పరుల సానుభూతికోసం ఏదో అవయవలోపం సృష్టించుకుంటారని పుణ్యవతిగారికి తెలియదు కాబోలు. చెయ్యి ఊరుకోలేదు నాకు అబ్బీ, అంటే చెయ్యి శాపనార్థాలు పెడుతో నెడతారు కొందరు ముష్టివాళ్ళు. తుంబురుణ్ణీ, నారదుణ్ణీ, మించిపోయే ముష్టిగాయకులు మనలను పెట్టే హింస ఇంతా అంతాగాదు. వాళ్ళపాటకు హడలిపోయి, ఓ దయాపైసా యిస్తే కదలరు. వాళ్లకి పాతకానీ కాసీ, బియ్యంకానీ, దర్శించుకోవాలి. దయాపైసా యిచ్చినవాళ్ళు ఏమీ ఇవ్వనివాళ్ళలోనే జమ. అమధ్య ఓ ముష్టివాడు రోడ్డు మీద మూర్ఛవచ్చి దొల్లుతోవున్నాడు. కొందరు పుణ్యాత్ములు, నీళ్ళుపోస్తోన్నారు, డబ్బు వేసేవాళ్ళు వేస్తోన్నారు, మూర్ఛవచ్చిన ముష్టివాడు మెల్లిగా కోలుకొని అడిగాడు: "ఎన్ని డబ్బులు వచ్చాయిరా అబ్బీ" అని, "పది డబ్బులు బాబూ" అన్నాడు కుర్రాడు. "ఐతే సినిమాకి చాలవురా; ఇంకా దొల్లుతా"నన్నాడు మూర్ఛవాడు; వెనుకటికో యాచకుడు అన్నాడట. "ఎప్పుడూ పెట్టనమ్మ పెట్టేతేదు. నిత్యంపెట్టే ముండ కూడా యీవేళ పెట్టలేదు" అని. ఇట్లా వుంటుంది న్యాయం. ఇంక ప్రతినిత్యం సమస్తవేళలలోనూ వచ్చే ఘరానా యాచకుల సరేసరి. రెండో మూడో రూపాయలే తప్ప చిల్లర పుచ్చుకోరు వారు, కాలేజీ జీతం కట్టాలనీ, పుస్తకాలకి తక్కువ వచ్చిందనీ, దేవాలయం కడుతున్నామనీ, వస్తూ వుంటారు. ఓసారి జీతం కట్టటానికి తక్కువైందని బతిమాలితే మా అక్కయ్య ఓ విద్యార్థినికి నాలుగు రూపాయలు దానంచేసింది. సాయంకాలం మేం బట్టలు కొనటానికి బట్టలకొట్టుకి వెళితే ఆ కొట్లోనే ఇరవై రూపాయలుఖరీదుచేసే జార్జెట్ చీరకొంటోంది ఆ విద్యార్థిని. మమ్మల్ని చూసి కంగారుపడింది. యిట్లా వుంటోన్నాయి మన దానాలూ, పుణ్యాలూనూ, అపాత్రదానం ఎప్పుడూ చెయ్యకూడదు; దానం చేసి, దేశంలో సోమరితనాన్ని వృద్ధిచేసిన వాళ్లవుతారు. దానాలు చేసి గుణపాఠాలు నేర్చుకొన్నవారు కొల్లలు. పుణ్యవతిగారు పుణ్యాన్ని గురించి చక్కగా బోధించారు. కానీ, [illegible] ఆరోగ్యవంతో అనుకోవాలంటే? తెలిసిన విషయమే, మద్రాసు ప్రభుత్వం, ముష్టివాళ్ళకు ప్రత్యేకంగా కొన్ని కేంద్రాలు ఏర్పరిచి అక్కడ వాళ్ళకి పనులు నేర్పి జీవనోపాధి చూపుతోంది. ఈ విధంగా యాచకవృత్తిని కొంతవరకు అరికట్టింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా, భిక్షుకగృహాలు నిర్మించాలనే ఆలోచనలో వున్నట్లు పత్రికావార్తలు చూస్తోన్నాము.

మోచర్ల సుబ్బలక్ష్మి (భీమవరం)

తమపిల్లలకు తక్కువమార్కులొస్తే "మా టీచరు చెప్పిందిదేనా?" అని అడుగుతారు. కాని అలాఅనుకోవడం పొరపాటు. తమపిల్లల బాధ్యత తమకే అక్కరలేనినాడు పైవాళ్ళకి అవసరంయేమిటి. అందువల్ల మొదటి నుండి పిల్లలచదువు విషయంలో సంపూర్ణ బాధ్యతగల తల్లిదండ్రులు ఎక్కువశ్రద్ధ తీసుకోవడం అవసరం. నిజమైన భావిపౌరులుగా తయారుచేసేది వీళ్ళే. ★

* * *

'మీరిచ్చిన మంచి సలహా'

సంగాని ప్రభావతి, భానుమతిగార్లకు మీరు 19-6-57 ఆంధ్రపత్రిక వనితాలోకంలో వ్రాసిన గృహవైద్యం (మంచిగంధంతో) చదివాను. అందులో మంచిగంధం వుపయోగాలు వ్రాస్తూ రక్తచందనం దుప్పికొమ్ము అరగదీసిపట్టువేస్తే మేహవాత నొప్పులు తగ్గుతాయని వ్రాశారు. మా అమ్మగారికి వాతనొప్పివల్ల చెయ్యి పైకి లేవకుండా వుంది. దానికి ఎన్ని రకాల వైద్యాలు చెయ్యాలో అన్నిరకాల వైద్యాలు చేయించాము. కాని దేనివల్లా తగ్గలేదు. మనం బలవంతంగా చెయ్యి పైకి లేవదీస్తే జబ్బ(బుజం) నొప్పిగా వుంటుంది. మీరు వ్రాసినది చదివినదగ్గరనుండి దుప్పికొమ్ముకు ప్రయత్నించేము ఎక్కడా దొరకలేదు. నెలా నెలపదిహేను రోజులయింది. ఒకరివద్ద వుందని తెలిసి అది తెచ్చి అరగదీసి నెల పదిహేనురోజులనుంచీ పట్టు వేస్తున్నాము. అసలు పూర్తిగా కాకపోయినా సగమయినా నయమై చెయ్యి వచ్చినందుకు ఎంతో సంతోషిస్తున్నాము. మీకు నా కృతజ్ఞత ఏ విధంగా తెలియజెయ్యాలో తెలియకుండా వుంది. మీరు నాకు తెలియకపోయినప్పటికి ఈ విధంగా పత్రికద్వారా మిమ్మల్ని తెలుసుకున్నాను. మీ ఎడ్రసు తెలియకపోవడంచేత పత్రికద్వారా నా కృతజ్ఞత తెలియజేస్తున్నాను. నేను మరచిపోకుండా గుర్తుంచుకునే వాళ్లలో మీరు కూడా వున్నారని తెలియజేస్తున్నాను.

చెయ్యి పూర్తిగా వచ్చేవుపాయం ఏమైనా వుంటే ఈ సోదరియందు దయతలచి చెప్పుతారని ఆశిస్తున్నాను.


* * *

వద్దు

నోములూ, వుద్యాపనలూ, ఐదోతనం, కడుపుశోకం లాంటి కబుర్లూ, రాజకూతురూ, మంత్రికూతురూ లాంటి కథలూ దయచేసి 'వనితాలోకం'లో వద్దు.

నోములంటే యిష్టమున్న వాళ్ళకి అవి చెప్పేందుకు బామ్మలూ, అమ్మలూ,

(47-వ పేజీ చూడండి)



ఫిలిప్పైన్స్‌లోని బటంగాస్ నూనెశుద్ధి కర్మాగారంలో పని నేర్చుకుని ఇప్పుడు విశాఖపట్టణం కర్మాగారంలో పనిచేస్తున్న భారతీయులు.

మనదేశంలో నూనె పరిశ్రమ

(25 వ పేజీ తరువాయి)

1920 లో ఏర్పడింది. ఈ కంపెనీ కట్టిన నూనె శుద్ధి కర్మాగారం భారతదేశంలోకల్లా మొట్ట మొదటిది. గడచిన 30 ఏళ్ళలో ఈ కర్మాగారం దాదాపు నూరు రకాల పెట్రోలియం పదార్థాలను దేశమంతటికీ సప్లయి చేసింది.

పెట్రోలియం పదార్థాలకు భారతదేశంలో క్రమంగా డిమాండు ఎక్కువవుతోంది. ఈ డిమాండు 1948 నుంచి 1955 నాటికి రెట్టింపయింది. ముఖ్యంగా కిరసనాయిలు అవసరం హెచ్చుతోంది. దాదాపు ఆరు లక్షల భారతీయ గ్రామాలను కిరసనాయిలు దీపాలే వెలిగిస్తున్నాయి. కిరసిన్ వాడకం అమెరికాలో తరవాత మన దేశంలోనే ఎక్కువ. 1955 లో మన దేశంలో 18 లక్షల టన్నుల కిరసనాయిలు అమ్ముడైంది. అసలు దీపాలకు కిరసనాయిలును వాడడం నూరేళ్ల కిందట అమెరికాలో ప్రారంభమైంది. 1880 ప్రాంతాల్లో ఈ నూనె భారతదేశం వచ్చింది. అప్పటినుంచీ క్రమంగా దీని వాడకం ఎక్కువవుతోంది.

భారతదేశంలో ఇప్పుడు పారిశ్రామిక విప్లవం జరుగుతోంది. నదులకు డాములు కడుతున్నారు. రైల్వేలు ఎక్కువచేస్తున్నారు. విమానరవాణా ఎక్కువచేస్తున్నారు. రోడ్లువేస్తున్నారు. ఇంకా ఎన్నో కొత్త భారీపరిశ్రమలు స్థాపిస్తున్నారు. వీటన్నిటికీ ఎంతనూనె అవసరమో చెప్పలేము. అందువల్లనే ఇప్పుడు మనదేశంలోనే కొత్తగా నూనెశుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది. 60 కోట్ల రూ. ల పెట్టుబడితో మూడు నూనెశుద్ధి కర్మాగారాలు మొత్తం ఏడాదికి 40 లక్షలటన్నుల ముడి నూనెను శుద్ధిచేస్తాయి. అంటే మనదేశానికి కావలసిన శుద్ధిఅయిన నూనెలో చాలా మటుకు ఇక్కడే తయారుచేసుకోవచ్చునన్న మాట. అంటే, నూనెశుద్ధిపరిశ్రమ మన దేశపు పెద్దపరిశ్రమలలో (వస్త్రపరిశ్రమ, జనపనార పరిశ్రమ, బొగ్గు, టీ, ఉక్కు) ఒకటవుతుందన్న మాట.

బొంబాయివద్ద బర్మాషెల్ వారిదొకటి, స్టాండర్డ్ వాక్యూమ్ కంపెనీవారిదొకటి నూనెశుద్ధి కర్మాగారాలున్నాయి. ఈ రెండూకలిసి ఏడాదికి 32 లక్షల టన్నుల నూనెను శుద్ధిచేయగలవు. మూడోది కొత్తగా విశాఖపట్టణంవద్ద కాల్టెక్స్ కంపెనీవారు కట్టారు. (నవంబరు 30 వ తేదీన ప్రారంభోత్సవం.) ఇది సుమారు 6,75,000 టన్నుల ముడినూనెను శుద్ధిచేయగలదు. ఈ మూడింటిలోకీ బర్మాషెల్ వారి కర్మాగారమే పెద్దది. ఇది ఏడాదికి 20 లక్షల టన్నుల నూనె శుద్ధి చేస్తుంది; ముడినూనెలోంచి ఏడాదికి $1\frac{1}{2}$ లక్షల టన్నుల కొవ్వు తయారుచేస్తుంది.

మొదట్లో డిగ్‌బాయ్ కర్మాగారం ఒకటే మనదేశంలో ఉండే రోజుల్లో అది మనకి కావలసిన నూనెలో నూటికి 7 వంతులే సరఫరా చేసేది. మిగతా నూనెను ఇతర దేశాల కంపెనీలు తీసుకువచ్చి సరఫరా చేసేవి. 1948 లో భారత ప్రభుత్వానికో ఆలోచన తట్టింది. మనకి కావలసిన నూనెని మనమే ఎందుకు తయారుచేసుకో గూడదూ అని. దరిమిలా భారతప్రభుత్వ ఆహ్వానం మీద విదేశీ కంపెనీలు మనదేశంలో ఎక్కడ కర్మాగా

నీటినుంచి నూనె

నూనె నేలలోనే కాదు, నీటిలో కూడా దొరుకుతుంది. మెక్సికో సింధు శాఖలోని నూనెబావులు ఇందుకు ఉదాహరణ. అరవై, డెబ్భయ్ అడుగుల లోతుగల నీటిలో బావులు తవ్వారు. ఇవి తవ్వడానికి నీటిమీద బ్రహ్మాండమైన వేదికలు కట్టాలి. ఒక వేదికమీదనుంచి పదకొండు బావుల దాకా తవ్వవచ్చు.

తవ్విన నూనెను ఒడ్డున గిడ్డంగులలోకి తీసుకుపోవడానికి నీటిలోంచే గొట్టాలు వేశారు.

అప్పుడప్పుడు తుపానులు వస్తాయి. తుపాను ఆగిపోయేదాకా పని ఆగిపోతుంది. అందాకా వేదికలమీదున్న సిబ్బంది ఒడ్డుకి పారిపోయి తలదాచుకుంటారు. తుపాను ఆగినతర్వాత పని మొదలుపెడతారు.

లను తయారుచేశారు. ఈ మూడూ, డిగ్‌బాయ్‌లో ఉన్న పాతకర్మాగారం కలిసి

రాలు కడితే బాగుంటుందా అని పరిశోధనలు చేశాయి. చేయగా, బొంబాయి, విశాఖపట్టణం ఇందుకు తగిన స్థలాలు అనిపించింది. 1951 సంవత్సరంలో ప్రభుత్వం స్టాండర్డ్ వాక్యూమ్ వారితోనూ, 1953లో కాల్టెక్స్ వారితోనూ వేరు వేరు ఒడంబడికలు చేసుకుంది. తత్ఫలితంగా బొంబాయి దగ్గర ట్రాంబేద్వీపంలోనూ, విశాఖపట్టణం దగ్గిరా మూడు కర్మాగారాలు లేచాయి. ★


LUX
TOILET SOAP
సావిత్రి ఇలా చెప్పుచున్నది, "మేను సౌమ్యమైనదిన్నీ పరిమళమైనదిన్నీ గనుక లక్స్ టాయ్‌లెట్ సబ్బును మెచ్చుకొంటాను".
లక్స్ టాయ్‌లెట్ సబ్బు
సినిమా తారలకు సౌందర్యము నిచ్చు సబ్బు
L T S-553-X52



పాపాయి కల

చిన్ని పాప మేడమీద
వెన్నెలలో పండుకొంది.
పిండి యారబోసినట్లు
పండు వెన్నెలపుడు విరిసె.

చిన్నిపాప వెన్నెలలో
చందమామచక్కదనం
చూసి మురిసి ముద్దుగొనెడి
ఆన మదిని తలచుకొనుచు—

నిదురపోవ కలనుగాంచె:
'నింగినుండి భువికిచంద
మామ వచ్చి చిన్ని పాప
మోము తాకి ముద్దుగొనెను.'

చల్లదనపు చక్కిలిగిలి
సంతసమును కలుగజేయ,
చిన్నిపాప మేలుకొనుచు
కన్ను విప్పి చూడనచట—

అమ్మమోము చందమామ!
అమ్మజుత్తె ఆకసంబు!
కొప్పులోని మల్లెమొగ్గ
లొప్పె చుక్కగములలాగ!

★ టి. పి. ఎస్. రామచంద్రాచార్య ★

ప్రతిఫలం

గుండెపూడి సీతారాం

అనగనగా ఒకరాజు. ఆ రాజుకో కుమార్తె. ఆమె అందకత్తె. కానీ మిక్కిలి గర్విష్టి. తల బిరుసుగా ప్రవర్తిస్తుండేది. పెండ్లాడుటకు వచ్చిన రాకుమారు లెవరూ ఆమెకు నచ్చకపోగా వారందరిని అవమాన పరుస్తుండేది.

ఒకరోజున రాజో గొప్ప విందే ర్పాటుచేసి ఆ విందుకు తన కుమార్తెను వివాహమాడదలచిన రాకుమారు లందరినీ ఆహ్వానించాడు. రాజులు, సామంతులూ వారి వారి హోదాల ప్రకారము ఎవరి ఆసనాల్లో వారు వరుసగా కూర్చున్నారు. రాకుమారి వచ్చిన వరుణ్ణి వరించుటకుగాను రాకుమారు లొక్కొక్కరినీ చూచుకుంటూ వెళ్లింది. వారి నెవ్వరినీ మెచ్చి వరించకపోగా విందుకు వచ్చిన ప్రతివాక్కని గురించి హేళనగా మాట్లాడింది. మొదటివాడు మిక్కిలి లావుగ వుండటంచేత "అతడో నీటి తొట్టిలా వున్నా"డని ఎగతాళిచేసింది. రెండోవాడు మిక్కిలి పొడగరి. అంచేత "ఎలాంటి బడితెలాంటి మనుష్యుడో!" అని అంది. తరువాతివాడు చాలా పొట్టి. అతన్ని మరుగుజ్జువాడంది. నాలుగోవాడు బాగా తెల్లబారిన ముఖం కలిగివుంటంచేత అతన్ని "పాండురోగి" అంది. ఐదవవాడు బాగా ఎర్రగా వుంటంచేత కోడిజుట్టులా వున్నాడని హేళన చేసింది. ఆరవవాడు వంగినట్లుంటంచేత ఎండకు వాడిన తోటకూర కాడలా వున్నాడని అంది. ఆరకంగా ప్రతివానినీ ఏదోవిధంగా గేలి చేయడాని కామె కేదో వంకదొరికింది. రాకుమారి ఒకమూల కూర్చున్న మిక్కిలి సౌమ్యుడయిన రాజును చూచి అందరికన్న ఎక్కువగా పరిహాసము చేసింది. సంస్కారము లేనట్లున్న అతని గడ్డాన్ని చూచి "మాసిన గడ్డము"అని అతనికి నామకరణము చేసి పరిహాసము చేసింది. ఆ విధముగా ఆరాజుకు "మాసిన గడ్డంరాజు"అనే మారుపేరొచ్చింది.

వచ్చిన అతిథు లందరినీ అవమాన పరిచిన కుమార్తె ప్రవర్తనకు మహారాజుకు కోపంవచ్చింది. ఆమె ప్రవర్తనకు శిక్షగా యిష్టమయినా కాకపోయినా తనయింటికివచ్చిన మొదటి భిక్షుకునకు కుమార్తె నిచ్చి వివాహము చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

రెండురోజులు గడిచాక ఒక వీధి గాయకుడు రాజసౌధము ముందు నిలచి పాటపాడుతూ ముష్టి పెట్టమని కోరాడు. అతనిపాట వినగానే రాజు "అతనిని లోనికి తీసుకురండి" అని ఆజ్ఞాపించాడు. అసహ్యమైన దుస్తులతోవున్న గాయకుని లోనికి ప్రవేశపెట్టారు. గాయకు డొక పాట పాడి రాజుగారి మెంతో ఆనందపరిచాడు. "నీవు చక్కగా పాడటంచేత నీకు నా కుమార్తె నిచ్చి వివాహము చేస్తా"నని అన్నాడు రాజు. రాకుమారి రాజును బ్రతిమాలింది, ప్రాధేయపడింది. కానీ ఎంత బ్రతిమాలినా, ఎంత దుఃఖించినా ఏమి ప్రయోజనము? "నా యింటి కొచ్చిన మొదటి భిక్షుకునకు నిన్నిచ్చి వివాహము చేస్తానని ప్రతిజ్ఞ చేశాను. నామాట నేను నిలబెట్టుకోవాలి," అని అన్నాడు రాజు. పురోహితుని పిలిపించారు. రాకుమారినీ వీధి గాయకున కిచ్చి వివాహముచేశాడు రాజు. వివాహమవగానే" నీవు యిక్కడ వుంటానికి వీలులేదు. నీ భర్తతోనే ప్రయాణము చేయవలె"నని రాజన్నాడు.

భిక్షుకుడు రాకుమార్తె యిద్దరు కలిసి ఒక పెద్ద అడవి చేరారు. "ఈ అడవి ఎవరిది? అని అడిగింది రాకుమారి." ఇది మాసినగడ్డం రాజుది. ఆయన్ని వివాహమాడితే యిదంతా నీదే అయివుండేది," అని అన్నాడు వీధి గాయకుడు. "దురదృష్టవంతురాలిని, మాసినగడ్డంరాజును పెండ్లాడినా ఎంత బాగుండేది," అని నిట్టూర్పు విడిచింది రాకుమారి. తరువాత వారు మంచి పచ్చికబయళ్ల వద్దకు రావడంతోనే రాకుమార తిరిగి ప్రశ్నించింది "ఈ అందమై

వచ్చికబయళ్ళేవరివి," అని. "అవి కూడా మాసినగడ్డం రాజువే. ఆయన్ను పెండ్లాడితే యివన్నీ నీకే అయివుండేవి," అని తిరిగీ సమాధానమిచ్చాడు భిక్షుకుడు. "నేనెంత దురదృష్టవంతురాలిని. మాసినగడ్డం రాజును పెండ్లాడితే ఎంత బాగుండేది," అని చింతించింది రాకుమారి.

వీథి గాయకుడు రాకుమారి తరువాత పెద్దపట్నం చేరారు. "ఈ మహాపట్న మెవరిపాలనలో ఉన్నది," అని ప్రశ్నించింది రాకుమారి. "ఇది కూడా మాసినగడ్డం రాజు పాలనలోనే వుంది. అతనిని వివాహమాడితే యిది కూడా నీదే అయివుండేది," అని యింకా వుడికించాడు వీథిగాయకుడు. "అదృష్టహీనురాలిని మాసినగడ్డం రాజును ఎందుకు నేను వివాహం చేసుకోలేదు" అని దుఃఖించింది రాకుమారి. "దానితో నాకేమీ పనిలేదు. నేను నీకు తగినభర్తనుగానా? మరొక భర్తమాట తలపెట్టటానికి? అని అన్నాడు వీథిగాయకుడు.

వారు చివరికో చిన్నగుడిసె చేరారు. "ఈ చిన్న మురికి కొంప ఎవరిది?" అని ప్రశ్నించింది రాకుమార్తె." అది నీ నా యిద్దరి యిల్లు. ఇందులోనే మన మిద్దరము కాపురము చెయ్యాలి," అని సమాధానమిచ్చాడు భిక్షుకుడు. "మీ సేవకులెక్కడున్నారు," అని అడిగింది రాకుమారి. "మనకు సేవకులెందుకు అన్ని పనులు నీవూ నేనే చేసుకోవాలి. పొయ్యిరాజేసి త్వరగా వంట చెయ్యి. నేను చాలా అలసివున్నాను," అన్నాడు వీథిగాయకుడు. రాకుమారి కదేమీ తెలియకపోవుటచే భిక్షుకుడు సహాయపడవలసి వచ్చింది. ఏదో కొద్దిగ భుజించి ఆ రాత్రికి నిద్రించారు. తెల్లవారుఝాముననే యింటిని శుభ్రపరచుటకు రాకుమారిని లేపాడు భిక్షుకుడు. ఆవిధముగా రెండురోజులు గడిపారు. ఇంట్లో వున్న ఆహార పదార్థములయిపోగానే "మన మీ విధముగా డబ్బు ఖర్చుపెట్టుతూ సంపాదన లేకుండా ఎంతకాలము గడుపగలము? కాబట్టి నీవు బుట్టలల్లటం నేర్చుకోనవలె" నని అన్నాడు భిక్షుకుడు. భిక్షుకుడు యీతపుల్లలు తీసుకొచ్చి బుట్ట లల్లమన్నాడు రాకుమారిని. రాకుమారి అల్ల మొదలెట్టేసరికి వేళ్లు బాగా కందిపోయాయి. "ఈ పని నీకు చేతకాదు. పోనీ నూలయినా వడకగలవేమో ప్రయత్నించు," అని అన్నాడు భిక్షుకుడు. రాకుమారి నూలువడక మొదలెట్టింది. నూలుదారము రాకుమారి మృదువగు వేళ్ళను కోయగా వేళ్ళ నుండి రక్తము ప్రవహింప మొదలెట్టింది. "ఎందుకు పనికిరానిదానివి. నాపాలిట పడ్డావుగదా! ఏంచేస్తాను? కానీ చివరకు వ్యాపారమయినా చేయగలవేమో పరీక్షిస్తాను. బజారులో కుండలు చట్లు అమ్మటానికి పంపిస్తాను. అదయినా సరిగా చేయగలవేమో చూస్తాను," అని అన్నాడు భార్యతో ఆ వీథిగాయకుడు. "అయ్యో! నా తండ్రిగారి మందీ మార్బలమూ యీ వేపు పోతూ బజారులో నన్నుచూసి పరిహాసిస్తారుగదా! నా పరిస్థితి ఎంత నీచమైనది," అని తలపోసింది రాకుమారి.

కానీ వీథిగాయకుడు లెక్కచేయలేదు. "ఆకలి బాధతో చావకుండా బ్రతకదలిస్తే తప్పక ఏదో పని చేయవలసిందే," అని పట్టుబట్టాడు. మొదట్లో వ్యాపారము బాగా సాగింది. ఇంత అందమయిన యువతిని బజారులో చూచి అనేక మంది వస్తువులు తీసుకొను వుద్దేశ్యము లేకపోయినా డబ్బు చెల్లించ మొదలెట్టారు. ఆ సామానంతా ఖర్చయిపోగా భిక్షుకుడు మరి కొంత సామాను తీసుకొచ్చాడు. ఆ సామాను ముందు పెట్టుకొని రాకుమారి కూర్చొనివుండగా ఒక తాగుబోతు సిపాయి గుర్రమును కొట్టుపైకి నడిపించగా మృణ్మయపాత్రలన్నీ పగిలిపోయినాయి. "అయ్యో! భర్త ఏమంటాడో? నా బ్రతు కేమైపోతుందో," అని విలపించ మొదలెట్టింది రాకుమార్తె. భర్తవద్దకు పరుగెత్తుకుంటూ వెళ్లి సంగతంతా చెప్పగా పదిమంది వస్తూపోతుండే దార్లో దుకాణము పెట్టమని నీకెవరు చెప్పారు? అయినా యీ పనికి కూడా నీవు తగినట్లులేవు. "ఆమధ్యాన నేను రాజుగారి భవనమునకుపోయి మీ కేమైనా వంటగదిలో సహాయకారిగా పనిచేయుటకు మనిషి కావలెనా? అని అడగ్గా వారు నిన్ను తీసుకొనెదమని వాగ్దానము చేశారు. అక్కడ నీవు తిన్నంత తిని పారవేసినంత పారవేయడానికి వీలుంటుంది," అని సలహా యిచ్చాడు వీథి గాయకుడు.

ఆ విధముగా రాకుమారి వంటగదిలో సహాయకారిగా చేరింది. వంటమనిషికి అక్కడ అతి నీచమైన పనులలో సహాయపడ మొదలెట్టింది. అందరు భుజించిన పిమ్మట మిగిలిన ఆహారపదార్థమును రాకుమారి, వీథి గాయకుడు తిని జీవించ

★ ప్రతిఫలం ★

వలసి వొచ్చింది. రాకుమారి అక్కడ చేరిన కొద్దిరోజులకే అక్కడి రాజుగారి పెద్ద కుమారుని వివాహము నిశ్చయమయింది. అన్ని పనులు జరిగిపోతున్నవి. రాజ లాంఛనాలు రాజఠీవితో హోదాకు తగ్గట్లుగా అన్నిపనులు జరగటం చూచి ఒకసారి తన సంగతి జ్ఞప్తికివచ్చి భారమైన హృదయముతో ఒక నిట్టూర్పు విడిచింది. తనగర్వము, తను చేసిన తప్పిదము తననింత నీచస్థితికి తీసుకొచ్చినవని తలచి ఎంతో విలపించింది. తరువాత రాజసేవకులు ఆమెకు కొన్ని మోదకాల నివ్వగా యింటికి తీసుకువెళ్ళడానికి బుట్టలో దాచివుంచుకుంది.

రాకుమారి యింటికి వెళ్లే సమయానికి బంగారు దుస్తులు ధరించిన రాకుమారుడు లోపలికి ప్రవేశించాడు. అక్కడ యీ అందమయిన రాకుమారి కనబడగానే ఆమె చేయి పట్టుకుని తనను వివాహమాడమని కోరాడు. తన్ని చేత్తో పట్టుకుంది మాసినగడ్డంరాజని తెలుసుకుని రాకుమారి భయంతో కంపించిపోయింది. పట్టినపట్టువదలక మాసినగడ్డంరాజు ఆమెను పదిమందివున్న వేరుగదికి తీసుకువెళ్ళాడు. ఆ హడావుడిలో రాకుమారి చేతిలోని బుట్టమీద మూతపోయి మోదకాలు గదంతటా పడిపోగా అక్కడున్నవారందరూ రాకుమార్తెను హేళన చేశారు. అప్పుడు తన పరిస్థితి నాలోచించుకున్న రాకుమార్తె నలుగురికి ముఖం చూపెట్టలేకపోయింది. భూమిలోకి కుంగిపోతే బాగుండు ననిపించింది రాకుమారికి. వెంటనే తలుపు దగ్గిరకు పారిపోదామని పరుగెత్తింది. కానీ మాసినగడ్డంరాజు అడ్డుతగిలి తిరిగి పట్టుకొచ్చి ఆమెతో "ఇన్నాళ్లు నీతో పూరిగుడిసెలో కాపురంచేసిన సంగీతవిద్వాంసుణ్ణి నేనే. నిన్ను ప్రేమించటంచేతనే యిక్కడికి తీసుకొచ్చాను. నీదుకాణములోని కుండలను పగులగొట్టిన సిపాయిని కూడా నేనే. నన్ను నీవు పరాభవించినందులకు, నీకున్న అహంకారగర్వములను పోగొట్టుటకు, నీకీ శిక్ష విధించాను. ఇప్పుడు నీలోని గర్వమంతరించింది. మర్యాదంటే ఏమిటో నీవిప్పుడర్థం చేసుకున్నావు. నీ తప్పు నీవు తెలుసుకున్నావు. కాబట్టి యిప్పుడు మన యిరువురి వివాహము జరగాలి," అని మాసినగడ్డంరాజు అన్నాడు.

అప్పుడు రాకుమారికి అతి మనోహరమయిన దుస్తులు తీసుకొచ్చారు. రాకుమారి తండ్రి ఆయన సామంతులూ వివాహసందర్భమున ఆమెనాశీర్వదించారు. ప్రతి వొక్కరి ముఖంలో ఆ సమయములో ఆనందమే తాండవమాడింది. అప్పుడొక అద్భుతమైనవిందు జరిగింది. ఆవిందారగించినవారందరూ అత్యంత సంతుష్టులయ్యారు. చూశారా! రాకుమారి తనగర్వానికి తగిన ప్రతిఫల మెలా అనుభవించిందో?! ★

★ ప్రేమించని పెళ్లికొడుకు ★

(21-వ పేజీ తరువాయి)

సంబంధం చూడడానికి విశ్వ ప్రయత్నం చేసేరు వాళ్ళనాన్న. కాని డబ్బు దగ్గర అవన్నీ వృధా అయ్యేయి. అబ్బాయిలుగల పెద్దల హిరణ్యాక్షవరాలు నెరవేర్చలేక ఆ ప్రక్క గ్రామంలో నేవున్న ఓ అబ్బాయి కివ్వడానికి నిశ్చయించేరు. అబ్బాయి కొద్దిగా నల్లగా వుంటాడన్న మాటేగాని గుణవంతుడు. చదువులేదన్న మాటేగాని బుద్ధిమంతుడు. వాళ్లు యిద్దరే అన్నదమ్ములు. తాతలనాటి నుండి వస్తున్న ఆస్తిని పాడు చెయ్యకుండా, ఒకర్ని దేహీ అనకుండా సుఖంగా కాలక్షేపం చేస్తున్నారు.

"వాళ్లు స్థితిపరులూ, కట్నాలు పెద్దగా కోరనివాళ్ళూ, కోరి ఆ పిల్లను చేసుకుంటామని వచ్చినవాళ్ళూ అయినా నల్లగా వుంటాడనీ, చదువులేదనీ పెళ్ళికూతురికీ, మా పిన తల్లికీ, ఆవిడ చిన్నబ్బాయికీ నచ్చలేదు ఆ సంబంధం. ఆఖరికి ఎలాగయితేనేం నలుగురు పెద్దవాళ్లు నచ్చించి ఆ మూడుముళ్లు పడేటట్టు చేసేరు. ఇప్పుడు ఒంటినిండా బంగారం, యింటినిండా పిల్లలతో కలకల్లాడుతూంది. ఎప్పుడైనా నవ్వడానికి 'ఏమమ్మా చెల్లీ! నల్లబావ బాగున్నాడా' అంటే 'శేఖరం అన్నయ్య యింకా మర్చిపోలేదు' అని నవ్వుకుంటుంది" అని కథ పూర్తిచేసేను.

"విశ్వం మరి మారుపలకకుండా నా వెనకనే యింటికి వచ్చేసేడు" అని అసలు కథ కూడా పూర్తిచేసేడు చంద్రశేఖరం.

"అంతేనండీ మనలో పెళ్లిళ్లే అంత. ఇంకా యిప్పుడిప్పుడుగాని పాశ్చాత్యుల్లాగ ప్రేమించి పెళ్లిచేసుకోవడాలు మనలో లేవు" అన్నారొకాయన.

"అందుకే కదటండీ రాధాకృష్ణ పండితుడు 'మనం ప్రేమించిన ఆడదాన్ని పెళ్లాడం, పెళ్ళాడిన ఆడదాన్ని ప్రేమిస్తాం' అన్నాడు" అని అందుకున్నారు మరొకరు.

"అప్పుడే కథ అయిపోలేదు. ఇంకో గమ్మత్తు జరిగింది" అన్నారు చంద్రశేఖరం. అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

"మొన్న నీమధ్య రాజమండ్రి నుండి వాల్తేరు పోతూ సామర్లకోటలో పిల్లలకి మంచినీళ్లకని మగర చెంబుపట్టకొని కుళాయి వైపు వెళుంటే 'శేఖరం పెదనాన్నా' అని పలకరించేడు. అటు తిరిగి చూద్దును కదా చిన్న గున్నేనుగు నడుస్తున్నట్టే నడుస్తున్నాడు. మొదట్లో పోల్చుకోలేకపోయేను. కాకినాడలో మందులషాపు పెట్టేడట. కౌంటర్ దగ్గర కూర్చోడంతప్ప పనేమీ లేకపోడాన్ని శరీరం పెంచేడట.

'తర్వాత 'రండి పెదనాన్నా! మా పిల్లల్ని చూద్దురుగాని' అని తను కూర్చున్న పెట్టెదగ్గరికి తీసుకువెళ్ళేడు. కిటికీలో నుండి ఎవరో ఒకావిడ చూస్తోంది. మొహం పాలిపోయి, దవడలు లోతుకుపోయి, కళ్ళూ పళ్ళూ బయటికివచ్చి సన్నంగా వుంది. ఆవిడ గడ్డం పట్టుకు పక్కకి తిప్పుతూ మారాం చేస్తున్న పిల్లణ్ని చీపురుపుల్లలాంటి చేతితో మందలిస్తోంది. మేం పెట్టెదగ్గరికి చేరగానే మొహం ఒక్కసారి లోపలికి తిప్పుకుంది.

'మీ కోడలు పెదనాన్నా' అన్నాడు విశ్వం. నా ఆశ్చర్యానికి అంతు లేదు. విశ్వాన్ని చూడగానే పెళ్ళినాటి గొడవ గుర్తువచ్చి వాడి పెళ్ళాం మరోకలాగ వుంటుందని వూహించుకున్నాను.

విశ్వం వాళ్ల పిల్లల్ని నలుగుర్ని చూపించేడు. వాళ్ళుకాక సంవత్సరం పూర్తికావస్తున్న పాప వుందని పెట్టెలో నుండి ఒక చంటిపిల్లను తీసుకువచ్చి చూపించేడు.

వస్తున్న నవ్వు అపుకుంటూ 'పెళ్ళయి చాలాకాలం అవుతుందికదూ' అన్నాను.

'పదేళ్ళు అవుతుంది పెదనాన్నా' అన్నాడు. ఇంజను నీరు నింపుకుని వచ్చింది సిగ్నలు వాలింది. నేను నా పెట్టెవైపు మంచినీళ్ళు పట్టుకుని వెళ్లిపోయేను.

మరికొంత సేపటికి రైలు కదిలింది. విశ్వం పెళ్ళి గురించి ఆలోచిస్తూ "ఒకనాడు తన చక్రాలకింద నలిపివేయవలసిన రైలు యీ వేళ వాణ్ని భారంగా మోసుకు వెళ్తోంది' అనుకున్నాను." అని చంద్రశేఖరం తన కథ ముగించారు. ★

వనితావాణి

(41-వ పేజీ తరువాయి)

వున్నారు. ప్రత్యేకం నోముల పుస్తకాలు కూడా వుంటాయి. 'వనితాలోకంలో' కూడా అవి అనవసరమేమో!

అయినా సోవియట్ వుపగ్రహాలు రోదసిలో విజయవిహారం చేస్తున్న యీ కాలంలో వనితలు చెప్పుకోవలసినవి యివేనా అని మాకు ఆశ్చర్యం కలుగుతోంది. మహిళాభ్యుదయమంటూ కృషి చేస్తూ, ముందుకుపోతున్న స్త్రీలు యిలాంటి ముసలమ్మల కబుర్లు విడనాడితే తప్ప లాభం వుండదు.

'వనితాలోకం'లో వ్యాసాలూ అవీ బావుంటున్నాయి. ఇంకా చక్కని వ్యాసాలతో 'వనితాలోకం' అభివృద్ధి పొందాలని ఆశిస్తున్నాను.

కుమారి లక్ష్మి (కె. వి. పి)



ఇద్దరు హాస్య నటులు

(17 వ పేజీ తరువాయి)

అతనికండ్లముందు తిరిగి కళ్ళమ్మట నీళ్ళు తెప్పించాయి. శూన్య దృక్కులతో చూస్తున్నాడు.

ఇంతలో ఆయనముఖంలో కాఠిన్యత మాయమైంది. క్రమంగా చిరునవ్వు ఆవరించుకుంది. "ఇటుచూడు" భయంకరంగా అరిచాడాయన.

వాడిలిపోతూ తలెత్తి చూశాడు.

ముసలాయన మూతిమీదున్న మీసాలు, తలకి ఉన్న విగ్గు, గడ్డం తీసేశాడు. గోపాలం తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. ఎదురుగా నవ్వుతూ రమణమూర్తి కూర్చుని ఉన్నాడు. గోపాలం ఆనందానికి అంతులేదు. గబగబ కళ్ళు తుడుచుకుని.

"ఇండాకనుంచీ నువ్వేనటోయ్ ఇంత హడావుడి చేసింది?" అన్నాడు. ఇంకా అనుమానంపోక.

మెల్లిగానవ్వాడు రమణమూర్తి, గోపాలం వీపుమీద తట్టుతూ "విషంలేదు ఏమీ లేదు గాని బెంగపడకు...ఇక పోదాంపద. రాధ మనకోసం ఎదురుచూస్తూంటుంది."

గోపాలం మనసు విషం విషయం తేలటంలో తేలికపడింది. కాని అంతలో విచార రేఖలు ఆవరించుకున్నాయి. తను ఓడిపోయాడు.

ఈ విషయమంతా అన్ని ఊళ్ళవారికీ పోయింది. ఎక్కడచూసినా రమణమూర్తిని గురించి చెప్పుకునేవాళ్ళే.

గోపాలరావు ప్రజలని హాసగిస్తే గోపాలాన్నే హాసగించి ఏడిపించాడు రమణమూర్తి.

సరిగ్గా ఇదిజరిగిన నెలరోజులకి బ్రహ్మాండమయిన పందిట్లో, ట్యూబ్ లైట్ల కాంతిలో, ప్రముఖులసాన్నిధ్యంలో, గోపాలరావు అధ్వర్యంక్రింద రమణమూర్తి రాధల వివాహం వైభవంగా జరిగింది. గోపాలరావు వధూవరులను మనసారా ఆశీర్వదించాడు. రమణమూర్తి హృదయంలో ఆనందం వెల్లివిరిసింది. రాధ ముఖంమీద చిరునవ్వు తాండవించింది. ★

(లియొనార్డ్ మెర్రిక్ ఆధారంగా)

పెళ్ళిసంగీతం

(35-వ పేజీ తరువాయి)

హార్మోనియం వాయించటం చాతనయిన వాడు మేష్టరయితే శిష్యురాలి శ్రుతితో ఏ విధమైన సంబంధమూ ప్రమేయమూ లేకుండా తన శ్రుతికే ఆమె గొంతును మేళవింపజేసి పాఠం చెప్తాడు. అది వినేవాళ్ళకి బాధగాని వాళ్ళిద్దరికీమాత్రంకాదు. ఒక వేళ ఆ మేష్టారికి శిష్యురాలి శ్రుతి తెలుసుకో గలిగే శక్తి ఉన్నా, ఆయన చెప్పిన శ్రుతిలో పాడటంచేతకాక సాధక సమయాల్లో ఆమె గాత్రం ఒక త్రోవను హార్మోనియం శబ్దం మరొక త్రోవను పోతూండటం మనకి నిత్యానుభవంలో నిదే! ఇక అలాంటప్పుడు లయజ్ఞానం వారినుంచి ఆశించటం చాలా పొరపాటు. అనేకమైన ఇబ్బందులు పొరుగిళ్ళవారికి, ఆ వీధినే నడవవలసిన వారికి కలుగుతూ ఉంటాయి.

నే నెరిగున్న ఒకాయన తనకి పరమ శత్రువైన పొరుగింటి, ఆసామీ కూతురుకి అచిరకాలంలో అనువైన సంబంధం కుదిరి పెళ్లి కావాలని తహతహ లాడేవాడు. అంతే కాదు. తనంతట తనే ఆ వచ్చిన వారికి పొరుగింటి ఆయన్నిగురించి మంచిగా చెప్పేవాడు. అన్నింటిలోనూ ఆయనకు వ్యతిరేకంగా ఉంటూ ఈ ఒక్కదాంట్లోనూ ఆయనకి అంత అనుకూలంగా ఉండటానికి కారణమేమిటని నేనొకసారి అడిగాను. అప్పుడాయన "వాళ్ళమ్మాయి పెళ్ళికోసం సంగీతం సాధిక చేస్తుంటే విన లేక పోతున్నాం. భగవత్కృప వల్ల ఆ అమ్మాయికి పెళ్ళయితే ఇక మాకు ఆ బాధ ఉండదుగదా-అని..." అన్నాడు. పైకి చెప్పినా చెప్పకపోయినా ఇటువంటి బాధ అందరూ పడేదే!...

సాధన చేసేటప్పుడు ఇలా ఉన్న పాట పెళ్ళివారిముందు పాడవలసిన ఘడియ వచ్చేసరికి మరీ 'ఇది'గా తయారవుతుంది. అప్పుడు పెళ్ళికూతురుని పరీక్ష చేద్దామని వచ్చిన వారికే పరీక్షా సమయం ఆసన్నమవుతుంది. అంతసేపూ నవ్వకుండా నే ఉండగలగటం మాటలు కాదుగా మరి!... నవ్వటం మర్యాద కాదాయె!... అందుచేత పెళ్ళికూతుళ్ళని చూసేందుకు వెళ్ళేవారు ఒక హాస్యగాణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళటం మంచిదని నా సలహా! ఇలాంటి ఇబ్బంది వచ్చినప్పుడు వాడు పరిస్థితిని గ్రహించి నలుగురికీ నవ్వు తెప్పించేమాట ఒకటి అంటాడు. ఆవంతెని అందరూ చక్కగా నవ్వుకోవచ్చును...తరవాత మీ ఇష్టం!...

"బ్రోవభారమా"

పాట బాగా పాడేవాళ్ళల్లో కూడా కొన్నికొన్ని చిట్కాలు ప్రయోగించే వాళ్ళు, లేకపోలేదు. ఆ పాడేపాటలోనే ఒక "ఛాలెంజి"యో ఒక 'పన్నపమో' ఏదో ఒకటి ఉండితీరుతుంది. దాని ప్రభావం కూడా పెళ్ళికొడుకుమీద వారి తరఫువారి మీదా ఉండి తీరుతుంది. "బ్రోవభారమా!" అని పాడిందనుకోండి! అంతవరకూ వచ్చిన ఏ పెళ్ళికొడుకైనా "అవును! భారమే! నేను బ్రోవలేను!" అని అనగలడా? అంటే పరువు, ప్రతిష్ఠా దక్కుతాయా? అందుచేత తప్పని సరిగా, ఆ ఛాలెంజిని ఎదుర్కొనేందుకైనా పెళ్ళిచేసుకు తీరుతాడు గదా!..." రామా! నిన్నే నమ్మిన వారము" అనో, "నను పాలింపగ నడచి వచ్చితివా?"అనో పెళ్ళికూతురుపాడిందనుకోండి! కాదని అనగలిగే కర్కశహృదయం ఏ పెళ్లికొడుక్కి ఉంటుంది?...అందుచేత తనమీద అంతటి నమ్మకాన్ని పెంచుకున్న ఆ కన్యారత్నాన్నితప్ప అన్యులని పెళ్ళాడనని అన్నాడంటే ఆశ్చర్యమేమి ఉంది?... అసలు నిజం చెప్పాలంటే త్యాగరాజస్వామి మొదలయినవారు ఆయా కీర్తనలు వ్రాసేటప్పుడు పెళ్ళికూతుళ్ళ సంగీత పరీక్షలను కూడా దృష్టిలో ఉంచుకునే వ్రాసి ఉండాలి?

అయితే పాట బాగా విన సొంపుగా ఉన్నా, వినటానికి కష్టంగాఉన్నా కూడా తప్పకుండా సగం అయేసరికి ఆపమనటం ఆచారం. అసలు ఇలాంటి సందర్భాల్లో ఉపయోగపడేందుకే పిల్లలతోపాటు పెద్దలు కూడా వెడతారు పెళ్ళిచూపులకి...అంతే గాని ఆకాశవాణివారిలాగ నువ్వు పాడగల ముప్ఫైకీర్తనలు చెప్పు! నువ్వు ఎన్నిరాగాలు ఆలాపించగలవు? అని ఎవరూ అడగరు!... ఈ అవకాశమే గనక లేకపోతే సగానికి పైగా పెళ్ళిళ్ళు కానేకావు...

ఇంకొక విషయంకూడా!...పెళ్లిచూపుల నాడు పాటల పరీక్ష చేసినవారే పెళ్ళయాక ఆ అమ్మాయి గొంతెత్తి పాడటం సహించక పోవచ్చు. అలాంటప్పుడు అంత చిన్న పరీక్ష కోసం పెద్ద కృషిచెయ్యటం అనవసరమే కూడాను. కనక నే ఆ సంగీతం అంతంతగానే ఉంటుంది...అందుచేతే దానికి "పెళ్ళి సంగీతం" అని ప్రత్యేకమైన పేరు వచ్చింది.

ఇవన్నీ మన కందరికీ తెలుసును. అయినా కాని ఈ 'సంగీతం' ఎవరూ వదలరు. ఇది సంగీత శాఖలోకల్లా బహుళ ప్రచారాన్ని పొందినది. కాల పరిణామాన్ని బట్టి ముందు ముందు ఆడపిల్ల మగపిల్లవాడిని పరీక్షచేసే రోజు కూడా రావచ్చు—(ఆ సూచనలు అప్పుడే కనిపిస్తున్నాయి). అలాంటప్పుడు, భావితరాల పెళ్ళికొడుకులు కూడా 'పెళ్ళి సంగీతం' సాధన చెయ్యవలసిన అవసరం కలుగవచ్చు. కాబట్టి వారంతా జాగ్రత్తగా ఉండి ఇప్పటినుంచీ కృషిచెయ్యటం అవసరమేమో ఆలోచించండి!... ★

సినిమా

"భూమి సుందరంగా ఉన్న దన్న మాట నిజమే" అన్నారు లార్డ్ బ్రాబోర్న్ మొన్న నిక్కడ విలేఖరులతో మాట్లాడుతూ. ఈయనే, మన దేశంలో "హరీబ్లాక్" అనే చిత్రం నిర్మించడానికి వచ్చినవారు. లార్డ్ బ్రాబోర్న్ తండ్రి బ్రిటిష్ హయాంలో, ఇక్కడ గవర్నరుగిరీ నిర్వహించారు. బాల్యం అంతా ఇక్కడే గడచింది. ఈయన భార్య కూడా ఈ దేశానికి కొత్తకాదు. వైస్రాయి చేసిన లార్డ్ మౌంట్‌బాటన్ కుమార్తె పెట్రీషియా. వీరంతా మన దేశంలో పలువురితో మైత్రి నెరపి గౌరవాభిమానాలను ఇచ్చి పుచ్చుకున్నవారే. అప్పటి చిన్న పిల్లలు పెరిగి పెద్దవారై, ఇపుడు మన దేశంలోనే చలనచిత్రం తీయడానికి మళ్ళీ

బొంబాయి సినిమా లేఖ

వచ్చారు. బ్రాబోర్న్ దంపతులకు మనదేశం మీద చాలా అభిమానం. ఇక్కడి తను చిన్ననాటి ముచ్చటేదీ మరచిపోలేదు. ఇది కూడా 'మా యిల్లులాంటిదే' అంటారు. ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఈ దంపతులకు సన్నిహిత మిత్రుడు.

లార్డ్ బ్రాబోర్న్, తను నిర్మించే చిత్రం 'హరీబ్లాక్' స్క్రిప్టును బొంబాయి సెన్సార్ సంఘానికి పంపారు. అందులో వారు కొన్ని భాగాలకు అభ్యంతరాలు తెలిపారట. ఆ సందర్భమై వీరు ఢిల్లీ వెళ్ళి ప్రధానిని చూచి వచ్చారు.

"ఢిల్లీ అంతా, రాజాలా తిరిగి వచ్చాం. మేము మీ ప్రధానమంత్రి ముఖ్య అతిథులం అయినందువల్ల ఎక్కడా మాకు అడ్డన్నది లేదు. చాలా కులాసాగా సాగిపోయింది ప్రయాణం" అన్నారు బ్రాబోర్న్ ఆ సంగతి ముచ్చటించి. ఢిల్లీలో ఉండగా ఈయనకు సుస్తీ చేసిందట. ఆ సమయంలో సాక్షాత్తు ప్రధానమంత్రి నిద్రించే మంచం మీద పడుకునే భాగ్యం కలిగిందని లార్డ్ బ్రాబోర్న్ వెల్లడించారు.

ఆయన భార్య పెట్రీషియా బ్రాబోర్న్ ఢిల్లీ ప్రయాణం ముచ్చటలు చెబుతూ, జవహర్‌లాల్ నెహ్రూ అప్పటికీ ఇప్పటికీ చిన్న పిల్లాడిలాగే ఉన్నారు అన్నారు. ఓ రోజు మధ్యాహ్నంపూట, నెహ్రూ హఠాత్తుగా ఆమెను పిల్చి "పాట్! నాతో రా. నీకు ఢిల్లీలోకల్లా బ్రహ్మాండమైన హోటేలు చూపిస్తాను. సీమనించి వచ్చే మీలాంటి అతిథులకి ఎంత మంచి భవంతి కట్టామో చూద్దుగాని రా" అంటూ రెక్క పుచ్చుకు లాక్కుపోయారట. మామూలుగా వెంట వచ్చే అంగరక్షకుడు సిద్ధమై బయల్దేరేలోగానే వారు కారులో బయల్దేరి సరాసరి 'అశోకా హోటల్' (ఢిల్లీలో విదేశీయ అతిథులకోసం ప్రభుత్వం కట్టించినది) కు వెళ్ళారు.


"వస్తూనే, అక్కడి మానేజరును పిలిచి, ఈ విడకి 'హోటేలంతా చూపించండి' అని హుకుం జారీచేశారు... మేం రెండడుగులు వెళ్ళామో లేదో, ప్రధానమంత్రి అక్కడకు వచ్చారన్న వార్త తెలిసిపోయింది కాబోలు తండలాడి జనం ఆ హోటలులోకి వచ్చేశారు ఆయన్ని చూట్టానికి. అంత జనం వచ్చేసరికి, పోలీసుదళం అర్జెంటుగా వచ్చేసింది." అని పెట్రీషియా చెప్పింది.

కథ

పతే ఆనక, ప్రధాని నెహ్రూ, "హరీ



రవీ ఫిలింస్‌వారి "కొండవీటిదొంగ" చిత్రంలో ఇ. వి. సరోజ



ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారి తొలి హిందీచిత్రం "శారద"లో మీనాకుమారి, రాజ్‌కపూర్.

బొంబాయి సినిమాలేఖ

బ్లాక్" చిత్రం స్క్రిప్టు చూచారట. అది, బాపూ అనే ఒక షికారీ (వేటగాడు) కథ. ఇతడు ఒక చిన్న పులిపిల్లను సంపాదించి, మచ్చిక చేసుకుంటూ పెంచుతాడు. అది పెరిగి పెద్దదయాక, 'దురదృష్టవశాత్తు', కట్టుతప్పి నరమాంసాహారి అవుతుంది. దాన్ని చంపినవారికి పెద్ద బహుమతి ఇస్తామని అధికారులు దండోరా వేయిస్తారు. అందుకోసం ఒక బ్రిటిష్ ఆసామి వేటకొస్తాడు. కాని, ఆ పులిని పెంచి పెద్దచేసిన బాపూ మనసొప్పదు. అందుకని, వేటగాళ్ళకి టోకరా యిచ్చి, పులిని వారి తుపాకుల బారినుండి కాపాడ ప్రయత్నిస్తాడు. అలా వేట కొచ్చినవాళ్ళలో, మరీ పగ పట్టినట్టు వచ్చిన వుంటె బ్రిటిష్ సైనికుడు ఒకడు. (ఆ వేషాన్ని అమెరికన్ నటుడు స్టీవర్ట్ గ్రేంజర్ వేస్తాడు.) బాపూ అతన్ని కూడా దారి తప్పిస్తాడు. పులికనబడ్డపుడుబాపూ, ఇతడున్నప్పుడు పులీ కనబడడం జరిగేదికాదట. అందువల్ల, ఆ చుట్టుపక్కల గ్రామాలవారు బాపూ యే పులి అనీ, కావలసినపుడు అతడు పులిగా మారిపోయి మనుష్యుల్ని మింగేస్తున్నా

డని అనుమానించారని, నవలా రచయిత డేవిడ్ వాకర్ ఈ ఘట్టంలో వ్రాశాడు.

లార్డ్ బ్రాబోర్న్ తన స్వంత సంస్థ మార్షాం ప్రొడక్షన్స్ పేరిట ఈస్ట్‌మన్‌కలర్, సినిమా స్కోప్‌లో నిర్మించే 'హారీ బ్లాక్' చిత్రానికి ఇదీ కథ. దీనికి హ్యూగో ఫ్రెగాన్స్ దర్శకత్వం వహిస్తాడు. స్టీవర్ట్ గ్రేంజర్, బార్బారారూష్. ఆంతోనీస్టీల్ ముఖ్యపాత్రలు ధరిస్తారు.

దేశీయ పాత్రలు

కథా నాయకుడు అనదగ్గ 'బాపు' భూమికను, రచయిత, దర్శకుడు నటుడు అయిన ఐ. ఎస్. జోహార్‌కు ఒప్పగించారు. ఈ విధంగా విదేశీయులు నిర్మించే ఆంగ్ల చిత్రంలో పాత్ర ధరించిన తొలి భారతీయుడు జోహార్ అయ్యాడు. ఇదికాక, మరి రెండు చిన్న వేషాలనుకూడా భారతీయులకే ఇవ్వాలని నిర్మాత బ్రాబోర్న్ సంకల్పించారు. ఒకటి నర్సు భూమిక మరొకటి గ్రామ వైద్యుడి పాత్ర. ఇపుడు ఆ నర్సు వేషంకోసం అచలా సచ్‌దేవ్, కృష్ణి నిర్వాన్, వినితాబట్ (శాంతే

ప్లయిట్) జరీనా, మొదలైనవాళ్ళు చాలా మంది లార్డ్ బ్రాబోర్న్‌ను చూడబోయారు. కాని, ఆ ఇంటర్వ్యూలలో ఒకటీ కలిసి రాలేదు. లండన్‌లోని ఇండియా హౌస్‌లో ఉద్యోగం చేస్తున్న ఒక అమ్మాయికి ఆ వేషం ఇవ్వాలని లార్డ్ బ్రాబోర్న్ నిశ్చయించారు.

మైసూరులో అడవుల దృశ్యాలు షూట్ చేయడంకోసం, టెక్నీషియన్ల బృందం డిసెంబరు 28 న ఈ దేశం వస్తుంది. జనవరి 8 న పని ప్రారంభిస్తారు.

* * *

షమ్మీకపూర్ గీతాబాలి నవంబరు 14 న, ఆట్టే హడావుడి లేకుండా పుట్టిన రోజు పండుగ చేసుకొంది. ఆ రోజున, ఆమె, షమ్మీకపూర్ కలిసి బజారుకెళ్ళి అవీ ఇవీ కొనుక్కున్నారు. ఎక్కడో భోంచేసి, తిరిగి తిరిగి, మళ్ళీ రాత్రి కూడా ఇంకో చిన్న హోటలులో భోజనం కానిచ్చారు.

నౌ షెర్వాన్-ఎ-ఆదిల్

గతవారం ఇక్కడ ఒక చిత్రం ... అయింది. అది సాంఘికం ...

-చిన "నౌషెర్వాన్-ఎ-అదిల్." మొదటి నుండి చివరవరకు ఉద్వేగపు బిగితో, అతి వేగంగా సాగిన ఈ చిత్రంలో "న్యాయ పరిపాలనకై ఎంతటి త్యాగాన్నైనా అయినా చేయడానికి సిద్ధపడిన రాజు" అని ప్రసిద్ధి కెక్కిన పర్షియన్ చక్రవర్తి నౌషెర్వాన్ కథను చిత్రించారు. ఆయన జీవితంలో అతి ముఖ్యమూ అత్యంత విషాదభరితమూ అయిన ఘట్టం దీనికి ప్రాతిపదిక. ప్రజాలెక్క అందరికీ ధర్మం న్యాయం లభింపచేయడానికై, ఆయన నెలకొల్పిన పద్ధతులే, ఎదురు తిరిగి ఆయనమీదకు విరుచుకపడతాయి. కుమారుడు క్రైస్తవ యువతిని ప్రేమించడంతో, జోరాస్ట్రియన్, క్రైస్తవమతాల మధ్య సంఘర్షణ బయలుదేరి సామ్రాజ్యపు పునాదులనే కదిపివేస్తుంది. గంభీరమైన ఈ ఇతివృత్తంలో యువరాజు-క్రైస్తవయువతి మార్షియాల ప్రేమకలాపాలే కొత్త తెరిపి ఇచ్చిన సన్నివేశాలు. చివరికి వాళ్ళు ఆత్మహత్య చేసుకుంటారు. చక్రవర్తి సింహాసనాన్ని త్యజించి వెళ్ళిపోతాడు.


కథ చిత్రణ విధానం అంతా నాటకాల శక్కీలో ఉన్నా, షమ్స్ లక్నోవి వ్రాసిన సంభాషణలు దీనికి జవసత్వాలను చేకూర్చాయి. చిత్రం పూర్వార్థంలో కథ కొంత తాపీగా సాగినా పోను పోను బాగా రక్తికట్టి శీఘ్రగతిని నడిచింది. అయితే ఒక్కమాట చెప్పకోవాలి. సొహ్రాబ్ మోడీ పాతచిత్రాలలో కళాఖండాలనిపించుకొన్న "పుకార్" "సికందర్" లకు ఇది ఎందుకూ సాటిరాదు. ఈ చిత్రంలో మోడీయే నౌషెర్వాన్ చక్రవర్తిగా నటించాడు. భారతీయ నటులలో అగ్రశ్రేణివాడుగా నిలచిన మోడీ ఇందులో తన స్థాయికి తగిన నటన ప్రదర్శించారు. సంభాషణలు చెప్పే పద్ధతిలో జీవి నిండుతనం, ఉద్వేగప్రధానమైన సన్నివేశాలలో భావప్రదర్శనం ఆయన ప్రతిభకు నిదర్శనాలుగా భాసించాయి. అయినా 'పుకార్' చిత్రంలో కనబడ్డ మోడీ, 'సికందర్' చిత్రంలో నిలచిన మోడీ, పృథ్వీరాజ్, 'కుందన్' చిత్రాలలో మోడీలను స్మరిస్తే, ఈ నౌషెర్వాన్ పాత్రధారి వారికి దీటుకాదనిపిస్తుంది.

యువరాజ్‌గా రాజ్‌కుమార్ రాణించలేదు. రాజకుమారుడి ఠీవి, దర్పం ఈ నటుడి పాత్రధారణ ఫలితంగా దెబ్బబడిపోయాయి. అతని ప్రియురాలు మార్షియాగా మాలాసిన్హా మితిమీరిన నటన ప్రదర్శించింది. సౌందర్యరాశి మార్షియాపాత్రకు ఈమె విగ్రహం నప్పలేదు. ఇక, నసీం మినహా మిగతావారు అంతంత మాత్రంగా ఉన్నారు.

'నిన్నటి' వెండితెరకు రాణిగా వెలిగిన నసీం దాదాపు పదేళ్ళ తరువాత, తొలిసారిగా ఇందులో పునర్దర్శనం ఇచ్చింది. వసంతకూడా వాసి తగ్గని ఆమె అందచందాల వల్ల ఈ చిత్రం కళకళలాడింది. నటనకూడా అత్యంత మనోహరంగా ఉంది. తెరమీద ఆమె ఉంటే, మిగతావాళ్లు ప్రేక్షకుల కంటికి ఆనరనిపించింది. నసీమ్ పునరాగమనం అత్యంతానందకరంగా, ఈ ఏడాదికి గొప్ప విశేషంగా భాసించింది.

సి. రామచంద్ర ఈ చిత్రానికి కూర్చిన సంగీతం బ్రహ్మాండంగా ఉందని చెప్పకునేలా లేదు. చాలా పాటలు, పాత మట్టుని తిరగా బోర్లా వేసిన బాపతువి. కొన్ని ఆయన పాత పాటలైతే, మరికొన్ని ఇతరుల గపాత పాటలు కూడా అనిపిస్తుంది. అయినా ఒక్క పాట మినహాయిస్తే మిగతావన్నీ అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిలోఫర్, హీరాసవంత్, షీలాజ్ ల నృత్యాలు బాగా లేవు. నిలోఫర్, అభినయం పేరిట చేసిన వికిలి చేష్టలవల్ల, బాగా కూర్చిన మొదటి డాన్సు పాడైపోయింది. రెండోది రెండందాలా వికారంగా తయారైంది.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



'నౌషెర్వాన్' చిత్రంలో నసీం, సొహ్రాబ్ మోడీ



మువీ స్టార్స్‌వారి 'అక్ష్ దావో'లో శేఖర్, షమ్మి, నూతన్.



దక్షిణరైల్వే-ఆంధ్రకళామండలి ఆధ్వర్యాన జరిగిన సన్మానసభలో శ్రీ రేలంగి, శ్రీ తాపీధర్మారావు, శ్రీమతి సావిత్రి.

తిరుపతి విశ్వవిద్యాలయానికి రేలంగి విరాళం

ప్రసిద్ధ హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి విరాళం ఇవ్వబోతున్నారు.

పదిహేను వేల రూపాయలు ఇవ్వాలని ఐదారునెలల క్రితమే నిశ్చయించడమైన వైనం విదితమే. తాపీ ధర్మారావుగారు మొన్న నిక్కడ జరిగిన సన్మాన సభలో ఈ సంగతిని పునరుద్ఘాటిస్తూ, అంజలీదేవి, భానుమతికూడా విద్యాసంస్థలకు విరాళం ఇవ్వ నిశ్చయించారనీ, ఇక, సావిత్రి తరువాయి అనీ అన్నారు.

"నామటుకు నేను నూరు చిత్రాలు పూర్తికాగానే, కానుకను సమర్పించదలచుకున్నాను. ఇప్పుడు తొంభై ఎనిమిది చిత్రాలు పూర్తి అయ్యాయి. ఇంక రెండు తరువాయి" అని రేలంగి ప్రకటించారు.

దక్షిణ రైల్వే ఆంధ్రకళామండలి నవంబరు 20 న ఈ నటీనటులను సన్మానించిన సందర్భంలో ఈ సద్గోష్ఠి జరిగింది. సెయింట్ మేరీస్ హాలులో జరిగిన ఈ సభకు తాపీ ధర్మారావు అధ్యక్షత వహించారు. నటుడు అక్కినేని నాగేశ్వరరావుకుకూడా సన్మానం తలపెట్టారు గాని, అస్వస్థతవల్ల ఆయన రాలేకపోయారు.

మండలి కార్యదర్శి శ్రీశైలం సభికులకు స్వాగతం చెప్పారు. అధ్యక్షుడు మాట్లాడుతూ, రాజకీయంగా మద్రాసు ఆంధ్రులది కాదన్నా, ఇటువంటి లలితకళా మండలులు కళాకారులను ఆదరించి సన్మానాలు చేస్తూ, నృత్య నాటక కళాప్రదర్శనాలు నిర్వహిస్తూ ఉన్నంతకాలం సాంస్కృతికంగా మదరాసు మనదిగానే నిలుస్తుందని అన్నారు. సన్మానితుల గురించి ప్రస్తావించి రేలంగిని తాను పదిహేనేళ్ళనాడు 'గొల్లభామ' సెట్స్‌మీద కలుసుకొన్నానన్నారు. "నాటినుండి నేటివరకూ ఈ నటుడి ప్రగతిని నేను గమనిస్తూ వచ్చాను. రేలంగిలో స్వతస్సిద్ధమైన ప్రతిభ అపారంగా ఉంది. కవి రాసి యిచ్చిన మాటలకు ఇతడు ప్రాణప్రతిష్ఠ చేస్తాడు. అతని నోటివెంట వస్తేనే అది హాస్యం అయి అందర్నీ నవ్విస్తుంది—" అని ధర్మారావు ప్రశంసించారు. సావిత్రి, పలకాపుస్తకాలూ పట్టుకు బళ్ళోకి పరుగులెత్తే నాటినుంచీ తాము ఎరుగుదురని, ఆ నాటి పసిపాప ఈ నాడు ప్రతిభావంతురాలై, మంచి నటిగా ఇంత పేరుతెచ్చుకుని వృద్ధిలోకి రావడం తమకు ఎంతో సంతోషం కలిగిస్తున్నదనీ ఆయన అన్నారు. ఆమె ఇంకా చాలా చిత్రాలలో నటించి, మంచి పనులు చేయాలని దీవించారు.

అనంతరం కార్యదర్శి శ్రీశైలం సన్మానపత్రాలు చదివారు. అధ్యక్షుడు, వాటిని, చందన ఫలపుష్పాదులతో, రజతబహుమతులతో సన్మానితులకు ఇచ్చి గౌరవించారు.

సావిత్రి కృతజ్ఞత తెలియచేస్తూ, తాను సంపాదించుకున్న ఆదరాభిమానాలను నిలబెట్టుకొని, తన విద్యలో మంచిస్థాయిని అందుకుంటూ ఉండడానికి శాయశక్తులా కృషిచేస్తానన్నారు. మండలి సభ్యులు ప్రదర్శించిన నాటకంలో నటుల కృషిని మెచ్చుకొన్నారు. ఆ కళామండలికి నూటపదహార్లు విరాళం ప్రకటించారు.

రేలంగి ప్రసంగిస్తూ, నాటకరంగంమీద నెగ్గుకువస్తే సినిమాలో బాగా రాణించవచ్చునని, ఇక్కడ ఉన్న వ్యవధి, అవధి అక్కడ ఉండవనీ, ప్రేక్షకులు అప్పటికప్పుడు చెప్పేసే తీర్పులతో, ఒక్కొక్కసారి మంచి నటులుకూడా డీలా పడిపోతారనీ అన్నారు. అందువల్ల నటనకు బడీ, గుడీ కూడా నాటకరంగస్థలమే నన్నారు. తాను పాల్గొనే నూతన చిత్రం విడుదలకాగానే తిరుపతి విశ్వవిద్యాలయానికి విరాళం ఇవ్వదలచినట్టు ప్రకటించారు. కళామండలికి తామకూడా నూటపదహార్లు ఇస్తున్నామన్నారు.

ఈ లలితకళామండలికి భవనం నిర్మించడానికి నిధికోసం వారు ఈ సందర్భంలోనే ఒక నాటికా ప్రదర్శనంకూడా ఏర్పాటు చేశారు. కొవ్యశ్రీ వ్రాసిన 'మానవుడు' అనే ఆ నాటికలో ఎ. రాధాకృష్ణయ్య, ఎం. ఎస్. ఎన్. రాజా, ఎస్. ఎ. రషీద్, జి. వి. జి. కృష్ణ, వి. రామమోహనరావు నటించారు. అనంతరం శ్రీ నల్లరామమూర్తి, శ్రీమతి రాజ్యంల వినోద ప్రదర్శనం జరిగింది.

పిల్లలకై ప్రత్యేకం సినిమా

పిల్లలకోసం అని ప్రత్యేకం ఒక చలన చిత్ర ప్రదర్శనశాలను ఏర్పాటుచేయాలని మద్రాసు ప్రభుత్వం నిశ్చయించింది. ఇదివరకు రాష్ట్రశాసనసభ ఉంటూ వచ్చిన హాలునే ఇందుకు కేటాయించి, అక్కడ తగు సదుపాయాలు చేస్తారు. ఈ విషయాన్ని మద్రాసు విద్యామంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం, ఇటీవల బాల చలన చిత్రోత్సవ సభలో ప్రకటించారు.

పిల్లలకోసం విరివిగా చిత్రాలు తయారు కావాలన్న ప్రయత్నం ఫలించడానికి, తయారైన చిత్రాలు ప్రదర్శించేచోట

చిత్ర సమీక్ష:

'వద్దంటే పెళ్లి'

హాస్యపూరిత ప్రహసనం చూచి సరదాగా కాలం గడపాలంటే, 'వద్దంటే పెళ్లి' (విఠల్ ప్రొడక్షన్స్) చిత్రం ఆడుతున్న సినిమాకు వెళ్లి కూర్చోవచ్చును. రెండో ఆటకి పిల్లా జెల్లాతో వెళ్ళేవాళ్లు పకోడీలు జంతికలు వగైరాలు చేసుకుని, రెండు మర చెంబులతో మంచినీళ్లు పట్టుకుని మరీవెళ్లడం మంచిది. ఎందుకంటే ఈ చిత్రం పొడుగు 19,600 అడుగులు. నడక 3 గంటల పైచిలుకు నిముషాలు. అయితే నిజానికిది చాలసేపు పరుగెడుతుంది. అందువల్ల విసుగుండదు. అనగనగా ముగ్గురమ్మాయిలు. కాశీమజిలీ కథలో రాజకుమారుడూ వాళ్లలాగా వీళ్లూ నిస్తాలుగా పెరిగి, పెళ్లిఘట్టంలో విడిపోయి ముగ్గురూ మూడు కొమ్మలెక్కి మూడు వేపులకు బయల్దేరుతారు. అందులో ఒక చిన్నదాని పేరు విద్య. అల్లారుముద్దుగా పెరిగినందువల్ల రణపెంకిగా తయారైంది. అందుకని వాళ్ళింటి గుమాస్తా రమణారెడ్డికి, ఈ రణపెంకిని ఓరాలుగాయ పిల్లాడికి కట్టబెడితే భేషుగ్గా ఉంటుందని ఊహపోతుంది. ఏనాడో దశాలు పట్టిపోయి, వేళకి తిరిగొచ్చిన పశుపతి అనే కుర్రాడికి సంగీతం మేష్టరు వేషం వేయించి విద్యకు ఆ విద్య నేర్పేందుకు కుదురుస్తాడు. తీరా వాళ్లిద్దరూ 'సా...పా'...లు పలికేవేళకి 'ధా' వీడికేం రాదనిపిస్తుంది గుమాస్తాకి. కథ అడ్డంతిరిగే లోగానే జాగ్రతపడాలని, విద్య దృష్టిని పెళ్లిమీదకు మళ్లిస్తాడు. 'నేను ఆడాళ్లని పెళ్లాడను' అని బడాయి పోయిన పశుపతి మీద కోపం కొద్దీ పంతంపట్టి, అతన్ని పెళ్లాడేస్తుంది విద్య. ఇక, అపిల్లకి, అదే కోవలో మనిషి ఆమెతల్లికీ బుద్ధిచెప్పడానికి, ఇంటాయన పరంధామయ్య, గుమాస్తా హనుమంతయ్య, అల్లుడు పశుపతి, కనె విసె వాళ్ళకి హుషారూ, తృప్తీ, కలిగించే విధాన ప్రహసనం ఫక్కీ ఉపాయాన్ని అవలంబిస్తారు. దర్శకుడు విఠలాచార్య కొత్త రచయిత రామచంద్, నటులు చలం, కృష్ణకుమారి, సి. ఎస్. ఆర్., రమణారెడ్డి, రమాదేవి, శివరాం బాలకృష్ణ, సమిష్టిగా చక్కని కృషిచేసి, అత్యంత ఆహ్లాదకరంగా ఈ "కథ"ను నడిపారు.

ఈ తరహా కథలలో, సన్నివేశాల స్వభావాన్నిబట్టి నటులు, మామూలుకన్న ఒక ఛాయ ఎక్కువ చలాకీగా నటించడం పరిపాటి. మితిమీరతకు ఈ నటనకూ ఒక పరిమితి ఉంది. అది దాటితే చలాకీతనం వెకిలితనం అనిపించుకుంటుంది. ఒకటి రెండు ఘట్టాలమీద ఈ రెండో లక్షణం క్రీనీడలు పడినా, మొత్తంమీద మెచ్చుకోతగ్గ స్థాయిని మొదట్నించి చివరదాకా నిలబెట్టారు. ముఖ్యంగా సి. ఎస్. ఆర్., చలం ఈ దృష్ట్యా ప్రశంసనీయులు. "ఎంటర్టెయిన్‌మెంటాలిటీ" ఉన్నవాళ్లు పోగల పోకన పోకడలు, మాటలలో చేష్టలలో వాళ్లుచేసే విన్యాసాల సొగసులు సి. ఎస్. ఆర్. నటనలోను, ఆయన పాల్గొన్న కొన్ని సన్నివేశాలలోనూ చూడవచ్చు. రచయితలు రామచంద్, జి. కె. మూర్తి వీటికి తగ్గట్టు, తేలికగా హుషారుగా సాగేలా సంభాషణలు వ్రాశారు. రామచంద్ వ్రాసిన పాటలుకూడా బాగున్నాయి.

ఇదీ ఒక అమ్మాయి కథ. ఇదికాక ఇంకో ఇద్దరమ్మాయిల కథలుకూడా ఉన్నాయి.

మొదటి కథలో నవ్వించే సన్నివేశాల మధ్య పాటలతో పాటు ఇవీ చోటుచేసుకుంటూ సమాంతరంగా వచ్చాయి. ఆ కథలకు 'ఇల్లాలు', 'పతిత' అని పేర్లు పెట్టవచ్చు. ఇల్లాలు కథలో పతివ్రత గౌరిగా శ్రీరంజని, భర్తగా అమర్‌నాథ్ నటించారు. గౌరి సినిమా కష్టాలను, భర్తనూ అలా భరించి నీతిగా బ్రతుకుతుంది. ఈ ఘట్టంలో ఆమె విలువైన ముక్క చెబుతుంది. "కోట్లాది కుటుంబాలున్న యీ భారతదేశంలో, మనకన్న కనికష్టస్థితిలో అవస్థపడుతున్న వాళ్ళెందరో ఉన్నారు" అని భర్తకు ధైర్యం చెబుతుంది. నటి శ్రీరంజని, ఈమంచిమాటను నిండుమనసుతో స్మరణీయమైన విధాన చెప్పింది...చివరకి ఆమె ప్రాణంమీదకు వచ్చినవేళ, భర్త, భాగ్యరేఖ, నాగులచవితి వంటి చిత్రాలలో ట్రిక్కులు గుర్తుకు తెచ్చుకుని గట్టిగా ఓమంచిపాట పాడుతాడు. వైద్యులుకూడా లాభంలేదని వదిలేసిన గౌరి, ఆ పాటధాటికి మేలుకుని, తనూ మెల్లిగా ఓచరణం అందుకుని, భర్తచేత పాట మానిపిస్తుంది. ఈ కథ అవధులమేరకు ఇద్దరూ బాగానటించారు. మూడోది పెళ్ళి పెడాకులూ లేకుండా స్వేచ్ఛగా తిరగొచ్చునన్న దురభిప్రాయంతో బయల్దేరిన కమల కథ. ఆమె



సా..



పా..



ధా!

నీతి నేర్చుకునేసరికి కాలాతీతం అయిపోయింది. ఇందులో గిరిజ, రాజనాల, చంద్రశేఖర్ అభినయం చేశారు.

గొప్ప ట్రిబుల్ ప్రోగ్రాం. ★

ఏర్పాటుకావడం అతిముఖ్యం. వ్యాపార రీత్యా పెద్ద చిత్రాలతో అవి పోటీ చేయలేవు. చేసినా చోటు దుర్లభం. అందువల్ల వీటికై ప్రత్యేకం థియేటర్లు ఏర్పడవలసిందే. మద్రాసు ప్రభుత్వం ఈ విషయంలో ముందంజవేసి, శాశ్వతంగా ఒక థియేటరు నెలకొల్పడం గొప్పవిషయం. ఈథియేటర్‌కు భారతప్రధాని శ్రీ నెహ్రూ డిసెంబరు 7 న ప్రారంభోత్సవం జరుపుతారు. ★

సినిమా వార్తలు

వాహినీ ప్రొడక్షన్స్ వారి కొత్త చిత్రం "రాజమకుటం" నిర్మాణం చురుకుగా జరుగుతోంది. గతవారమే తొలి సెట్ పై పని పూర్తి చేసివేశారు. కొత్త సెట్ పై పని ఈ వారం—ఈ నెల 6 వ ఆరంభిస్తున్నట్లు, దర్శక నిర్మాత బి. ఎన్. రెడ్డి తెలియజేశారు. ఈ చిత్రం తెలుగు తమిళ భాషలలో తయారవుతూందన్న విషయం విదితమే.

ఇందులో ఎన్. టి. రామారావు, రాజసులోచన, కన్నాంబ, గుమ్మడి, రాజనాల, పద్మనాభం పాల్గొంటున్నారు. కథ, మాటలు డి.వి. నరసరాజు వ్రాశారు. పాటలు దేవులపల్లి కృష్ణశాస్త్రి, కొసరాజు వ్రాస్తున్నారు.

సంగీత దర్శకుడు వేణు.

* * *

తమిళనాడులో విజయవంతంగా సాగిన "నీలమలై తిరుడన్" చిత్రాన్ని, రవి ఫిలింస్ వారు "కొండవీటి దొంగ" పేరిట, తెలుగులో అందజేయబోతున్నారు. ఇందులో అంజలీదేవి, రంజన్, ఇ.వి. సరోజ మొదలగు వారు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎం.ఎస్. రామ్, ఎస్. ఎల్. మర్చెంట్ సంగీతం సమకూర్చుతున్నారు. పర్యవేక్షణ రమేష్ నాయుడు. నిర్మాతలు మాధవరావు, దూంతేశ్వరరావు.



మదరాసు క్రైస్తవ కళాశాల ఆంధ్ర భాషాభిరంజనీ సంఘం ఆధ్వర్యాన జరిగిన ఆంధ్రప్రదేశ్ అవతరణ వార్షికోత్సవపు సందర్భాన తీసినచిత్రం: ఎడమనుండి కుడికి: వై. యస్. రామమూర్తి (ప్రధాన కార్యదర్శి), శరణబసప్ప (సహాయ కార్యదర్శి), శ్రీమతి జానకి, శ్రీ యస్. వి. రంగారావు, శ్రీ బి. యన్. రెడ్డి, శ్రీ వి. రఘునాథరెడ్డి (అధ్యక్షుడు).

నాగమణి

రామన్. బి. దేశాయ్ నిర్మించిన పౌరాణిక చిత్రం "నాగమణి" ఇటీవల బొంబాయిలో విడుదలఅయింది. ఇందులో నిరూపరాయ్, మన్హర్ దేశాయ్, త్రిలోక్ కపూర్, పి. కైలాస్ ప్రభృతులు నటించారు. సంగీతం అవినాష్‌వ్యాస్ సమకూర్చారు. ప్రముఖ కవి ప్రదీప్ పాటలు వ్రాశారు.

"నాగమణి" ఇతివృత్తం సుపరిచితమైనదే. సతీసుకన్య కథ. ఇంద్రుడి ఆగ్రహం ఫలితంగా యౌవనం కోల్పోయిన చ్యవన మహర్షిని రాజకుమార్తె సుకన్య పెళ్లి చేసుకుంటుంది. ఆమె పాతివ్రత్య మహిమవల్ల ఆమె భర్తకు తిరిగి యౌవనం లభిస్తుంది. ఇంద్రుడు పరాజితుడౌతాడు.

తెరమీద చూచి తెలుసుకోతగ్గ విధంగా దీన్ని చిత్రించడానికి. దర్శకుడు రామన్ దేశాయ్ కృషిచేసినా, ఆశించినంత గొప్పగా ఇది రూపొందలేదు. కాగా ఛాయాగ్రహణం కూడా ఇందుకు చెప్పతగ్గ దోహదం చేయలేదు. నిజానికి ఇలాంటి చిత్రాలలో కెమెరా గారడీలు పుష్కలంగా ఉంటాయి. అవే ప్రత్యేకాకర్షణలుఅవుతాయి. అలాంటివి ఇందులోనూ ఉన్నాయి కాని, నిర్లక్ష్యంగా వ్యవహరించి నందువల్ల, చాలా పొరబాట్లు, కొన్నిచోట్ల తప్పులూ కూడా కనబడతాయి. నటన మటుకు మంచి స్థాయిలో ఉంది. సతీసుకన్యగా నిరూపరాయ్, ఆమె భర్తగా మన్హర్ దేశాయి, ఉత్తమంగా నటించారు. మిగతా నటీనటులంతా యథోచితంగా పాత్రకు లోపం వాటిల్లనీయకుండా నటించారు.

పాటల గురించి చెప్పుకోవడానికి బోలెడన్ని విశేషణాలు వాటికి లేవక్కరలేదు. గాని, కొన్నిటిలో సాహిత్యం చాలా బాగుంది. కొన్నిటిలో మాత్రం సంగీతం కూడా వినడానికి హాయిగా ఉంది. ★

(ఆంధ్రవారపత్రిక బొంబాయివిలేఖరి)



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమంత్రుల, శాసనసభ్యుల ప్రశంస లందుకొన్న అనుపమ ఫిలింస్ వారి సమస్యాత్మక చిత్రం "ఎం. ఎల్. ఎ."ను నవంబరు 12-న విజయాగార్డెన్స్‌లో మద్రాసు మంత్రులకు, శాసనసభ్యులకు ప్రత్యేకంగా చూపించారు. ఈ చిత్రంలో ఎడమనుంచి: రచయిత శ్రీ తాపీధర్మారావు, 'విజయా'ధిపతి శ్రీ బి. నాగిరెడ్డి, మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కె. కామరాజ్.

పెట్రోల్ పుట్టుక

(26 వ పేజీ తరువాయి)

బావులు, ఈమధ్య కనబడిన నహార్ కటియా బావులు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.

ఫలానాచోట నూనె లభిస్తుందని ఎలా కనిపెడతారు? ఇది భూగర్భ శాస్త్రజ్ఞుల పని. భూమి చరిత్రను బాగా పరిశోధించిన వాడికిగాని నూనె దర్శనం ఇవ్వదు. మడ్డి వలన ఏర్పడినరాళ్ళు ఒకప్పుడు సమరేఖలో ఉండేవి. ఆ రాళ్ళ పొరలు ఎక్కడ, ఏ విధంగా అర్ధగోళాకృతిగాను, ఎగుడు దిగుడుగాను చెదరిపోయాయో అతడు కనిపెట్టాలి.

ఇది కనిపెట్టడానికి శాస్త్రజ్ఞుడు భూగర్భ పటం తయారుచేయాలి. వివిధమైన పొరలు ఎలాంటివో పరిశోధించాలి. ఉపరితలంమీద ఉన్న రాయి స్వభావం, దాని వయస్సు, అది ఎలా ఏర్పడిందీ చూడాలి. నీటి బావులను, దొరువులను, గోతులను కూడా పరీక్షించాలి.

ఈపద్ధతులేమీ పనికిరానప్పుడు నూనె పరిశోధకుడు భూభౌతికశాస్త్ర సహాయం తీసుకుంటాడు. ఒక లోతైనగొయ్యి తవ్వి అందులోకి విద్యుచ్ఛక్తి ప్రసారం చేస్తాడు. వివిధ శిలలయొక్క అయస్కాంతశక్తి, గురుత్వాకర్షణ శక్తిలోని మార్పులను కొలుస్తాడు. ఇదీ కాకపోతే లోతుగా డైనమైట్ పెటి చిన్న భూకంపం కలిగిస్తాడు. ఏయే శిలల నుండి ఎలాంటి ప్రతికంపనాలు వస్తున్నాయో రికార్డు చేస్తాడు. ఆయా పద్ధతుల వల్ల భూగర్భంలోని రకరకాల పొరల పటం ఒకటి తయారుచేసుకుంటాడు. ఒకరకంరాతి పొరల్లో ఇతిరరకం రాతిపొరలు ఎగుడు దిగుడుగా ఏర్పడ్డచోట్ల 'ఆ, ఇక్కడ నూనె దొరకచ్చు.' అంటాడు. మడ్డిరాతి పొరమీదుగా ఉప్పుపొర అర్ధగోళాకారంగా ఏర్పడ్డచోట 'నూనె దొరకచ్చు' అంటాడు. లేక మడ్డిరాతి పొరలే అర్ధగోళాకారంగా ఎత్తుగా ఏర్పడ్డచోట 'దొరకచ్చు' అంటాడు. 'దొరకచ్చు' అంటాడేగాని "దొరికి తీరుతుంది" అని రాసి ఇవ్వడు. ఎందుకంటే ఖచ్చితంగా ఇక్కడ తవ్వితే నూనె దొరుకుతుంది' అని చెప్పదగినంత బాగా భూగర్భ తైలశాస్త్రం వృద్ధి పొందలేదు.

అందుచేతనే నూనెపరిశ్రమ చాలా ఖర్చుతో కూడినపని. నూనె దొరుకుతుందనే ఆశతో తవ్వితే మట్టి దొరకచ్చు. ఒక్కొక్క నూనెబావి తవ్వడానికి ఆయా లోతుల్నిబట్టి లక్ష డాలర్లనించి పదిలక్షల డాలర్లదాకా ఎంతయినా ఖర్చుకావచ్చు. సగటున చూస్తే, 9 బావులు తవ్వితే ఒక బావిలో నూనె పడుతుంది, మిగతా ఎనిమిది వృథాయే. అయితే నూనెదొరికిన ఆ ఒక్క బావి ఎంతఖర్చు వృథాయైనా ఫరవాలేదనిపిస్తుంది. ★

విశాఖపట్టణం నూనెశుద్ధియంత్రాగారం

(29-వ పేజీ తరువాయి)

స్తుంది:—16 వేల టన్నుల సిమెంటు పట్టింది. 80 వేల టన్నుల ఉక్కు కావల్సి వచ్చింది. అరంగుళం నుంచి 24 అంగుళాల దాకా మూతులుగల గొట్టాలు దాదాపు నూరుమైళ్ళ మొత్తం పొడుగున, నిర్మించారు. ఎన్నో వేల టన్నుల నల్లరాళ్ళను పగలకొట్టి సుత్తులతో చెక్కి నూనె గిడ్డంగుల నిర్మాణంలో ఉపయోగించారు. సబ్‌కంట్రాక్టర్లు దాదాపు రెండు వేల మంది రాతి కార్మికుల చేత పని చేయించారు. పని బాగా జోరుగా సాగే రోజుల్లో 9000 మందికి పైగా భారతీయ కార్మికులు పని చేశారు. వీళ్ళలో

★ విశాఖపట్టణం నూనెశుద్ధి యంత్రాగారం ★

చాల మంది తెలుగువాళ్ళే. వీళ్ళకు జీవనోపాధి ఏర్పడడమే కాదు, వెల్డింగ్, ఉక్కుపని, వడ్రంగం, మొదలైన ఎన్నో పనుల్లో మంచి తర్ఫీదు కూడా లభించింది. ఇప్పుడు దాదాపు 500 మంది పర్మనెంటు పనివాళ్ళున్నారు. వీరిలో కొలదిమంది భారతీయ కార్మికులు ఫిలిప్పైన్స్‌లోని బటాంగాస్ నూనెశుద్ధి కర్మాగారంలో పనిచేసి అనుభవం గడించినవాళ్ళే.

నూనె గిడ్డంగుల నిర్మాణాన్ని చికాగో బ్రిడ్జ్ లిమిటెడ్ నిర్వహించింది. ప్రాసెస్ యంత్రాలను, బాయిలర్లను, విద్యుత్ యంత్రాలను లూమస్ కంపెనీ నిర్మించింది. రోడ్లు వేయడం, గోడలు, భవనాలుకట్టడం భారతీయ కంట్రాక్టర్లే చేశారు.

12 నెలల స్వల్పకాలంలో అంటే 1957 జనవరికల్లా 68 గిడ్డంగులు కట్టేశారు. దాంతో కర్మాగారానికి సంబంధించిన బరువు పని అంతా అయిపోయినట్లయింది. ఈ గిడ్డంగుల సైజు 8 అడుగుల వెడల్పునుంచి, 160 అడుగుల వెడల్పుదాకా రకరకాలుగా వుంటుంది. వీటికి దాదాపు 7600 టన్నుల ఉక్కు పట్టింది. ముడినూనె కాని, శుద్ధిఅయిన నూనె కాని మొత్తం 6½ కోట్ల గాలన్లదాకా ఈ గిడ్డంగుల్లో నిలవచేయవచ్చు.

ముడినూనె నిలవచేసేందుకు నాలుగు గిడ్డంగులున్నాయి. ఈసంవత్సరం ఫిబ్రవరి 18-వ ముడినూనె తీసుకువచ్చిన మొదటినౌక విశాఖపట్నం చేరింది. కొత్తగాకట్టిన రేవు నుంచి మైలుపొడుగు గొట్టంద్వారా ముడినూనెను గిడ్డంగిలోకి 'పంప్' చేసి పంపించారు.

మామూలుగా నూనె రవాణా నౌక ఒక్కొక్కటీ 1,20,000 పీపాల నూనె మోసుకు రాగలదు. ఇట్లాంటి నౌకలు ఏడాదికి 45 వస్తేకాని విశాఖపట్నం కర్మాగారానికి సరిపోదు.

ఇక్కడ ఏటా 7,40,00,000 గాలన్ల మోటారుగాసొలిన్, 21,257 గాలన్ల మేలురకం కిరసనాయిలు, 81,77,809 గాలన్ల అడవారకం కిరసనాయిలు, 8,16,81,000 గాలన్ల డీసెల్ నూనెలు. 2,64,95,000 గాలన్ల ఇంధన తైలాలు తయారవుతాయి.

కాల్టెక్సునూనె శుద్ధి కర్మాగారంలో అత్యంత నవీన పద్ధతులలో పనిచేసే యంత్రాగారాలు ఉన్నాయి. వీటిలో రిపేరు పనులన్నీ జరుగుతాయి. పనిముట్లశాల, పనిముట్ల కార్ఖానా, విద్యుత్పరికరాలు, రంగులు ఉంచేశాల, యంత్రాలు, బాయిలర్లు ఉంచే శాలలు, వెల్డింగ్, కమ్మరి కార్ఖానాలు, ఇంకా ఎన్నోరకాలవి ఇక్కడున్నాయి.

కర్మాగారంలోని ప్రయోగశాలలలో ముడినూనెను, శుద్ధిఅయిన నూనెలను పరీక్ష చేసేందుకు కావలసిన నవీన పరికరాలున్నాయి. ఉత్పత్తి అయిన పదార్థాల ప్రమాణాన్ని ఎప్పటికప్పుడు పరీక్ష చేసి నిగ్గుతేల్చేందుకు నిపుణులైన టెక్నీషియన్లు ఇరవయి నాలుగుగంటలూ సిద్ధంగా ఉంటారు.

ఉప్పునీటి ఉపయోగం

కాల్టెక్సు కంపెనీ విశాఖపట్నంలోనే ఈ కర్మాగారాన్ని కట్ట నిశ్చయించడానికి కొన్ని ముఖ్య కారణాలున్నాయి. పెద్ద పెద్ద రవాణానౌకలను భరాయించగల పెద్ద హార్బరు విశాఖ పటణానికి ఉంది. హార్బరు అధికారులు ప్రత్యేకంగా నూనె నౌకలు రావడానికి వీలుగా ఒకరేవుకూడా కట్టించారు. ఈ రేవులోకి ఒకేసారి రెండు గిడ్డంగి నౌకలు రావడానికి వీలుంది. హార్బరు ముఖద్వారాన్ని ఇంకా లోతుచేయించి, ఇంకా పెద్దగిడ్డంగి నౌకలు రావడానికి వీలు కలిగించాలని హార్బరు అధికారులు ఇప్పుడు ప్లాను వేస్తున్నారు.

విశాఖపట్టణంలో మంచినీటిని డబ్బులాగా వాడుకోవాలి. అందుకోసం కాల్టెక్సు అధికారులు యంత్రాల్ని చల్లబరిచే పనులకు సముద్ర జలాన్నే వాడుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకున్నారు.

ఇంకోచిత్రం: భారత నౌకాదళంవారి డిపోకి ఎకాయెకి నూనె సప్లయిచేసేందుకు వీలుగా నీటి అడుగునుంచి రెండు గొట్టాలు నిర్మించారు.


అగ్నినిర్వాపకదళం ఒకటి ఎల్లవేళలా తయారుగా ఉంటుంది. ఈ దళంలో అందరూ సుశిక్షితులు. కర్మాగారం మరోటీ మరోటీకాదు; నూనెశుద్ధి కర్మాగారం! అందుచేత అగ్నిభయం ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ఈ కారణంచేత సిబ్బందిలోని తదితరులు కూడా మంటలార్పే పనిముట్లను ఉపయోగించడంలో తర్ఫీదు పొందారు.

కార్యాలయభవనం రెండంతస్తుల ఎయిర్ కండిషన్డ్ మేడ; దాదాపు వంద మంది పనిచేయడానికి వీలైనది. ఈ భవనంలోనే 16 మిల్లిమీటర్ల మైక్రో ఫిలిం సిబ్బంది వారుంటారు. వీరు ముఖ్యమైన విశేషాలను రికార్డుచేస్తారు. ప్రథమచికిత్సా సౌకర్యాల కార్యాలయం, అగ్నినిర్వాపకదళ కార్యాలయం, ప్రయోగశాల, మొదలైనవన్నీ ప్రధాన భవనానికి అనుకునే ఉన్నాయి.

కర్మాగారానికి ఒక మైలు దూరాన సిబ్బంది నివాసప్రాంతముంది. దీన్ని 'నేషనల్ హౌసింగ్ కాలనీ' అంటారు. నూరుకుటుంబాలు ఈ కాలనీలో హాయిగా కాపరం ఉండవచ్చు! మొత్తం యాభైఇళ్లున్నాయి. ఒక్కొక్క ఇంట్లో రెండు వాటాలు. ఏ వాటాకి ఆ వాటా ఇంకోళ్లతో ప్రమేయంలేకుండా ఉండవచ్చు. ఈ కాలనీకి ఒక పార్కు ఉంది. చిన్న చిన్న తోటలు వేసుకోవడానికికూడా జాగా జాగా ఉంది. ఉన్నతాధికారుల కాపరాలకి ఏడు మైళ్లదూరంలో ఇంకో కాలనీఉంది. అక్కడ నాలుగేసి వాటాలుగల 12 ఇళ్లు, ఇంకా విడివిడి బంగళాలు ఉన్నాయి. ఈ ఇళ్లలో ఆధునిక సౌకర్యాలన్నీ ఉన్నాయి. స్విమింగ్‌పూల్సు, అతిథులెవరైనా వస్తే ఉండడానికొక ఇల్లు, ఒక పాఠశాల, ఇతర సదుపాయాలకింకా వేరే భవనాలు అన్నీ ఉన్నాయి.

కాల్టెక్సు కర్మాగారం 24 గంటలూ పనిచేస్తూనే ఉంటుంది. భారత ప్రజలకు అవసరమైన మేలిరకం నూనెపదార్థాలను భారతదేశంలోనే తయారుచేసిఇవ్వాలనే కాల్టెక్సు కంపెనీ ఆశయాన్ని ఈ కర్మాగారం నెరవేరుస్తోంది. ఈవిధంగా భారతదేశానికి ఉజ్వలభవితవ్యాన్ని సాధించడంలో కాల్టెక్సు నూనెశుద్ధి కర్మాగారం ప్రముఖపాత్ర నిర్వహిస్తోంది. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



అన్నవరం దేవాలయగోపురం

ఫొటో : [illegible]. రామానుజశాస్త్రి—అమలాపురం]